ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 18.10.2025 | సంపుటి : 12 సంచిక : 88 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం



హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## తెలంగాణలో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

- ఆహ్వానిస్తూ పంచాయతీరాజ్ శాఖ నోటిఫికేషన్
- తొలి విడతలో రూ.6,294 కోట్ల ఖర్చుతో 2,162 రోడ్ల నిర్మాణం
- 17 ప్యాకేజీల్లో 7,449 కిలోమీటర్ల మేర నిర్మాణం
- 30 నెలల్లో నిర్మించి 15 ఏళ్లు నిర్వహించాలని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఆహ్వానిస్తూ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. నిర్మాణ సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తూ ఈ నోటిఫికేషన్ ఇచ్చింది. 30 నెలల్లో రోడ్లు నిర్మించి 15 ఏళ్లు

మిగతా 2లో..

## భారత్‌కు మెహుల్ ఛోక్సీ
### అప్పగింతకు బెల్జియం కోర్టు ఆమోదం



2లో..

## బీసీ రిజర్వేషన్ల సాధనకు
# నేడు రాష్ట్ర బంద్

### సంఘీభావంగా అఖిలపక్ష, బీసీ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

- హాజరైన మందకృష్ణ, కోదండరాం
- బీసీ సంఘాలకు అన్ని పార్టీల మద్దతు



ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నినాదాలు వేస్తున్న బీసీ ఐకాస చైర్మన్ ఆర్.కృష్ణయ్య.. చిత్రంలో కోదండరాం, మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హైదరాబాద్(జనంసాక్షి): బీసీ రిజర్వేషన్ల పరిరక్షణే ధ్యేయంగా ఈనెల 18 న తెలంగాణ బంద్‌కు బీసీ సంఘాల ఐకాస పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో బంద్‌కు మద్దతుగా అఖిలపక్ష, బీసీ సంఘాలు హైదరాబాద్‌లో ముందస్తు సంఘీభావ ర్యాలీ నిర్వహించాయి. బషీరాబాగ్ కూడలి నుంచి ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. బీసీ ఐకాస చైర్మన్ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బీసీ ఐకాస వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

మిగతా 2లో..



## ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట ఆయుధంతో
# లొంగిపోయిన ఆశన్న

### ఆయనతో పాటు 208 మంది సభ్యులు కూడా..

- భారీగా ఆయుధాలు అప్పగింత
- పునరావాసానికి ఏర్పాట్లు చేస్తామన్న ముఖ్యమంత్రి
- మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు

రాయపూర్(జనంసాక్షి): మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. ఇది ఛత్తీస్‌గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం.

మిగతా 2లో..

## కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగానే బంద్

2లో..

- బీసీ బిల్లును అడ్డుకున్నది బీజేపీనే
- దమ్ముంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి: భట్టి





## కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

- పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): కార్పొరేట్‌కుదీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. శుక్రవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ " ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి. తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ పై దృష్టి సారించండి. ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి. ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలి. ఇందుకు విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించండి.

మిగతా 2లో..

## బీహార్ మహాఘట్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ

### కాంగ్రెస్ ఎంపీ అఖిలేష్ ప్రసాద్ సింగ్ ప్రకటన

పాట్నా(జనంసాక్షి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ దగ్గర పడుతుండగా విపక్ష మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత వచ్చింది. కూటమి ప్రధాన భాగస్వామ పక్షమైన ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ 'మహాఘట్‌బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి అని కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్ అధికారికంగా శుక్రవారం ధ్రువీకరించారు. పాట్నాలోమీడియాతో ఆయన

మిగతా 9లో..





## రూ.110 కోట్ల భూమికి విముక్తి

### కుల్సుంపురాలో కబ్జాకోరల నుంచి విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్(జనంసాక్షి): గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపురాలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ప్రజావసరాలకు ఈ భూమిని వినియోగించాలని గతంలో ప్రభుత్వం భావించింది. మరోవైపు అశోక్ సింగ్ అనే వ్యక్తి దీన్ని తన భూమిగా చెబుతున్నాడు. ఈక్రమంలో సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూమిలో ఇప్పటికే రెండు సార్లు రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. అయినా అశోక్ సింగ్

మిగతా 2లో..

## స్థానిక ఎన్నికలపై స్పష్టత ఇవ్వండి



### రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించిన హైకోర్టు
### గడువు కోరడంతో విచారణ రెండు వారాలకు వాయిదా



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటుచేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హోకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9 న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే

మిగతా 2లో..

## సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై దృష్టిసారించాలి

### బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి



హైదరాబాద్(జనంసాక్షి): మాదక ద్రవ్యాలు, స్మగ్లింగ్, టెర్రరిజాన్ని అడ్డుకోవడంలో ఐపీఎస్‌లే కీలకమని బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 77వ ఐపీఎస్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ హక్కులను కాపాడాలని, ముందున్న సవాళ్లు అధిగమించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై దృష్టి పెట్టాలన్నారు. ధనవంతులు, పేదవారిని ఒకేలా చూడాలని సూచించారు. "ఆపరేషన్ సిందూర్‌లో పోలీసు సిబ్బంది ఎంతో సహకారం అందించారు. సాయుధ దళాలతో కలిసి పనిచేశారు. సాంకేతికత మీద మాత్రమే ఆధారపడొద్దు.. క్షేత్ర స్థాయిలో పని చేయాలి. పోలీసు స్టేషన్ అనేది ప్రతి పౌరుడికి మొదటి నమ్మకం. ఐపీఎస్‌లుగా మీకు ఎన్నో ఒడుదొడుకులు ఉంటాయి. ఆరోగ్యం, ఫిట్‌నెస్ కూడా చాలా ముఖ్యం. మీరు బలంగా ఉంటేనే విధుల్లో సమగ్రంగా

మిగతా 2లో..

## నామినేషన్ దాఖలు చేసిన నవీన్ యాదవ్

- యూసుఫ్ గూడ నుంచి భారీ ర్యాలీతో రాక
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, వివేక్

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం హైదరాబాద్ మేయర్ గద్వాల

మిగతా 2లో..



## యూపీలో దళితులపై దమనకాండ

### నన్ను కలవొద్దని బాధిత కుటుంబాన్నీ బెదిరించారు: రాహుల్ గాంధీ

లక్నో(జనంసాక్షి): ఉత్తర ప్రదేశ్ రాయ్‌బరేలీలో గాంధీ జయంతి నాడు దొంగ అనే అనుమానంతో హరీఓం వాల్మీకి అనే దళితుడ్ని కొందరు కొట్టి చంపారు. ఈ ఘటన అక్కడ తీవ్ర దుమారం రేపింది. శుక్రవారం ఫతేపూర్‌లో పర్యటించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యూపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను కలవొద్దని ఈ ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని బెదిరించిందని.. అది కుదరకపోవడంతో ఫేక్ ప్రచారానికి దిగిందని మండిపడ్డారాయన. దేశంలో దళితులపై దాడులు, హత్యలు, అఘాయిత్యాలు, హత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ కుటుంబం ఎలాంటి నేరం చేయలేదు. ఇది ఒక బాధిత కుటుంబం. కానీ వీళ్లేదో నేరస్తులన్నట్లు ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

మిగతా 2లో..



## కమీషన్ల కోసం మంత్రుల కొట్లాట

రాష్ట్రానికి పూర్తిగా తగ్గిపోయిన పెట్టుబడులు
తెలంగాణ అంటేనే భయపడుతున్న పరిశ్రమలు: హరీశ్

## గుజరాత్‌లో కొలువుదీరిన మంత్రివర్గం

క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య కూడా ప్రమాణ స్వీకారం

## పత్తిని కేంద్రమే కొంటుంది

సీసీఐ ద్వారా క్వింటాల్‌కు రూ.8,110/-
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

## అఫ్గాన్, భారత్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం

మరోసారి పాక్ రక్షణ మంత్రి ప్రేలాపణలు

2లో..

## అమెరికాలో భారతీయులకు
# మరో ఎదురుదెబ్బ



- గ్రీన్‌కార్డ్ లాటరీలో తక్కువ వలసలు ఉన్న దేశాలకు ప్రాధాన్యం
- 2028 వరకు యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీకి భారత్ దూరం

వాషింగ్టన్(జనంసాక్షి): ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలో పాల్గొనేందుకు భారతీయులకు 2028 వరకు అవకాశం లభించదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ కార్డ్ లాటరీ కార్యక్రమంలో గత ఐదేళ్లలో అమెరికాకు తక్కువ వలసలు ఉన్న దేశాల దరఖాస్తుదారులను ఎంచుకుంటున్నట్లు తెలిపాయి. ఏటా 50 వేల మంది లోపు అమెరికాకు వలసవచ్చే దేశాలకే అవకాశం ఇస్తున్నట్లు సమాచారం. అమెరికాలో అన్ని దేశాల కు చెందిన వలసదారులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీసా లాటరీలో పాల్గొనడానికి అనుమతి ఉన్న దేశాలకు తాజా వీసా కేటాయింపులను ప్రకటించారు. గత కొన్నేళ్లుగా భారత్ నుంచి అమెరికాకు అధికంగా వలసలు ఉండడంతో భారతీయులకు ఈ వీసా కార్యక్రమానికి కావాల్సిన అర్హత పరిమితి

మిగతా 2లో..



## డిజిటల్ అరెస్టు మోసాలపై మీ స్పందనేంటీ?

- కేంద్రం, సీబీఐలకు సుప్రీం ఆదేశం
- ఈ తరహా మోసాలపై ధర్మాసనం ఆందోళన

న్యూఢిల్లీ(జనంసాక్షి): డిజిటల్ అరెస్టులు ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా ఇదే. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ.. పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 18.10.2025

## కార్పొరేట్‌కు దీటుగా
# సర్కారు బడులు

సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించండి నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి.అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయండి.విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి.2026 జూన్ లో అకడమిక్ ఇయర్ నుంచి అమలు జరిగేలా యాక్షన్ ప్లాన్ తో ముందుకెళ్లాలి" అని అన్నారు.

## స్థానిక ఎన్నికలపై
# స్పష్టత ఇవ్వండి

ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల పక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరపు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

## యూపీలో దళితులపై దమనకాండ

నన్ను కలవొద్దని వీళ్లను పోలీసులు బెదిరించారు. వీళ్లను కనీసం ఇంట్లో నుంచి బయటకు రానివ్వడం లేదు. హరీఓం కుమార్తెకు శస్త్రచికిత్స అవసరం. వీళ్ల ఆంక్షలతో ఆమెకు కనీస వైద్యసేవలు అందడం లేదు. చర్యలు తీసుకోవాల్సింది నేరస్తుల మీద. వీళ్ల మీద కాదు. నేరస్తుల రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది అని యోగి సర్కార్‌పై మండిపడ్డారు.ఇదిలా ఉంటే.. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో రాజకీయ దుమారం రేగింది. మాకు మీ పరామర్శ అక్కర్లేదు.. ప్రభుత్వం తగినంత సాయం చేసింది అనే పోస్టర్లు అక్కడ వెలిశాయి. అయితే.. కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పోస్టర్లను చించేయగా.. బీజేపీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఇంకోవైపు.. హరీఓం సోదరుడు, ఆ కుటుంబం పేరిట కొన్ని వీడియోలు విపరీతంగా వైరల్ అయ్యింది.రాష్ట్ర మంత్రులు మా ఇంటికి వచ్చి పరామర్శించారు. మా సోదరికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చారు. నేరస్తులు జైల్లో ఉన్నారు. ప్రభుత్వ చర్యలతో మేం సంతృప్తిగానే ఉన్నాం. రాహుల్ గాంధీ సహా నేతలెవరూ మా ఇంటి వైపు రావొద్దు అంటూ ఆయన చెప్పడం అందులో ఉంది. పైగా బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయానే వాటిని పోస్ట్ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ఈ వీడియోలపై మీడియా నుంచి రాహుల్ గాంధీకి ప్రశ్న ఎదురైంది. ఇంతకు మించి దిగజారదు అనుకున్న ప్రతీసారి బీజేపీ ఇలానే చేస్తోందని రాహుల్ గాంధీ అన్నారు. అది బలవంతంగా తీయించిన వీడియో అని, ఆ వీడియోను మోదీ అనుకూల మీడియా బీజేపీ విపరీతంగా ప్రచారం చేస్తున్నాయని అన్నారాయన. అయితే కాసేపటికే రాహుల్‌ను కలవడం సంతోషంగా ఉందంటూ మరో వీడియో ఆ కుటుంబం పేరిట బయటకు రావడం గమనార్హం. అక్టోబర్ 2వ తేదీన జమునాపూర్ వద్ద హరీఓం వాల్మీని దొంగగా అనుమానించి కొందరు కొట్టి చంపారు. ఈ ఘటన యూపీ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. విమర్శల నేపథ్యంలో కేసు విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయించింది యోగి ప్రభుత్వం. అక్టోబర్ 11వ తేదీన బాధిత కుటుంబాన్ని యోగి పరామర్శించారు. ఆ కుటుంబం కార్చిన ప్రతీ కన్నీటి బొట్టుకు ప్రభుత్వం సమాధానం చెబుతుందని ఆ సమయంలో భరోసా ఇచ్చారాయన. అంతేకాదు.. హరీఓం సోదరికి కాంట్రాక్ట్ బేస్ మీద స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగం ఇప్పించారు. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడిని అక్టోబర్ 10న ఎన్‌కౌంటర్‌లో పట్టుబడ్డాడు. ఇప్పటిదాకా 14 మందిని పోలీసులు ఇప్పటిదాకా అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి విమర్శల నేపథ్యంలో.. ఐదుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. జాతి కోణంలో ఈ ఘటనను చూడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా.. సోషల్ మీడియాలో చర్చ మాత్రం ఆగడం లేదు.

## డిజిటల్ అరెస్టు మోసాలపై మీ స్పందనేంటీ?

ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సీబీఐలకు వారి స్పందన తెలపాలని న్యాయస్థానం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. హరియాణా లోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. అందులో.. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారన్నారు. రూ.కోటి ఇస్తే ఈ అరెస్టు నుంచి బయటపడొచ్చని వారు బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి నేరగాళ్లు సొమ్ములు కాజేయడాన్ని సీజేఐతో సహా సీనియర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు. అంబాలా కేసును న్యాయస్థానం సుమోటోగా తీసుకోగా.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు సంబంధించి నకిలీ సంతకాలు, సుప్రీం, హైకోర్టులు ఆదేశాలు జారీ చేసినట్లు పత్రాలు చూపించి ఇలాంటి నేరాలకు పాల్పడటం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని ధర్మాసనం పేర్కొంది. వీటిని సాధారణమైన మోసాలుగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. ఇలాంటి నేరాలను బయటపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడింది. ఇక, అంబాలా కేసుకు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని అటార్నీ జనరల్‌ను, స్థానిక సైబర్ క్రైమ్ విభాగానికి సూచించింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి స్పందన తెలియజేయాలని కేంద్రం, సీబీఐలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## కమీషన్ల కోసం మంత్రుల కొట్లాట

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో మంత్రులు ప్రజలకు సేవ చేయాల్సింది పోయి కమిషన్ల కోసం కొట్లాడుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్ విమర్శించారు. రేవంత్ రెడ్డి హయాంలో పెట్టుబడులు తగ్గడంతో పాటు, తెలంగాణకు గన్ కల్చర్ వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నివేదికల ప్రకారం తమ హయాంలో కన్నా పెట్టుబడులు పూర్తిగా తగ్గిపోయాయని అన్నారు. బెదిరింపులు, వసూళ్లే ఇందుకు కారణమని అన్నారు. ఈ విషయంలో సీఎంపై కేబినెట్ మంత్రి కుటుంబ సభ్యులే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. మంత్రి కుటుంబ సభ్యుల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే తుపాకీ పంపించారని, తమ్ముళ్ల కోసం ఫైల్స్ ఆపుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ దండుపాళ్యం ముఠా మాదిరిగా తయారైందని ఎద్దేవా చేశారు.వ్యాపారవేత్తలకు తుపాకులు పెట్టే సంస్కృతిని రేవంత్ హయాంలో తీసుకొచ్చారని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి హయాంలో మాత్రం అవినీతి వాటాల కోసం కొట్లాడు కుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలు, సినిమా ఇండస్ట్రీ, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించి లొంగ దీసుకుంటున్నారని ఆరోపించారు.

# బీసీ రిజర్వేషన్ల సాధనకు నేడు రాష్ట్ర బంద్

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. జనాభాలో సగభాగానికి పైన ఉన్న బీసీలకు తప్పకుండా రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. శనివారం జరిగే తెలంగాణ బంద్‌లో పార్టీలు, సంఘాలకు అతీతంగా శ్రేణులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బంద్ ఫర్ జస్టిస్ పేరుతో నేడు బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్, లెఫ్ పార్టీలు కూడా బంద్‌కు మద్దతు ఇచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ఆవేదనను తెలియచేయాలని ఆర్ .కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఇప్పటికే అన్ని పార్టీలను నేరుగా కలిసి కోరారు. బిసి బంద్‌కు అందరి మద్దతు ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేపటి బీసీ బంద్‌ని జయప్రదం చేయాలని సూచించారు. రేపటి బీసీ బంద్‌కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని ఉద్ఘాటించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జనగణనలో భాగంగా కులగణన జరగాలని కోరారని పేర్కొన్నారు కాంగ్రెస్ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్పీ వేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలని ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి బీసీ బంద్‌కి మద్దతు కోరారని గుర్తుచేశారు. ఆర్. కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్. కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా చేయాలని కోరారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లని ఆర్. కృష్ణయ్య ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. తాము కూడా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వారితో కలిసి ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీని, రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బీసీలకు న్యాయం చేసి బీజేపీ క్రెడిట్ తీసుకున్న తమకు నష్టం లేదని చెప్పుకొచ్చారు. కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకి ఆమోదం తెలిపి గవర్నర్‌కి పంపించామని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ చర్చిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వాతంత్రం ఉంటుందని ఉద్ఘాటించారు. అప్పుడప్పుడూ సమస్యలు వస్తాయని.. అవి సద్దుమనుగుతాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో నియంత పాలన ఉండదని.. సమస్యలన్నీ సద్దుమనుగుతాయని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలేనని, టీ కప్పులో తుఫాన్ లాంటివేనని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

బంద్‌కు జాగృతి సంపూర్ణ మద్దతు : కవిత

బీసీ బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని

## కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగానే ఈ బంద్

ఖమ్మం,అక్టోబర్17(జనంసాక్షి):కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించా మని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపిం చినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని భట్టి మండిపడ్డారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయస్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టక పోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు. బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఈ బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు.

## నామినేషన్ దాఖలు చేసిన
# నవీన్ యాదవ్




విజయలక్ష్మి పాల్గొన్నా రు. నవీన్ యాదవ్ యూసుఫ్ గూడ నుంచి నామినేషన్ వేయ డానికి భారీ ర్యాలీగా వెళ్లారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాం గ్రెస్ కార్యకర్తలు, ఇతర ముఖ్య నేతలు తరలివచ్చారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. అలానే బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత బరిలో నిలిచారు. ఈ ముగ్గురు జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్థానికులు కావడంతో ఉపఎన్నిక ఆసక్తికరంగా మారింది. మాగంటి సునీత మినహా మిగిలిన ఇద్దరు అభ్యర్థులు గత కొన్ని ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోనే పోటీ చేస్తూ వస్తున్నారు. అయితే స్థానికంగా ఈ ముగ్గురికి గట్టి పట్టుంది. హైదరాబాద్ లోని యూసఫ్‌గూడకు చెందిన వ్యక్తి నవీన్ యాదవ్. ఈయన బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో డిగ్రీ పొందారు. ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సిటీలో పేరున్న సోషల్ వర్కర్. నవీన్ యాదవ్ తొలిసారి 2014లో మజ్లిస్ పార్టీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కేవలం 9 వేల పైచిలుకు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం చవిచూశారు. 2018లో ఇక్కడి నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి..భారీగానే ఓట్లు సంపాదించారు.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరిన నవీన్ యాదవ్.. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అప్పటి నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ముచ్చటగా మూడోసారి జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలవాలనే దృఢ నిశ్చయంతో నవీన్ యాదవ్ ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ త్రోబాల్ అసోషియేషన్ కు రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్ యాదవ్ కొనసాగుతున్నారు. ఈ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.

## తెలంగాణలో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

నిర్వహించాలని అందులో వెల్లడించారు. మొదటి విడతలో రూ.6,294 కోట్ల ఖర్చుతో 2,162 రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. 17 ప్యాకేజీల్లో 7,449 కిలోమీటర్ల రోడ్లను పంచాయతీరాజ్ శాఖ నిర్మించనుంది.

## రూ.110 కోట్ల భూమికి విముక్తి

స్థలాన్ని ఖాళీ చేయడంలేదు. మరోవైపు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు పాల్పడ్డాడు. అశోక్ సింగ్‌పై లంగర్‌హౌస్, మంగళ్‌హాట్, శాహినాయత్‌గంజ్ పోలీసు స్టేషన్లలో 8కి పైగా కేసులు నమోదయ్యాయి.

## సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై దృష్టి పెట్టాలి

రాణించగలరు. కొత్త చట్టాలను పటిష్ఠంగా అమలు చేయండి. క్షేత్రస్థాయిలో ప్రతిరోజు ఒక సవాలే. రాజ్యాంగానికి లోబడి పని చేస్తే ఉన్నతంగా ఉండగలరు. మీరు ఐపీఎస్‌లు మాత్రమే కాదు.. పేదలను ఆపద నుంచి కాపాడే సంరక్షకులు" అని అన్నారు.

## అటవీ అధికారులపై గిరిజనుల దాడి

**భద్రాద్రి కొత్తగూడెం(జనంసాక్షి):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫారెస్ట్ సిబ్బందిపై ఆదివాసీ పోడు రైతులు శుక్రవారం వేట కొడవళ్లతో దాడి చేశారు. కరకగూడెం మండలం అశ్వాపురపాడు గ్రామం అటవీ ప్రాంతంలో దాడి చేశారు వలస ఆదివాసీ పోడు రైతులు. పోడు భూమిలో ఆదివాసీ గిరిజనులు హార్వెస్టర్ మిషన్ ద్వారా వరి పంట కోస్తుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులపై ఆగ్రహంతో వలస ఆదివాసీ గిరిజనులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, కోటేష్‌కి గాయాల య్యాయి. గాయాలైన అధికారులకి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఆదివాసీ పోడు రైతులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ ఘట నపై పోలీసు ఉన్నతాధికారులు వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఫారెస్ట్ అధికారులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని ఆదివాసీ పోడు రైతులని పోలీసులు హెచ్చరించారు.

## పత్తిని కేంద్రమే కొంటుంది

**హైదరాబాద్(జనంసాక్షి):**కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ప్లాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట ఆయుధంతో
# లొంగిపోయిన ఆశన్న

ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

## అఫ్గాన్, భారత్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** ఆపరేషన్ సిందూర్‌లో చావుదెబ్బతిన్నా పాక్ బుద్ధి మారడం లేదు. ప్రేలాపనలు ఆగడగం లేదు. అఫ్గాన్‌తో సరిహద్దె సమస్య, భారత్‌కు అఫ్గాన్ చేరువ కావడాన్ని పాక్ జీర్ణించుకోవడం లేదు. అవసరమైతే ఈ రెండు దేశాలతో ఏకకాలంలో యుద్ధం చేస్తామని మరోమారు పాక్‌రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాటలు తూలారు. ఈ రకంగా భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనకు దిగింది. అఫ్గానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. తాలిబన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ..ఖ్వాజా ఆసిఫ్ ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్న ఎదురుకాగా...అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను అని చెప్పనంటూ భారత్ గురించి నోరుపారేసుకున్నారు.

## భారత్‌కు మెహుల్ ఛోక్సీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత అభ్యర్థన మేరకు ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని బెల్జియం అధికారులు అరెస్టు చేయడం సరైన చర్యేనని అక్కడి న్యాయస్థానం పేర్కొంది. అతడిని భారత్‌కు అప్పగించేందుకు అనుమతించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అంట్వర్ప్‌లోని న్యాయస్థానం.. ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే, పై కోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం ఛోక్సీకి ఉన్నప్పటికీ.. అతడిని భారత్‌కు తీసుకురావడంలో కీలక అడుగేనని తెలుస్తోంది.పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.13 వేల కోట్లు ఎగవేసి పారిపోయిన ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని భారత్‌కు తీసుకువచ్చేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి.భారత దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలు చేసిన అభ్యర్థన మేరకు ఈ అరెస్టు జరిగింది. అప్పటి నుంచి ఛోక్సీ అక్కడి జైలులో ఉన్నాడు. ఇటీవల బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా.. దేశం నుంచి పారిపోతాడనే కారణంగా న్యాయస్థానం ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అంతే కాదు.. తమకు అప్పగిస్తే అతడిని ఏకాంతంగా నిర్బంధించమని బెల్జియంకు హామీ ఇచ్చిన భారత్.. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ వసతులు కల్పిస్తామని పేర్కొంది.

## బంగారం భగభగ

- భగ్గుమంటున్న పసిడి ధరలు
- అందనంతగా రోజురోజుకూ పెరుగుదల
- ఒక్కరోజే ఏకంగా 3వేలు పెరిగిన గ్రాము ధర

**హైదరాబాద్(జనంసాక్షి):**బంగారం ̍గభగమండుతోంది. సామాన్యులను ఊరిస్తున్న పుత్తడి సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. ఏకంగా రూ.1.40 లక్షల వైపుకు దూసుకెళ్తోంది. ధనత్రయోదశి కి ఒక్కరోజు ముందు బంగారం ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఒక్కరోజే ఏకంగా రూ.3 వేలకుపైనే పెరిగింది. ఫలితంగా తులం బంగారం రూ.1.35 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,250గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ.1,81,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో అతివిలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటం వల్లనే దేశీయంగా బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోతుండటం, అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు, ఫెడరల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించనుండటం, చైనా–అమెరికా మధ్య టారిఫ్‌లు కూడా ధరలు దూసుకుపోవడానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నాయి.

## అమెరికాలో భారతీయులకు మరో ఎదురుదెబ్బ

మించిపోయిందని.. అందువల్లే ఈ లాటరీలో పాల్గొనడానికి వారికి అవకాశం ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. యూరోపియన్ (75,610) వలసదారుల సంఖ్య కంటే ఎక్కువ. 2023లో 78,070 మంది భారతీయులు అమెరికాకు వలస వచ్చారు. ఈ రికార్డుల ఆధారంగా 2028 వరకు భారతీయులను యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలకు అనర్హులుగా నిర్ణయించినట్లు తెలిపింది. ఇప్పటికే ఇమిగ్రేషన్ విధానంలో అమెరికా తీసుకుంటున్న కఠిన చర్యలతో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయులకు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. ఈ లాటరీకి 2026 వరకు అర్హత సాధించని ఇతర దేశాల్లో చైనా, దక్షిణ కొరియా, కెనడా, పాకిస్థాన్ ఉన్నాయి. పెరోల్ ఫీజుపై అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కొన్నిరకాల వలసదారులకు అవసరమయ్యే పెరోల్ ఫీజును 1,000 డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వీసా లేదా ఇతర అధికారిక పత్రాలు లేకుండా అమెరికాలో ప్రవేశించడానికి, ఉండటానికి పెరోల్ అనేది తాత్కాలిక అనుమతి. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిపై విదేశీయులను అమెరికాలోకి అనుమతిస్తారు.ఇటీవల ట్రంప్ ప్రవేశపెట్టిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లులో ఈ పెరోల్ ఫీజును తప్పనిసరి చేశారు. ప్రస్తుతం దీని ఆధారంగా అమెరికాలోకి ప్రవేశించాలంటే విదేశీయులు 1,000 డాలర్ల పెరోల్ రుసుమును చెల్లించాలి. వీటిలో ప్రారంభ పెరోల్, రీ–పెరోల్, పెరోల్ ఇన్ ప్లేస్ లేదా డీహెచ్ఎస్ కస్టడీ నుంచి పెరోల్ వంటివి ఉంటాయి. ఈ రుసుము ఇప్పటికే ఉన్న ఏదైనా ఇతర ఇమిగ్రేషన్ సర్వీస్ ఫైలింగ్ లేదా బయోమెట్రిక్ రుసుముకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇమిగ్రేషన్ అధికారులు సూచించిన సమయం లోపు ఈ రుసుమును చెల్లిస్తేనే పెరోల్ పొందడానికి అనుమతినిస్తారు. ఈ తరహా ఆంక్షలపై ఎన్నారైలు మండిపడుతున్నారు.

## గుజరాత్‌లో కొలువుదీరిన మంత్రివర్గం

**గాంధీనగర్(జనంసాక్షి):**గుజరాత్‌లో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగతా మంత్రులంతా రాజీనామా చేయ డంతో శుక్రవారం నూతన క్యాబినెట్ ఏర్పాటు అయింది. ఈ సందర్భంగా 25 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.వారిలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా కూడా ఉన్నారు. ఈ పునర్వ్యవస్థీకరణలో గుజరాత్ హోం మం త్రి నేత హర్ష్ రమేష్‌భాయ్ సంఘవీ డిప్యూటీ ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిని లక్షకు పైగా ఓట్లతో ఓడించి ఘన విజయం సాధించారు. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ సమక్షంలో ఆయన ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రిగా భూపేంద్ర పటేల్ కొనసాగుతున్నారు .కమలం అధిష్టానం క్యాబినెట్‌లో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చింది.

# సీపీఐ(ఎం) చలో రాజ్‌భవన్ ఉద్రిక్తం

- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- ప్రతినిధి బృందానికి రాజ్ భవన్‌లోకి అనుమతి నిరాకరణ
- అక్కడే బైఠాయించిన జాన్ వెస్లీ, ఇతర నాయకులు
- బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు
- తిరగబడ్డ నిరసనకారులు... పోలీసులతో వాగ్వాదం, తొక్కిసలాట
- గవర్నర్ వైఖరికి నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం సీపీఐ(ఎం) రాష్ట్ర తలపెట్టిన ఛలో రాజ్ భవన్ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. శుక్రవారం హైదరాబాద్ లోని ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ నుంచి నుంచి సోమాజీగూడ వరకు ర్యాలీగా వెళ్లి గవర్నర్ కు వినతి పత్రం సమర్పించేందుకు వెళ్తున్న వారిని పోలీసులు మెట్రో రెసిడెన్సీ వద్ద అడ్డుకున్నారు. అప్పటికే బారికేడ్లు వేసి ముందుకెళ్లకుండా నిలిపివేయడంతో నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.ఒక దశలో బారికేడ్లను తొలగించుకుని వెళ్లేందుకు కార్యకర్తలు చేసిన ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేశారు. వారిని బలవంతంగా అడ్డుకున్నారు. అక్కడ్నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలో ప్రతినిధి బృందాన్ని మాత్రం వెళ్లనిచ్చినప్పటికీ రాజ్ భవన్ గేటు వద్దే లోపలికి వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో వారు అక్కడే బైఠాయించారు. బీసీలకు వ్యతిరేకంగా గవర్నర్ మొండి వైఖరితో వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ అపాయింట్ మెంట్ ఇచ్చేంత వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వ, బీజేపీ బీసీ వ్యతిరేక విధానాలు వీడాలంటూ నినాదాలు చేశారు. గవర్నర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని నినదించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కొద్ది సేపటి తర్వాత అక్కడ్నుంచి పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి వాహనాల్లో పోలీస్ స్టేషన్ కు తరలించారు. అంతకు ముందు మెట్రో రెసిడెన్సీ వద్ద రోడ్డు మీదే బైఠాయించిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసేందుకు చేసిన ప్రయత్నంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు నాయకులు, కార్యకర్తలను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. ఈ క్రమంలో ఒక కార్యకర్త స్పృహ తప్పి పడిపోయారు. తమ నాయకులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో వినతిపత్రం సమర్పించేందుకు వచ్చారని పోలీసులు వినిపించుకోలేదు. బలవంతంగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి అక్కడ్నుంచి తరలించారు. ఈ క్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలకు దెబ్బలు తగిలాయి.

### చర్చించేందుకు సిద్ధంగా లేని గవర్నర్ : జాన్ వెస్లీ

రాజ్ భవన్ వద్ద బైఠాయించిన సందర్భంగా జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సిద్ధంగా లేని గవర్నర్ దానిపై కనీసం చర్చించేందుకు కూడా ఇష్టపడటం లేదని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్ కేంద్రానికి అనుకూలంగా ఉంటున్నారని తెలిపారు. నెలన్నరకు పైగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. మూడు రోజుల క్రితమే గవర్నర్ అపాయింట్ మెంట్ అడిగామనీ, బీసీల గురించి మాట్లాడేందుకు వస్తే కలవడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. బీసీలకు, సామాజిక న్యాయానికి, రిజర్వేషన్లకు వ్యతిరేక వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. మనువాదంతో వ్యవహరిస్తూ కలిసేందుకు నిరాకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, మోటార్ సైకిల్ ర్యాలీలు తదితర రూపాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. గవర్నర్ తీరు మార్చుకోకుంటే ఆయన బదిలీ కోరాల్సి వస్తుందని హెచ్చరించారు.

### బీజేపీకి వ్యతిరేకంగా బంద్ చేస్తేనే..

బీజేపీకి వ్యతిరేకంగా బీసీ జేఏసీ రాష్ట్ర బంద్ చేస్తేనే అందులో సీపీఐ(ఎం) పాల్గొంటుందని జాన్ వెస్లీ మరోసారి స్పష్టం చేశారు. ఛలో రాజ్ భవన్ ర్యాలీ ఖైరతాబాద్ వద్ద ప్రారంభానికి ముందు ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్ర పరిధిలో ఉందనీ, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చే అధికారం కేంద్రానికుందని తెలిపారు. గవర్నర్ అర్డినెన్స్ కు అనుకూలమా? వ్యతిరేకమా? అని చెప్పకుండా కేంద్రానికి పంపించారని ఆయన తప్పుపట్టారు. బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్ కు మద్దతిచ్చిన బీజేపీ కేంద్రంలో బీసీల 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటూ నాటకాలోడుతోందని జాన్ వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంద్ కు బీజేపీ మద్దతివ్వడం మోసపూరితమని జాన్ వెస్లీ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావాలనే చిత్తశుద్ధి ఉంటే బీజేపీకి వ్యతిరేకంగా బంద్ నిర్వహించాలని ఆయన సూచించారు. లేకపోతే సీపీఐ (ఎం) ఒంటరిగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. 18న నిరసనలతోనూ దిగిరాకపోతే కలిసొచ్చే శక్తులను కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సమాన అవకాశాలివ్వాలని కోరుకుంటున్న సమయంలో గవర్నర్ అడ్డుపడటం సరికాదని అభిప్రాయపడ్డారు. మతోన్మాద, కులోన్మాద, పురుషాధిక్య, కార్పొరేట్ల అనుకూల, మనువాద బీజేపీని బొంద పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నాయకులు ఎస్.వీరయ్య, మహ్మద్ అబ్బాస్, టి.జ్యోతి, టి.సాగర్, నంద్యాల నర్సింహారెడ్డి, బండారు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులు డిజి నరసింహారావు, ఎం వి రమణ, పి ఆశయ్య , ఆర్ శ్రీరాం నాయక్, టి స్కైలాబ్ బాబు, బి ప్రసాద్, ఉడుత రవీందర్, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి సత్యం, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి యాదయ్య, హైదరాబాద్ నగర నాయకులు, హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.




# సీఎం ప్రజావాణిలో 236 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 236 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76, రెవెన్యూ శాఖకు సంబంధించి 63, ఇందిరమ్మ ఇండ్ల కోసం 63, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 53 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

### భారీగా తరలివచ్చిన ల్యాబ్ టెక్నీషియన్స్

తమ సమస్యల పరిష్కారం కోసం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ ప్రజావాణికి భారీ ఎత్తున తరలి వచ్చారు. వారి సమస్యలు విన్న చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ధీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

# గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకున్న బండి సంజయ్



**అమృత్‌సర్ (జనంసాక్షి) :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం పంజాబ్ రాష్ట్రంలోని అమ్రుత్‌సర్ గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం)ను దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా బండి సంజయ్ గురువారం శ్రీనగర్‌లో పర్యటించారు. ఆలిండియా జూడో పోటీల ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతి అందజేశారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ సమీపంలోని డచ్చిగాం నేషనల్ పార్క్‌ను సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు పార్క్ అంతా కలియ తిరిగారు. పార్క్ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బలగాలు 'ఆపరేషన్ మహదేవ్' పెహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టిన ప్రాంతానికి సమీపంలోనే ఈ పార్క్ ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర భద్రతా సిబ్బంది, జమ్మూకాశ్మీర్ పోలీసు ఉన్నతాధికారులతో కలిసి అల్పాహారం సేవించారు. అనంతరం శ్రీనగర్ నుండి అమ్రుత్ సర్ వెళ్లిన బండి సంజయ్ స్థానిక బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. బండి సంజయ్ కు స్థానిక విమానాశ్రయంలోనే ఘన స్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు, బీజేపీ కార్యాలయంలో ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అక్కడి నుండి సాయంత్రం నేరుగా సిక్కు మతస్తుల అత్యంత పవిత్ర స్థలమైన స్వర్ణ దేవాలయానికి వెళ్లారు. ఆలయ సిబ్బంది కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ చరిత్రను వివరించారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు. వారితో కలిసి టెంపుల్ ను దర్శించుకున్న బండి సంజయ్ రాత్రి వేళల్లో బంగారపు కాంతుల్లో మెరుస్తున్న ఆలయం అద్భుత దృశ్యంగా కన్పిస్తోందని పేర్కొన్నారు. శనివారం పంజాబ్ లో వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలను, మారుమూల గ్రామాలను సందర్శించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.

# విద్యారంగ సమస్యలపై విన్నపం

### నాగర్‌కర్నూల్ డీఈవోను కలిసిన మునగాల సతీష్‌కుమార్



**నాగర్‌కర్నూల్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ సెక్రెటరీ హోదాలో మునగాల సతీష్ కుమార్, నాగర్‌కర్నూల్ డీఈవో ఏ.రమేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సమయంలో విద్యారంగ సమస్యలపై చర్చించారు. డిఈఓ ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, ఇప్పటికీ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఏ-1 పరీక్షలు సమీపిస్తున్న ఉపాధ్యాయ కొరత వల్ల సమైక్య సమేత బోధన జరుగుతుందని విద్యార్థుల నిష్పత్తి ప్రకారం కనీసం 10 మంది ఉన్న పాఠశాలకు ఒకరిని 10 నుంచి 60 మధ్యలో ఉన్నటువంటి పాఠశాలకు ఇద్దరినీ కేటాయిస్తూ చర్యలు తీసుకోవాలని, కొన్ని పాఠశాలలో 10లో ఉన్నటువంటి విద్యార్థులు ఉన్న అక్కడ ముగ్గురు నలుగురు టీచర్లు పనిచేస్తున్న పాఠశాలను గమనించి తక్షణ నిర్ణయాలు తీసుకుంటే ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల విష యంలో మేలు చేసిన వాళ్ళు అవుతామని తెలిపారు. సివిల్ సర్వీస్ జాన్ స్టాప్ కౌన్సిల్లో శాశ్వ సభ్యత్వం కలిగిన తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన సందర్భంగా మునగాల సతీష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొండారెడ్డి పోషయ్య, అధ్యక్షులు సి రమేష్, కోశాధికారి మంగులాల్, మహిళా అధ్యక్షురాలు షీలా మేడం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణలో నాలుగురోజులు వర్షాలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపా టి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. ఆయా గ్రామాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఉందని చెప్పింది.

# లాలూ హయాంలో జంగిల్ రాజ్యం

- మళ్లీ కొత్త ముఖంతో వస్తోన్న మహాఘట్‌బంధన్



**పాట్నా, అక్టోబర్17 (జనంసాక్షి) :** ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ హయాంలో బిహార్‌లో 15 ఏళ్ల పాటు 'ఆటవిక రాజ్యం' సాగిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. దీంతో రాష్ట్రం అర్ధ శతాబ్దం వెనక్కి వెళ్లిపోయిందని, ఆ సమయంలో బిహార్ గౌరవం, వైభవం, ప్రతిభ వంటివన్నీ కోల్పోయాయని తెలిపారు. ఇప్పుడు ఇదే 'జంగిల్ రాజ్' కొత్త ముఖాలతో ప్రజల ముందుకు వస్తోందని తేజస్వి యాదవ్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. బిహార్‌లోని పాట్నాలో శుక్రవారంనాడు జరిగిన మేధావుల సదస్సులో అమిత్‌షా మాట్లాడుతూ, ఆర్జేడీ ఆటవిక పాలనతో స్వాతంత్య్రం వచ్చిన తర్వాత బిహార్‌లో ఏర్పాటు చేసిన పరిశ్రమలన్నీ రాష్ట్రాన్ని వదిలిపోయాయని చెప్పారు. అవినీతి కేసులో జైలు నుంచి లాలూ ప్రసాద్ వచ్చినప్పుడు ఏనుగుపై ఊరేగింపు జరిపారని, ఇదెంత సిగ్గుచోటు వ్యవహారమో మనం ఊహించలేమని అన్నారు. బిహార్‌లో అప్పట్లో మీరు 6 విడతల్లో ఎన్నికలు నిర్వహించిన విషయం లాలూ, రాహుల్ కంపెనీకి గుర్తుందా అని అమిత్‌షా ప్రశ్నించారు. భద్రతా ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని ఆర్జేడీ హయాంలో 6 విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చిందని, బిహార్ ఇప్పుడు సురక్షితంగా ఉన్నందునే కేవలం రెండు విడతల్లోనే ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, 243 మంది సభ్యుల బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా నవంబర్ 6,11 తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# గొర్రెల మందను ఢీకొన్న గ్రానైట్ లారీ

### 12 గొర్రెల మృత్యువాత



**తొర్రూరు , అక్టోబర్ 17 (జనం సాక్షి) :** తొర్రూరు మండలంలోని మాటేడు గ్రామ శివారులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లం వీరమల్లు తన గొర్రెల మందను మేతకు తీసుకెళ్తుండగా, వేగంగా వస్తున్న ఒక గ్రానైట్ లారీ గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో రెండు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి.

# బీసీ సామాజిక ఉద్యమానికి సాహిత్య రంగం గజ్జె కట్టాలి

- 'తెలుగు సాహిత్యంలో బీసీ నవల' ఆవిష్కరణలో జూలూరు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీల హక్కుల సాధనకై జరుగుతున్న సామాజిక ఉద్యమంలో రచనలు చేసే చారిత్రక బాధ్యతను బీసీ కవులు, రచయితలు, సాహితీవేత్తలు తమ భుజాలపై వేసుకుని ముందుకు సాగాలని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాల హక్కుల సాధనకై సమస్త బీసీ సమాజాన్ని కదిలించేందుకు బీసీ సాహితీవేత్తలు "ఆటపాటమాట"లతో గళాలు విప్పాలని తెలిపారు. శుక్రవారం రవీంద్రభారతి మినీ హాల్‌లో ప్రఖ్యాత సాహిత్య విమర్శకుడు కె.పి.అశోక్‌కుమార్ రచించిన "తెలుగు సాహిత్యంలో బీసీ నవల" అన్న విమర్శ గ్రంథాన్ని జూలూరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల కాలంలో 50 మంది రచయితలు రాసిన 60 బీసీ నవలలను వెలికితీసి వర్తమాన చరిత్రకు అందించిన కె.పి.అశోక్ కుమార్ కృషి బహుజన సాహిత్య ఉద్యమానికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. జనాభాలో సగ భాగమైన బీసీ సాహిత్య అస్తిత్వాన్ని తనలో నింపుకున్నప్పుడే తెలుగు సాహిత్యం పరిపూర్ణమవుతుందన్నారు. ఏ అస్తిత్వ ఉద్యమానికైనా భావజాలమే ప్రాణమని, బీసీల సామాజిక ఉద్యమానికి విరివిగా సాహిత్య సృష్టి జరగవలసి ఉందన్నారు. ఎగిసిపడుతున్న బీసీల హక్కుల సాధన ఉద్యమానికి బీసీ సాహిత్యం ఉదృతంగా రావాల్సి ఉందన్నారు. అన్ని రకాల అభ్యుదయ, అస్తిత్వ ఉద్యమాలలో అగ్రభాగాన నిలిచిన బీసీ రచయితలు తమ మూలాల నుంచి లోత్కెన అధ్యయనం చేస్తూ బీసీ ఉద్యమానికి ప్రేరణగా విస్తృతంగా రచనలు చేయాలన్నారు. రాజకీయరంగంలో మాదిరిగానే సాహిత్యరంగంలో ఉన్న ఆదిపత్య వర్గాలు కింది కులాల సాహిత్యాన్ని, కళారూపాలను వెలుగులోకి రాకుండా చేస్తున్న కుట్రలను అధిగమించాల్సిన అవసరముందన్నారు. విమర్శరంగంలో ఉన్న వాళ్లు బీసీ నవలా సాహిత్యాన్ని చర్చకు రాకుండా చేశారని, ఆ గోడలను బద్దలు కొడుతూ కె.పి.అశోక్‌కుమార్ వందేళ్ల బీసీ నవలా సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకరావటం అభినందనీయమని పేర్కొన్నారు. 1927 నుంచి 2024 వరకు వచ్చిన నవలా సాహిత్యాన్ని ఒక దగ్గరకు తీసుకరావటం గొప్ప ప్రయత్నంగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రాణమైన బీసీ అస్తిత్వవాదం కింది కులాలకు రావాల్సిన న్యాయమైన వాటాను కోరుతున్నదన్నారు. మెజార్టీ ప్రజల్కైన బీసీల అస్తిత్వమే తెలుగు సాహిత్యంలో ప్రధాన స్రవంతి అని తెలిపారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల ద్వారా బీసీ ధృక్పథాన్ని బలంగా వినిపించే బాధ్యత సాహిత్యకారులపై ఉందన్నారు. రాజకీయ పార్టీలు అవసరాలకోసం వాగ్ధానాలు చేసి ఎప్పుడు కాడెత్తుతారో తెలియదని, ఇలాంటి సమయంలో ప్రమాద హెచ్చరికలు చేస్తూ బీసీలను సమాయత్తం చేసే పని సాహిత్యరంగమే చేయాలన్నారు. బీసీల సామాజిక సమరాన్ని బీసీల ఆత్మగౌరవ ఉద్యమంగా మరల్చి, మహాజనావళిని ఏకం చేసే పనికి బీసీ సాహితివేత్తలే పూనుకోవాలని వివరించారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం ఉద్యమించే నాయకత్వాన్ని అందించేందుకు బీసీ సృజనకారులు కృషి చేయాలని జూలూరు కోరారు. ఈ సభకు ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు అధ్యక్షత వహించగా ప్రఖ్యాత సాహితీవేత్తలు పరమాత్మ, కోయి కోటేశ్వరరావు, ఏ.కె.ప్రభాకర్, తెలంగాణ పబ్లికేషన్స్ అధినేత కోయ చంద్రమోహన్, గ్రంథ రచయిత కె.పి.అశోక్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

# నిమ్స్‌లో వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఆపరేషన్ థియేటర్‌లో విగతజీవిగా ఉండగా గుర్తింపు



**హైదరాబాద్, అక్టోబర్17 (జనంసాక్షి) :** నగరంలోని నిమ్స్ ఆసుపత్రి అనస్థీషియా వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. మృతుడు బీఎస్సీ నర్సింగ్ చేస్తున్న నితిన్‌గా గుర్తించారు. గురువారం విధులకు హాజరైన నితిన్.. శుక్రవారం ఉదయం ఆపరేషన్ థియేటర్లో విగతజీవిగా పడి ఉన్నాడు. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన విద్యార్థి నిమ్స్‌లో న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్ అనస్థీషియా టెక్నీషియన్‌గా ఉన్నారు. నిమ్స్‌లోనే బీఎస్సీ నర్సింగ్ చేస్తున్నాడు. అయితే మరికొద్ది రోజుల్లో ఇంటర్నెట్ షిప్ పూర్తవుతుందనుకున్న సమయంలో నితిన్ ఇలా చనిపోవడం సహచరులను షాక్‌కు గురిచేసింది. బోరబండలోని గవర్నమెంట్ హాస్టల్లో ఉంటూ నిమ్స్‌లో నితిన్ ఇంటర్న్ షిప్ చేస్తున్నాడు. అయితే రాత్రి విధులకు హాజరైన నితిన్ అర్ధరాత్రి కనిపించకుండాపోయాడు. ఉదయానికి ఆపరేషన్ థియేటర్‌లో డోర్ వెనకాల అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నితిన్‌ను గమనించిన హౌస్ కీపింగ్ సిబ్బంది వెంటనే నిమ్స్ సిబ్బందికి తెలియజేశారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఘటనా స్థలి నుంచి తరలించారు. కాజ్ ఆఫ్ డెత్‌పై పోలీసులు విచారణ చేపట్టారు. అలాగే అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించడం మొదలుపెట్టారు. నితిన్ ఆఖరి సారిగా ఎవరితో మాట్లాడాడు అనే దానిపై అతడి ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు నితిన్ మృతిపై నిమ్స్ యాజమాన్యం కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులకు పూర్తిగా సహకారం అందిస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఇక నితిన్ మృతితో తోటి విద్యార్థులు, సీనియర్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రైతు నేస్తం - 2025 పురస్కారానికి మరియన్న ఎంపిక

**మహబూబాబాద్ బ్యూరో , అక్టోబర్ 17(జనం సాక్షి):** రైతు నేస్తం - 2025 పురస్కారానికి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న ఎంపిక అయినారని అధికారి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సేవ, నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ పంట మార్పిడి ద్వారా ఉద్యాన పంటల విస్తరణ, రైతులు పలు మేలైన యాజమాన్య పద్దతులు, సాంకేతిక పరిజ్ఞానం, రైతుల విజయగాధలు మొదలైన విషయాలను తెలియజేస్తూ ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, పూలు, మల్బరీ, మునగ మొదలైన పంటల విస్తరణకు రైతులకు అవగాహన చేస్తూ, 30 (ముప్పై) వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ చేసినందుకు మరియు ఉద్యాన పంటలు కూడా 10 (పది) వేల ఎకరాల విస్తరణ చేసినందుకు వారి సేవలను గుర్తిస్తూ విస్తరణ విభాగంలో రైతు నేస్తం - 2025 పురస్కారానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న వారిని ఎంపిక చేశారన్నారు. ఈ నెల 26న స్వర్ణ భారతి ట్రస్ట్, ముచ్చింతల్, శంషాబాద్, హైదరాబాద్ నందు భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందుకోనున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## విచిత్ర విద్యాలయం

పండితున్ని పామరునిగ మలచి
విజ్ఞానాన్ని దహనము చేసే
పొంతనలేని వింతలు చెప్పే
విద్దూరాల విచిత్ర వేదిక ఇది

వేలి మొనలతో వేలేండ్ల చరితను
ఇంటి గది నుండి ఇష్టానుసారంగా
తెగ రాసేసి జనంపై పోసిన
వక్రీకరణల పుస్తకాలయమిది

కులాల కంపున్న తరగతి గదులలో
మతాల మత్తెక్కే మొండి పాఠాలు
మతిచెడిపోయిన మహా జ్ఞానులిచ్చే
మైకపు మాటల దుర్బోధనా స్థలమిది

అంధ భక్తులనే అమానవీయపు
ఆవేశాల మందలు ఈనిన
అనేక మతాల మూర?పు గుంపుకు
ఆశ్రయమిచ్చిన బురదకుంట ఇది

మూఢనమ్మకాల ఆరిన కట్టెలు
మన నాగరికత అని తిరిగి రాజేసి
మత రాజ్యాల నిర్మాణానికి
దేశ యువతను సిద్ధం చేసిన
మారణహోమపు మైదానమే ఇది

తర్కాన్ని తునకలు చేసి
గొడ్డుకు మనిషికి తేడా తుడిచి
తొందర పడుతూ అందర్ని చేరే
తప్పుడు సమాచార సాధనమే ఇది

అజ్ఞాన భారత ఆవిష్కరణకు
అలుపెరుగక మీ మెదడును మీటి
చచ్చిన మెదళ్ళకు చితిని పేర్చిన
వాట్సాప్ విశ్వవిద్యాలయమిది

సత్య అసత్యాలను సరి చూడాల్సిన
శుద్ధ సమాచార సేవకు చేసిన
సుసామాజిక మాధ్యమమే ఇది



నేపా సంతోష్ అచ్యుత్ కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత. 8639442397

# చట్టబద్ధ సరే, మానవత్వ ప్రవర్తన ఉందా?

**దేశంలో చట్టబద్ధ, న్యాయబద్ధ పోరాటాలు చేయడానికి అవకాశం ఉన్నదా లేదా, ఉంటే కూడా వాడుకోకుండా మూర్ఖంగా ఇతర పోరాట రూపాలు ఎంచుకుంటారా అనేది ఎడతెగని చర్చ. ఎప్పుడో ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల ప్రకటన (1948)లోనే ప్రజలను తిరుగుబాటు వైపుకు తోయకుండా ఉండాలంటే చట్టబద్ధ పాలన, మానవ హక్కులు ఉండాలని ఒక మాట రాశారు. కాని ఆ ప్రకటన మీద సంతకం చేసిన ఏ ఒక్క దేశంలోనూ సంపూర్ణమైన చట్టబద్ధ పాలన, సమగ్రమైన మానవహక్కులు కొనసాగడం లేదు. అంటే అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన ప్రకారమే ప్రపంచమంతా ప్రభుత్వాలే ప్రజలను తిరుగుబాట్ల వైపు నెడుతున్నాయి. చట్టబద్ధ, న్యాయబద్ధ పోరాటాలు చేయడానికి అవకాశాలు లేవని చెపుతున్నాయి. ఒకవైపు నానాటికీ సమస్యలు పెరిగిపోతూ, ప్రజలకు బతుకు దుర్భరమై పోతున్నప్పుడు ఆధునిక పాలనా పద్ధతులు ఏదో ఒక ఉపశమనం చూపకపోతే మానవ హక్కుల ప్రకటన ఊహించినదే నిజమవుతుంది.**


భారత ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పార్టీ చేతిలో ఉన్నప్పటికీ చట్టబద్ధ, న్యాయబద్ధ పోరాటాలకు అవకాశం ఇచ్చిన ఉదాహరణలు చాలా చాలా తక్కువ. మన సమాజంలో చారిత్రకంగా ఉన్న రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యలకు తోడు, ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిపోతున్న సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా వల్ల జనజీవన విధ్వంసం, నిర్వాసితతత్వం పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఆ అభివృద్ధి నమూనాలో భాగం గానే ప్రభుత్వ విధానాలు సంపన్నులకు ఎక్కువ సంపదను దోచిపెట్టేవిగా, ప్రజలను మరింత పేదలను చేసేవిగా ఉంటున్నాయి. ఈ విధానాల వల్ల విపరీతంగా అంతరాలు పెరిగిపోవడం, పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల. విద్యా, వైద్య, ఆరోగ్య, రవాణా సౌకర్యాల లోపాలు వంటి ఎన్నో నిత్య జీవిత సమస్యలను ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్నారు. నూట నలభై కోట్ల ప్రజానీకంలో సమస్యలే లేని వారి జనాభా ఒక కోటి అయినా ఉండదు. అంటే వాస్తవంగా మన సమాజం ఒక అగ్ని పర్వతం మీద ఉన్నది. ఆ అగ్ని పర్వతం ఎప్పుడు పేలుతుందో తెలియదు. అది పేలకుండా కాపాడడానికి ప్రభుత్వాలు అంతకంతకూ ఎక్కువగా తమను తాము సైనికీకరించుకుంటున్నాయి. భద్రతా బలగాల మీద నానాటికీ ఎక్కువ ఖర్చు పెడుతున్నాయి. ప్రజాగ్రహం నుంచి తమను ఆ భద్రతా బలగాల వలయాలే కాపాడతాయనుకుంటున్నాయి.

అలా విధాన నిర్ణేతలైన చట్టసభలు, ఆ విధానాలను అమలు చేసే కార్య నిర్వాహక, అధికార వర్గం ప్రజలకు, ప్రజా సంక్షేమానికి దూరమైనప్పటికీ, కనీసం న్యాయ వ్యవస్థ ప్రజల పక్షాన నిలబడవలసి ఉంటుంది. రాజ్యానికీ వ్యక్తికీ మధ్య ఘర్షణ వచ్చినప్పుడు వ్యక్తి పక్షాన నిలబడడం న్యాయవ్యవస్థ బాధ్యత. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడం, రాజ్యాంగం హామీ ఇచ్చిన రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం అమలయ్యేలా చూడడం న్యాయవ్యవస్థ బాధ్యత. ఆ మూడు రాజ్యాంగ వ్యవస్థల పని తీరు మీద నిరంతర నిఘా పెట్టి, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం నాలుగో స్తంభం అని చెప్పబడే పత్రికారంగ బాధ్యత. దురదృష్టవశాత్తూ శాసన నిర్మాణ, శాసనాధికార వ్యవస్థలు మాత్రమే కాక, న్యాయవ్యవస్థ, పత్రికా రంగం కూడా ప్రజలకూ, రాజ్యాంగ విలువలకూ, ప్రజాస్వామ్యానికీ, చివరికి మానవత్వానికీ, నాగరికతకూ కూడా దూరమైపోతున్న దుస్థితి ఇవాళ రాజ్యం చేస్తున్నది.



ఎన్ వేణుగోపాల్

ఇవాళ సమాజంలో ప్రతి ఒక్క సమూహాన్నీ, నిజానికి ప్రతి ఒక్క వ్యక్తినీ తీసుకుని జీవితం ఎట్లా సమస్యల మయం అయిపోయిందో, దుర్భరమవుతున్నదో, రాజ్యాంగ వ్యవస్థలు ప్రజలను ఎట్లా వంచనకు గురి చేస్తున్నాయో గణాంకాలతో, స్థూల వివరాల నుంచి సూక్ష్మ వివరాల దాకా విస్తారంగా చెప్పవచ్చు. ఇక్కడ అంత అవకాశం లేదు గాని మొదటి రెండు వ్యవస్థలు చేసిన అక్రమాలను సరిదిద్దవలసిన, న్యాయ సమీక్ష చేసి పరిష్కారాలు చూపవలసిన న్యాయవ్యవస్థ ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తున్నదో, కనీసం చట్టబద్ధ పాలనను అమలు చేయడానికి ప్రయత్నించడం లేదో మూడు ఉదాహరణలు చూద్దాం.





మొట్టమొదటి ఉదాహరణ కాత రామచంద్రా రెడ్డి అనే మావోయిస్టు నాయకుడి ఎన్‌కౌంటర్ మరణానికి సంబంధించినది. కరీంనగర్ జిల్లాకు చెందిన రామచంద్రా రెడ్డి ఉపాధ్యాయుడుగా, న్యాయవాదిగా పని చేసి మూడున్నర దశాబ్దాల కింద విప్లవ జీవితం ఎంచుకుని దండకారణ్యంలో వేరు వేరు స్థాయిల్లో పని చేశారు. సెప్టెంబర్ 22న ఛత్తీస్ గడ్ లోని అబుజ్ మాడ్ ప్రాంతంలో ఫరస్ బేడా, తోయమెట్ట గ్రామాల సమీపంలో అడవిలో మావోయిస్టులకూ, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ దళాలకూ ఎన్ కౌంటర్ జరిగిందనీ, తర్వాత చూస్తే కాత రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డి అనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుల మృతదేహాలు కనిపించాయనీ పోలీసులు ప్రకటించారు. కాని ఆ ఇద్దరూ అసలు అడవిలోనే లేరని, వేరే పని మీద కొన్ని నెలల కిందనే బైటికి వెళ్లారని, వారు సెప్టెంబర్ 9 వరకు క్షేమంగా ఉన్నారని తమకు సమాచారం ఉందని, అంటే వారిని సెప్టెంబర్ 10 నుంచి 22 మధ్య పట్టుకుని, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి ఉంటారని మావోయిస్టు పార్టీ ప్రకటన వెలువడింది.

కుటుంబ సభ్యులకు ఆ మృతదేహాలను పూర్తిగా కూడా చూపించలేదు గాని, చూపించిన మేరకే రామచంద్రారెడ్డి మృతదేహం మీద కత్తిపోట్లు, చిత్రహింసల గుర్తులు ఉన్నాయని ఆయన సహచరి మాలతి, కొడుకు రాజాచంద్ర అప్పుడే ఆరోపించారు. పోలీసుల పర్యవేక్షణలో తూతూ మంత్రంగా హడావుడిగా జరిగిన పోస్ట్ మార్టంను తాము విశ్వసించడం లేదని, అది శరీరం మీద గాయాల గురించి ప్రస్తావన కూడా చేయలేదని, కనుక మరొకసారి మరింత ఉన్నతస్థాయి పోస్ట్ మార్టం జరపాలని నిర్దేశించాలని రాజాచంద్ర ఛత్తీస్ గడ్ హైకోర్టుకు వెళ్లారు. అలాగే ఛత్తీస్ గడ్ పోలీసులతో సంబంధం లేకుండా స్వతంత్ర సంస్థ ద్వారా ఎన్ కౌంటర్ మీద దర్యాప్తు జరిపించాలని కూడా ఆయన కోరారు. ఛత్తీస్ గడ్ హైకోర్టు ఆ పిటిషన్ ను స్వీకరించడానికే తాత్సారం చేసింది. ఈలోగా మృతదేహాన్ని తీసుకోకపోతే తామే దాన్ని దహనం చేసేస్తామని పోలీసులు కుటుంబ సభ్యులను బెదిరించడం ప్రారంభించారు. ఈ విషయంలో హైకోర్టు తాత్సారాన్ని చూపుతూ, మీరైనా చర్య తీసుకోండి అని ఆయన సుప్రీం కోర్టుకు వెళ్లాడు. రిపోస్ట్ మార్టం, స్వతంత్ర దర్యాప్తు అనేవి అత్యంత సహజమైన అంశాలు. వాటిని కాదనవలసిన అవసరమే లేదు. అది పోలీసులు చెపుతున్నట్టు నిజమైన ఎన్ కౌంటరే అయితే ఎన్నిసార్లు పోస్ట్ మార్టం చేసినా, ఎవరు దర్యాప్తు జరిపినా ఒకటే నిర్ధారణ వస్తుంది. పోలీసులు అందులో భయపడవలసిన అవసరం ఏముంది?

కాని భారత ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టులో రాష్ట్ర పోలీసుల తరఫున వాదిస్తూ, రామచంద్రా రెడ్డి మీద ఏడు రాష్ట్రాలలో కలిపి ఏడు కోట్ల రూపాయల బహుమతి ఉంది అని అసందర్భమైన మాట అన్నాడు. అప్పటికి జరిగిన పోస్ట్ మార్టం సరిగానే జరిగిందన్నాడు. సెప్టెంబర్ 26న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎ జి మసీహ్ తాము ఏ నిర్ణయమూ తీసుకోకుండా, కేసును మళ్లీ ఛత్తీస్ గడ్ హైకోర్టుకు పంపారు. పిటిషన్ మీద దుర్గా పూజ సెలవులు అయిపోయాక, త్వరగా నిర్ణయం తీసుకొమ్మని సూచిస్తూ, "హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకూ మృతదేహాన్ని దహనంగానీ, ఖననం గాని చేయకండి" అని ఆదేశించారు. సుప్రీంకోర్టు నిర్ణయం వచ్చే నాటికి మనిషి చనిపోయి నాలుగు రోజులయింది. మృతదేహం మీద చిత్రహింసల గుర్తులు రెండో రోజు కనబడ్డాయి గాని, రోజులు గడుస్తుంటే మృతదేహం శిథిలమవుతుంటే, ఉబ్బుతుంటే ఆ ఆనవాళ్లు కనబడకుండా పోతాయి. రిపోస్ట్ మార్టం అడిగిన కారణానికే అర్థం పోతుంది. అసలింతకూ మృతదేహాన్ని ఫ్రీజర్ లో భద్రపరిచినప్పుడే రిపోస్ట్ మార్టంకు అవకాశం ఉంటుంది. ఛత్తీస్ గడ్ అధికారులు మృతదేహాన్ని భద్రపరిచే ప్రయత్నాలేమీ చేయలేదు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వాళ్ల చర్యలు తీసుకునేట్టు చేయడానికి రామచంద్రా రెడ్డి కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీతో, కలెక్టర్ తో యుద్ధమే చేయవలసి వచ్చింది.

దుర్గా పూజ సెలవులు అయిపోయాక తీరిగ్గా ఈ పిటిషన్ మీద విచారణ చేపట్టిన హైకోర్టు మొదటి వాయిదారోజున అసలు విషయం వదిలేసి, రామచంద్ర రెడ్డి ఏయే నేరాలు చేశాడో జాబితా వినడానికే సమయం కేటాయించి, మరొక వారానికి వాయిదా వేసింది. చివరికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ సిన్హా, జస్టిస్ బిభుదత్త గురు లు అక్టోబర్ 14న రాష్ట్ర, కేంద్ర భద్రతా బలగాల నేతృత్వంలో జరిగిన నక్సల్ వ్యతిరేక చర్యల మీద స్వతంత్రంగా దర్యాప్తు జరిపించడానికి వీలు లేదనీ, రిపోస్ట్ మార్టం అవసరం లేదని తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు మనిషి మరణించిన ఇరవై రెండు రోజుల తర్వాత!

మరో రెండు ఉదాహరణలు విప్లవ రచయిత వరవర రావు గురించినవి. భీమా కోరేగాం కేసు నిందితుడిగా ఆయనకు అనారోగ్య కారణాల మీద శాశ్వత బెయిల్ ఇచ్చినప్పుడు ఆగస్ట్ 2022లో సుప్రీం కోర్టు విధించిన షరతులలో ఒకటి "బొంబాయి విడిచి వెళ్లడానికి వీలు లేదు" అని. తర్వాత గడిచిన మూడు సంవత్సరాలుగా ఆయన బొంబాయిలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఐదు ఇళ్లు మారవలసి వచ్చింది. విపరీతమైన బొంబాయి జీవన వ్యయాన్ని భరించవలసి వచ్చింది. వృద్ధాప్య సమస్యలు, అనారోగ్య సమస్యలు సరేసరి. కనుక ఆ షరతును సడలించండి అని సుప్రీంకోర్టుకు వెళితే, ఆ పిటిషన్ ఎట్టకేలకు సెప్టెంబర్ 19న జస్టిస్ జె కె మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయిల ముందుకు వచ్చింది. వృద్ధాప్యం, అనారోగ్యం, ఆర్థిక సమస్యలు, సహచరి అనారోగ్యం అనే కారణాల వల్ల ఈ షరతును సడలించాలని కోరుతున్నాం అని న్యాయవాది వాదన ప్రారంభించగానే, 'అయితే బెయిల్ రద్దు చేసుకుని జైలుకు వెళితే ప్రభుత్వమే సౌకర్యాలు కల్పిస్తుంది' అన్నారు నాయమూర్తి! న్యాయవాది మళ్లీ చెప్పబోతుండగా, 'అది కుటుంబ బాధ్యత, మేం వినడానికి సిద్ధంగా లేం' అన్నారు. ఇదంతా ఒక్క నిమిషం లోపు ముగిసిపోయింది!

సుప్రీంకోర్టు అలా ఉండగా, భీమా కోరేగాం కేసును విచారిస్తున్న (ఏడు సంవత్సరాలుగా విచారణ ఏమీ లేకుండానే రెండు వారాలకోసారి వాయిదా వేస్తున్న) ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు మరొక ఉదాహరణ. రెండు సంవత్సరాల కింద కాటరాక్ట్ శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించినప్పుడు, బొంబాయిలో అది చాలా ఖరీదు అనీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్గా తెలంగాణలో ఉచిత చికిత్స దొరుకుతుందని, కనుక శస్త్రచికిత్స కోసం హైదరాబాద్ వెళ్లడానికి అనుమతించమని కోరగా, ఒక్కొక్క కంటికి ఆరు రోజుల చొప్పున అనుమతించారు. అదే విధంగా ఇప్పుడు పళ్లకు రూట్ కెనాల్ చికిత్స చేయాలని వైద్యుల సూచన మేరకు, మళ్లీ హైదరాబాద్ వెళ్లడానికి అనుమతించమని అడిగితే, కుటుంబం భరించవచ్చుగదా, బొంబాయిలో పరిచయస్తులైన వైద్యుల దగ్గరికి వెళ్లవచ్చు గదా, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ వంటివి అందించే ఉచిత వైద్యం పొందవచ్చు గదా అని ఉచిత సలహాలతో పిటిషన్ కొట్టేశారు!

**ఇదీ ఈ దేశంలో న్యాయం, చట్టం అమలవుతున్న తీరు. న్యాయబద్ధ పోరాటాలు, చట్టబద్ధ పోరాటాలు అనేంత పెద్ద మాటలు కూడా వద్దు, మృతదేహాల విషయంలో, వృద్ధులవిషయంలో, రోగ పీడితుల విషయంలో చిన్నపాటి చట్టబద్ధమైన చర్యలు లేని, కనీస మానవతా దృష్టి, నాగరిక, సభ్య సమాజ ప్రవర్తన లేని స్థాయికి దిగజారిన, కుళ్లిపోయిన వ్యవస్థలలో బతుకుతున్నాం మనం...!**

# బీసీ రిజర్వేషన్లపై పార్టీల శాస్త్రీయ పరిష్కారమేది?

ఇటీవల సామాజిక న్యాయంపైన తెలంగాణ రాష్ట్రంలో చర్చ జరుగుతుంది. ఇప్పుడు ఇదీ బీసీ రిజర్వేషన్లతో ముడిపడిన అంశంగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో స్పష్టం చేసింది. దీని కనుగుణంగా 42 శాతం విద్యా ,ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును అసెంబ్లీలో తీర్మానించి గవర్నర్ ఆమోదానికి పంపారు. ఇది రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉండడంతో ప్రత్యేకంగా జీవో తీసుకువచ్చారు. ఈ జీవోను ఇటీవల కొందరు కోర్టులో సవాల్ చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ జీవో పై హైకోర్టు స్టే విధించింది. మరోవైపు సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ అంశం కాంగ్రెస్ పార్టీలకు సవాల్‌గా నిలువగా మిగతా రాజకీయ పార్టీల సైతం ముసలి కన్నీరు కారుస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అయినప్పటికీ.. బీసీలు ఇంకా తమకు దక్కాల్సిన న్యాయం కోసం పోరాడాల్సిన పరిస్థితి ఉందని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు సంపూర్ణంగా దక్కడం లేదని, బీసీల జనాభాకు అనుగుణంగా వారికి రిజర్వేషన్లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీంతో అగ్రకులాల అదనపు హక్కుల పొందుతుండగా బీసీలు హక్కులు కోల్పోతున్నారు. ఇంకా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ వివక్షత అనుభవిస్తున్నారు. మధ్యప్రదేశ్ లో డా. బి.ఆర్. అంబేద్కర్ సోషల్ సైన్స్ యూనివర్సిటీ వారు 2023లో చేసిన ఒక అంతర్గత సర్వే ఓబీల కుల వివక్షత ఏ స్థాయిలో ఉన్నదో స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల గ్రామీణ కుటుంబాలను సర్వే చేశారు. ఇందులో 5.578 ఓబీసీలు కుటుంబాలు(దాదాపు 56 శాతం ) ఇండ్ల వద్దనుంచి అగ్రకులాలు వెళ్తుంటే మంచంలో నుంచి లేచి నిలబడుతున్నారని పేర్కొన్నది. 3,763 కుటుంబాలతో కలిసి భోజనం చేసేందుకు ఇతర కులాల వాళ్లు అంగీకరించరని వివరించింది. కులాన్ని కారణంగా చూపుతూ 3,238 మంది ఓబీసీల ఇంటికి పూజలు చేసేందుకు పూజారులు రాకుండా అస్పృశ్యత పాటిస్తున్నారని వివరించింది. సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, రాజకీయ సాధికారతే దీనికి పరిష్కారం. ఈ క్రమంలో కుల గణన, రిజర్వేషన్ల పెంపు వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి.



**పొలిటికల్ మైలేజ్ కోసం**

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే 75 వసంతాలు పూర్తయినప్పటికీ అటు దేశంలో ఇటు రాష్ట్రంలో ప్రతి పార్టీకి కూడా వెనకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పినలో చిత్తశుద్ధి లేదు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నారు. ఇప్పుడు బీసీ రిజర్వేషన్ అంశం కూడా దీనికి నిదర్శనమే. కోర్టులు బీసీ రిజర్వేషన్ పై ఆంక్షలు విధించడంతో తెలంగాణలో అక్టోబర్ 18న బీసీ రిజర్వేషన్ సాధనకు బీసీ సంఘాల ఐక్య కార్యకరణ సమితి ఆధ్వర్యంలో బంద్ ప్రకటించారు. దీనికి మూడు ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ బంద్ కు మద్దతు పలికాయి. బీసీలకు రిజర్వేషన్ విషయంలో పార్టీల బంద్ ఎవరిపైన? అనేది ప్రశ్నార్థకంగా మారింది. బీసీ ఐకాస బంద్‌కు బీఆర్ఎస్ పూర్తిగా మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి లేదని ఆరోపిస్తుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల సాధనకై బంద్‌కు మద్దతిచ్చింది. బీసీ ఐకాస కలిసి పనిచేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఈ అంశంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బీజేపీ విమర్శిస్తోంది. ఇక చివరగా కాంగ్రెస్ పార్టీ కూడా ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించినది. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లు బీజేపీ%-%బీఆర్ఎస్ మధ్య ఉన్న "లోపాయికారి ఒప్పందం వల్లే నిలిచిపోయాయని ఆరోపించారు. మొత్తంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర విమర్శలతో "బీసీల హక్కుల పేరుతో రాజకీయ ఆరోపణల యుద్ధరంగంగా మారింది. అసలు బీసీ రిజర్వేషన్ కు చట్టపరమైన పరిష్కారం చూపకుండానే బంద్ కు మద్దతు ఇవ్వడం వల్ల ఉపయోగం ఏంటి? పొలిటికల్ మైలేజ్ కోసం రాజకీయ పార్టీల ప్రయాణం సాగుతుందని అనిపిస్తుంది. చిత్తశుద్ధి కనబడడం లేదు. రిజర్వేషన్ విషయంలో భారత రాజ్యాంగంలో ఆంక్షలు విధించలేదు. కోర్టుల ద్వారా 50శాతం పరిమితిని విధించారు. ప్రజలచే ఎన్నుకోబడిన పాలకులు తలుచుకుంటే ఈ పరిమితిని తొలగించలేమా?.అసలు అడ్డుకునేది ఎవరు? న్యాయ స్థానాలా? న్యాయ బద్ధత లేని విధానాలా?...ఆలోచన చెయ్యాలి.

**శాస్త్రీయ పరిష్కారం కోసం ఉద్యమం**

1980 సంవత్సరంలో మండల్ కమిషన్ ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. వీటి అమలుకై డిల్లీ బోట్స్ క్లబ్ ముందు 48 రోజుల ధర్నా చేశాడు. కాన్సిరాం బీసీ రిజర్వేషన్ ఉద్యమం దేశంలో విప్లవానికి కారణమైనది.

విప్లవం అంటే రేషన్ కార్డు, పెన్షన్ కోసం వంటి సంక్షేమ పథకాల కోసం ఉద్యమాలు, ధర్నాలు చేయడం కాదు. వేల సంవత్సరాల నుంచి దోపిడి చేస్తున్న అగ్రకులాలు మాకు న్యాయం కావాలని రోడ్లపైకి రావడమే విప్లవం. ఇదీ భారతదేశ చరిత్రలో రెండు సందర్భాల్లో జరిగింది. మొదటిది రాజ్యాంగం అమలైన తరువాత, అగ్రకులాలు అదనపు హక్కులు కోల్పోతున్నామని ఎన్.డి తివారి నాయకత్వంలో వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి రాజ్యాంగాన్ని కాల్చి ధర్నా చేశారు. రెండోది 1990లో మండల్ కమీషన్ కు వ్యతిరేకంగా రోడ్లపైన ధర్నా చేస్తూ న్యాయాన్ని అభ్యర్థించారు. ఇలాంటి అనివార్యతను సృష్టించిన అధినాయకుడు కాన్సిరాం గారు. ఇప్పుడు మనం కూడా ఆ సందర్భాలు సృష్టించి బీసీ రిజర్వేషన్ల సాధనలో విప్లవం సృష్టించాలి.

ఆ దిశగా ప్రయత్నాలు జరగాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో ఉమ్మడి ఏపీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బాలరాజుగౌడ్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజు నాయకత్వంలో బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఏర్పాటు అయ్యింది. ఈ సమితి బీసీ కేటగిరీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, తమిళనాడు తరహాలో వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తుంది. ఇది బీసీ రిజర్వేషన్లకు శాస్త్రీయ పరిష్కారంగా నిలుస్తున్నాయి. ఈ రిజర్వేషన్లను విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా అమలు చేయాలని పటిష్టమైన ఉద్యమం చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇతర బీసీ సంఘాలు వీరికి తోడైతే బీసీలకు సామాజిక న్యాయం దక్కుతుంది.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7989579428

# లోపలి లోకపు జ్వలనం

'గది అవతలి వాన తలుపు చెక్కలని ముద్దులాడుతుంది/ మదిలోపలి వాన తలపు చెక్కిలిని స్పృశిస్తుంది ' అన్న కవితా వాక్యాలు కవి కుడికాల వంశీధర్ లోని అంతర్నేత్రపు నిశిత, సునిశిత అవలోకనానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. మబ్బులు తుంపరగా తెంపరితనాన్ని ప్రదర్శిస్తూ ఎడతెగని జల్లై కొండమీది నుండి జారి పడుతూ చెట్ల చేతులను చల్లగా నిమురుతాయనడం అపురూప దృశ్యమాన ప్రపంచ ఆవిష్కరణనే అని చెప్పాలి. పిడుగుపాటుకు ఎక్కడో కొన్ని పద్యాలు అలజడికి లోనై విరిగిపడిపోతాయన్న వేదన కూడా వ్యక్తమైంది. ' నిజమే సముద్రము ఒక మహా కావ్యం ' అని దానిని దీర్ఘ కవిత్వంలా తీర్చి కదలాడేలా చేశారు. ఆకాశం నుండి 'ఉల్క' జారి పోయినా తన చూపు లక్ష్యాన్ని విడలేదన్న సంకేతాన్నిచ్చిన' ఉల్క' కవిత కవిలో అంతరంగ భావోద్వేగపు జడిని తెలిపింది.





'కలం పాళీని శూలంగా ఎందుకు మార్చలేదని ఒక నిస్సహాయ అలసట ప్రశ్నించింది'అని మనసు అనుభవిస్తున్న వేదనను విపులీకరించారు . 'కొనసాగడమే తెలిసిన కాలాన్ని పెండ్యులం అడుగులతో కొలవడం అవివేకం కాదా, అగణితమైనది అంకగణితానికి లొంగిపోతుందా' అని ప్రశ్నించారు. మనిషి అంతరంగం సముద్రమంత లోతు అన్నారు. మనసును అందుకోవాలంటే నిచ్చెన కాదు, అనురాగాల రెక్కలు కావాలని చెప్పారు. మౌలికత ను దెబ్బతీస్తే లేదు నిష్కృతి అని తేల్చారు. చిక్కటి చీకటి వికసించిన మది గది కర్ఫ్యూ అనుభవాన్ని తలపోస్తున్నదని చెప్పారు. జ్ఞాపకాల సవ్వడి కనుదోయిలో చినుకుల రువ్వడిని కలిగించిందన్నారు. గతం పుస్తకం అని చెబుతూనే చిరిగిన కాగితాలను మరల మరల చదువుకుంటూ అందులో కొన్ని జ్ఞాపకాలను కొత్తగా రాసుకుంటున్నానన్నారు. 'మౌనానికి మౌనానికి మధ్య మాటల వంతెన / భావాలను కూర్చేందుకు అక్షరాల విద్య / దూరమైన మనసులకు ఉత్తరాల వంతెన' అవసరమన్నారు. జన్మజన్మకి మధ్య మరణం ఒక వంతెన అని తేల్చారు. అక్షరాలను అక్షరాలా మనసుకు హత్తుకోవడమే అంకిత భావంతో చదవడం అని చెప్పారు. కన్నీటితో నిండేది 'చివరి చూపు' అన్నారు. 'మననం అంటే / గతాన్ని తవ్వుకోవటం మాత్రమే కాదు / గమనాన్ని అవగతం చేసుకోవటం / భవిష్యత్తుని నిర్మించుకోవటం' అన్నారు. మా సహనాన్ని పరీక్షిస్తే మీకు ఇక అంతమే అని ఉగ్రవాదాన్ని హెచ్చరించారు. 'ఆఖరి సాయంత్రం' అన్న కవితలో 'కలల ధూళితో కలవరపడ్డ అంతర్నేత్రం'వంటి ఆలోచనాత్మక ప్రయోగం చేశారు. 'స్వరస్యం' అన్న కవితలో మాటల మెట్లు, జ్ఞాపకాల జారుడు బల్లలు వంటి మనసును హత్తుకునే పద ప్రయోగాలు ఉన్నాయి. ఉన్నాయిచితుకుతున్న ఆశల అంకురాలపై చైతన్యపు చిలకరింపుల సరికొత్త భావప్రసారాన్ని కలిగిస్తుంది అని 'పలకరింపు'ను ఎంతో అనునయంతో, అంతే సంయమనంతో నిర్వచించారు.

నిశ్శబ్దాన్ని మించిన అగాధం ఇంకోటి ఉండదని తేల్చారు. 'ఏకాకి తనపు కరతాళ ధ్వనులు 'అన్న సరికొత్త అభివ్యక్తిని 'వాట్ ఏ పిటీ' అన్న కవితలో వ్యక్తం చేశారు. నిత్య చలనశీలిలో స్థితప్రజ్ఞ ఉంటుందన్నారు. వెలుతురు చెట్టుపై ఆకులు నయన మనోహరంగా అల్లరి చేస్తాయని, కొమ్మలు ఊయలూగుతాయని చెబుతూ ఆ పరిసరమంతా పత్ర హరిత నర్తనమవుతుందని తెలిపారు. జీవితమంటే బాధ్యతను పంచుకోవడం కాని బరువు దించుకోవడం కాదని చెప్పారు. చిత్రలేఖినిది సంకుచితత్వం తెలియని, వివక్షత అంటని వర్ణ విన్యాసమని తెలిపారు. ఇనుప కడ్డీలలో దాగిన నేస్తమంత మృదువును తలపోశారు. తీరం చేరని కెరటంలా అసంపూర్ణంగా కవిత మిగిలిపోయిందని వేదన చెందారు. చేపల సజల సజీవ జీవన దృశ్యాన్ని 'నిజమైన సముద్రం' కవిత సహజంగా ఆవిష్కరించింది. 'ఊరి పొలిమేర / పిల్లల కోడిలా మారి పోతుందని' ఔటర్ రింగ్ రోడ్డు గురించి చెబుతూ అది గ్రామాల్ని మ్రింగి విశాలమైన రహదారుల్ని నగరం కోసం ముద్దలు ముద్దలుగా కక్కుతుందని చెప్పారు. కన్నుల నుండి జారుతున్న కన్నీటి ధారలో మధురోహల జ్ఞాపక పుటలను విప్పి చూపారు. 'వర్క్ ఫర్ హోమ్' కవిత ఇంటికి కొత్త అర్థాన్ని తెచ్చే పనిలో గువ్వల జంట లోకాన్ని మరచిపోతున్న సంగతిని వివరించింది.

మనిషి నయవంచనను చూసి అతని నీడే తెల్లబోయి నవ్విందని 'నవ్వు' కవితలో చెప్పారు. నిశ్శబ్ద సారం సముద్రాలైతే, శబ్ద విస్తారం పర్వతాలు అన్నారు. జీవితంలో అన్ని కొట్టివేస్తే మొదటి పంక్తి మాత్రమే మిగిలిందని చెబుతూ ఎవరి వాదం వారిదే అయితే పరిస్థితి ఇలాగే ఉంటుందని స్పష్టం చేశారు. అమ్మ, నాన్న చెలిమి, జీవితం, దువా, యామిని, నవోదయం, ఆశ, డాలర్ డ్రీమ్స్, సగటు సాఫ్ట్ వేర్ ఇంజనీర్, వలస పక్షులు అన్న కవితలు సామాజిక స్పర్శతో, సమస్యల దర్పణంతో, నిత్యజీవన సంఘర్షణల రథ్యలో ఆలోచనాత్మకంగా సాగాయి. 'ఇది ఆకలి రాజ్యం/ ఇక్కడ ఆదర్శాలు పూజ్యం' అని చెప్పారు. గురివింద, ఆశలకేం అనంతం, నిత్య చైతన్య ప్రవంతి, మనస్సాక్షి అన్న కవితలు అనుభూతి స్పర్శని కలిగిస్తాయి. ఇప్పుడు కారణాలు కొత్తవి అయినా అవి చేరే దారులు పాతవే అని 'ఒకే దుఃఖం'కే కవితలో దుఃఖ కారణాలను తలపోశారు. ఒక రాత్రి, అమ్మకు వందనం, నిరీక్షణ, కాలిక వేగం కవితలు కవిలోని సూక్ష్మ పరిశీలనా దృష్టిని, లోకజ్ఞతను, విస్తారిత ప్రాపంచిక దృష్టి కోణాన్ని వెల్లడించాయి. కరోనా కాలంలో రాసిన 'వలస' కవితలో 'రహదారిని చీల్చుకుంటూ / వెళుతున్న పాదాలు / పుడమికి రక్తాన్ని ఎక్కిస్తున్నాయి/ రాత్రిని చీల్చుకుంటూ వస్తున్న / సూర్యుణ్ణి ఎరిపెక్కిస్తున్నాయి' అని వలస కూలీల కన్నీటి మనోవేదనను అక్షరంలో తడిపి ఆర్ద్రంగా పలికించారు. అసమ్మతి, మనిషి కవితలు ప్రకృతి, ప్రవర్తన, పరివర్తనలను గురించి తెలిపాయి. చివరి కవిత 'మూలాఖత్' పువ్వులో నుంచి పుట్టిన పరిమళం, నీలాకాశంలోని నల్లమబ్బుల పరితపనలను తెలిపి అవి కాలరేఖ అంచుపై లిప్త పాటైనా కరచాలనం చేయాలనుకుంటున్నాయన్న అపురూప భావనను వ్యక్తీకరించారు. విషయ నిష్టత, వస్తు నిర్దిష్టత, శైలీ విలక్షణత, భావగాంభీర్యత కలిగిన కవితల విభిన్నతే ఈ సంపుటి.

డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

## సీనియర్ సిటిజన్స్ అనుభవాలు సమాజానికి అవసరం



**హయత్‌నగర్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ ప్రగతి నగర్ లోని ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకోబడిందని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మీయ వాతావరణం లో మిఠాయిలు పంచుకుంటూ, శాలువాలతో పరస్పరం సత్కరించుకున్నారు. ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులు సి.హెచ్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు రాంరెడ్డి, ఉపాధ్యక్షులు విశ్వేశ్వర రావు, రామచంద్రరెడ్డి, కోశాధికారి ఏ. సత్యనారాయణ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృపాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు రాములు, సంజీవరెడ్డి, విష్ణుమూర్తి, రామేశ్వరి దేవి, చీఫ్ అడ్వైజర్ సోమిరెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన కమిటీని అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజ సేవలో సీనియర్ సిటిజన్లు కీలక పాత్ర పోషిస్తారని, మీ అనుభవం సమాజాభివృద్ధికి దిక్సూచి కావాలని వారు కొనియాడారు.

# మహిళలు, బాలికలకు అత్యంత ప్రాధాన్యత

- నేర నియంత్రణలో సీసీటీవీల కీలకం
- జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** మహిళలు బాలికలకు భద్రత విషయంలో అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు, నేరాలు నియంత్రించడంలో సిసిటీవీలు కీలకంగా మారుతున్నాయని అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సమీక్ష సమావేశంలో ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ఎస్పీ దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, విచారణను వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా, జారీ అయిన నాన్-బెయిలబుల్ వారెంట్ల లు అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచి వారిని నియంత్రించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు గల కారణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్న హాట్‌స్పాట్‌లలో నివారణ చర్యలు తీసుకోవాలని, ప్రజలలో అవగాహన కల్పించడానికి కళాజాత బృందాల ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు బాలికలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి



సారించాలని, అటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఎటువంటి జాప్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారి నేర చరిత్రను పూర్తిగా పరిశీలించి రౌడీ షీట్‌లు తెరవాలని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడానికి రికార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమాజంలో మహిళలు, బాలికలకు పూర్తి భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని ఆయన తెలిపినారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలన కొరకు కష్టపడి పని చేయాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర చాలా కీలకమని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపినారు. ప్రజలలో సీసీటీవీల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని, వాటి ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా, గుట్కా విక్రయాలు, పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారాంతపు రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఓపెన్ డ్రింకింగ్ నివారణ, మరియు వాహనాల తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఇ-పెట్టీ కేసులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని కేసుల కన్విక్షన్ శాతాన్ని పెంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇట్టి కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ ఇటీవల కేసులలో కేసులలో కన్వెన్షన్ రావడానికి సహకరించిన కోడంగల్ కోర్ట్ ఏపీపిఓ అధికారి అభినై, వికారాబాద్ ఏజెఎఫ్‌సిఎం కోర్ట్ అధికారిని ఏపీపీ సమీనా బేగం, పోలీస్ అధికారులు ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సరోజా, కోడంగల్, పిఎస్, ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, నవాబ్ పేట్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓ పుల్లిక్, కోర్ట్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ కోర్ట్ కానిస్టేబుల్ అధికారులకు శాలువాతో సత్కరించి, మేమంటోలు అందించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్, వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి తాండూర్ డిఎస్‌పి బాల కృష్ణ రెడ్డి, పరిగి డిఎస్‌పి శ్రీనివాస్ డిటిసి డిఎస్పి శ్రీనివాసులు అధికారులు, డి సి ఆర్ బి డి ఎస్ పి జానయ్య, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చందానగర్‌లో బీసీ జేఏసీ ఆందోళన




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిసి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శేరిలింగంపల్లి బిసి జెఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్ లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బిసి రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్న వ్యతిరేక శక్తులకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి తెలంగాణ జేఏసీ మాజీ చైర్మన్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కో చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తెలంగాణ బిసి కుల సంఘాల జేఏసీ కన్వీనర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, జేఏసీ నాయకులు తుడి ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ లు మాట్లాడుతూ దేశంలో స్వతంత్రం వచ్చిన నాటినుంచి నేటి వరకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేవలం బిసి లకు మాత్రమే లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి లకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 18 వ తేదీన బంద్ ఫర్ జస్టిస్ పేరుతో తలపెట్టిన తెలంగాణ బంద్‌ను సంపూర్ణంగా విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కె సాయన్న ముదిరాజ్, బీసీ జేఏసీ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, సగర సంఘం రాష్ట్ర సలహాదారులు కెపి రామ్ సగర, సగర సంఘం గ్రేటర్ అధ్యక్షుడు మోడల రవి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక శ్రీనివాస్ సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంగాధర్ సగర, జేఏసీ నాయకులు జిల్ల గణేష్, సీతారాం సగర, రామకృష్ణ సగర, అశోక్ యాదవ్, నరసింహ, శంకర్ ముదిరాజ్, బాలరాజు సగర, నారాయణ రావు, శివశంకర్, ఆంజనేయులు సగర, చింతకింది రవీందర్ గౌడ్, కుమార్ యాదవ్, చెన్నం రాజు ముదిరాజ్, చందు సగర, శివ సగర, రాము, తిరుమలేష్, అడ్వకేట్ రమేష్, అంజమ్మ, మాధవి, బిక్షపతి, వెంకట నర్సింహా రావు, రమేష్ గౌడ్, రాజు ముదిరాజ్, మధుకుమార్, పెద్ద సంఖ్యలో బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



**మణికొండ, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ గెలుపు ఖాయమని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లలో కార్తీక్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని షేక్‌పేట్ డివిజన్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ "గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగుచెందారు. అమలు కాని హామీలతో ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు సహా ప్రతి వర్గం కూడా కెసిఆర్ గారి పాలనలోనే అభివృద్ధి జరిగిందని గుర్తిస్తున్నారు. ప్రజలు తిరిగి ఆ బంగారు తెలంగాణ పాలనను కోరుకుంటున్నారు" అని, "జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్‌కి భారీ మెజారిటీతో గెలుపు అందించబోతున్నారని, ఇది కేవలం జూబ్లీహిల్స్ విజయం కాదు, ఇది తెలంగాణ అభివృద్ధి దిశగా ప్రజల విశ్వాసానికి నిదర్శనం అవుతుంది" అని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజల అనంతరం సీతారాం ధూళిపాళ, విష్ణువర్ధన్ రెడ్డి, రాములు వెంకటేష్ అందే లక్ష్మణ్, శ్రీనివాస్, షేక్ అరీఫ్, శ్రీధర్, అరీఫ్‌లు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించి, మాగంటి సునీతా గోపినాథ్ అభ్యర్థిత్వానికి మద్దతు కోరారు.

## సుప్రీంకోర్టు జడ్జి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**తూప్రాన్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** సుప్రీంకోర్టు జడ్జి గవాయి మీద జరిగిన దాడిని చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్లను వెంటనే ఇవ్వాలని కోరుతూ ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో ప్యాసింజర్ చంద్రశేఖర్ రెడ్డికి సమర్పించారు. వృద్ధులు వికలాంగులువితంతువులు ఒంటరి మహిళలు మరియు చేయూత పెంచను దారుల పెంచన్లను ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి మెదక్ జిల్లా ఇంచార్జ్ బొజ్జ సైదులు మాదిగ, ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమ్కైన తూప్రాన్ లో పెంచన్ దారుల సమావేశం లో రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం పెంచన్లను తక్షణమే పెంచాలని, కొత్త పెన్షన్లను ఇవ్వాలన్నారు. వృద్ధులు వితంతువుల ఒంటరి మహిళలు మరియు చేయూత పించను దారులకు 2000 రూపాయల నుండి 4000 రూపాయలకు వికలాంగులకు 4000 నుండి 6000 రూపాయలకు పెంచను పెంచుతామని అధికారంలోకి వచ్చిన నెలలోనే అమలు చేస్తామని హామి ఇచ్చి 22 నెలలు గడుస్తున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మోసం చేస్తున్నారన్నారు. పెంచన్లను సాదించు కోవడం కోసం అక్టోబర్ 6 నుండి నవంబర్ 6 వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడంకోసం పెంచన్ దారులందరు ధర్నాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ తూప్రాన్ ఇంచార్జ్ రాములు అధ్యక్షతన జరిగింది వీహెచ్పీఎస్ జిల్లా అధ్యక్షులు బాష్పల్లి పాండు, మహిళ అధ్యక్షురాలు స్వరూప, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి మాదిగ మహిళా నాయకురాలు తూప్రాన్ టి పుష్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికోవడం జరిగింది. వాడే నరేష్ మాదిగ గజ్జల మల్లేశ్వరి మహిళా కమిటీ అధ్యక్షురాలుగా సద్దగుల్లి పోచవ్వ మౌనిక అనసూయ భాగ్యమ్మ బోధవ జయమ్మ, యాదమ్మ జిల్లా ఇన్చార్జి సైదులు, రాములు తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాలోని పెట్రోల్ బంకులలో మౌలిక వసతులు కల్పించాలి



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల సౌకర్యార్థం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానందం అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పెట్రోల్ బంకుల్లో వసతులు తదితర వివరాలపై ఆయన శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఉన్న యజ్ఞయ్య భారత్ పెట్రోలియం బంకును అదనపు పౌరసరఫరాల అధికారి నిసార్, అధికారి నాగరాజుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకులో ఉన్న స్టాకు, పెట్రోల్, డీజిల్ వివరాలను పరిశీలించారు. అలాగే పెట్రోల్ బంకులో యూపీఐ సేవలు అందుబాటులో లేకపోవడంతో వెంటనే వినియోగదారుల సౌకర్యార్థం యూపీఐ, స్వైప్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అక్కడ ఉన్న మేనేజర్, సిబ్బందిని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులలో మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానందం సూచించారు. ఈ విషయంలో అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేయనున్నట్లు ఏమైనా ఇబ్బందులు ఉంటే జరిమానాలు విధించడంతో పాటు సీజ్ చేస్తామని ఈ విషయంలో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు వెంటనే అన్ని బంకులలో మౌలిక వసతులు కల్పించాలని నిత్యానందం తెలిపారు. వినియోగదారుల నుంచి పెట్రోల్, డీజిల్ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటించడంతో పాటు వారితో మర్యాదగా ప్రవర్తించాల్సిందిగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానందం సూచించారు. ఈ సందర్భంగా అడిషనల్ అధికారి నిసార్, అధికారి నాగరాజు తదితరులు ఉన్నారు.

## నేటి బంద్‌ను విజయవంతం చేద్దాం

- మధుయాష్కి గౌడ్



**హయత్ నగర్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల కోసమై బీసీ సంఘాలు, జేఏసీ ఆధ్వర్యం లో ఈ నెల 18న చేపట్టిన రాష్ట్ర బంద్ కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలిపిందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మధు యాష్కి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తుందని వారు అన్నారు. కానీ కొంత మంది కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం, కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం తదితర పరిణామాలతో 42 శాతం రిజర్వేషన్ల విషయం లో ఇక క్షేత్రస్థాయి నుంచి, ప్రజల మమేకంతో పోరాటానికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని వారు తెలియజేశారు. "ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ సాధ్యం కాదు" అనే పరిస్థితులు ఏర్పడ్డాయి. కావున ఈ బంద్ లో ప్రజలందరూ భాగస్వామం కావాలని కోరుకుంటున్నాను. శాంతి యుతంగా మన నిరసనను తెలియజేయాలని, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు చూచించారు.

## వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టండి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



**సంగారెడ్డి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని సంగారెడ్డి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ లు) చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మోడల్ పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షలు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల ద్వారా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. కె. మల్లిక మండల అభివృద్ధి అధికారి హరి నందన్, తహసిల్దార్ భవాని, మండల విద్యాధికారి భీమ్ సింగ్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ మంతూర్ సుధాకర్ రెడ్డి, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

# చేప పిల్లలు విడుదలకు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** జిల్లాలో చేపల ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని నీటిమనరులైన చెరువులో కుంటలు ప్రాజెక్టులలో చేప పిల్లలు విడుదలకు చేయాల్సిన ఏర్పాట్లపై సన్నాహాక సమావేశం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్ర శేఖర్, మత్స్యశాఖ అధికారి మధుసూదన్, నీటి పారుదలశాఖ అధికారి జనార్ధన్, డిపిఓ సాయిబాబాలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ చేప పిల్లల విడుదల ద్వారా మత్స్యకారుల కు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు వారి జీవన వారి జీవన విధానం బలోపేతం అవుతుందని తెలిపారు . జిల్లాలో మొత్తం 1025 సీజనల్ చెరువులు, అలాగే 79 దీర్ఘకాలంగా నీరు




నిల్వ ఉండే చెరువులు ఉన్నాయని, వీటిలో . సింగూరు ప్రాజెక్టు, సదాశివపేట మండలం, తంగడపల్లి నీలగిరి ప్రాజెక్టులు, నారాయణఖేడ్ డివిజన్ , పరిధిలోని సిర్గాపూర్ మండలం లోని నల్లవాగు ప్రాజెక్టు, లలో చేప పిల్లల విడుదలకు అనుకూలమైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. చేప పిల్లల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. మత్స్యశాఖ అధికారులు క్వాలిటీ చెక్ ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన చేప పిల్లలే చెరువుల్లో విడుదల చేయాలన్నారు. ఎంపీడీవోలు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, ప్రతి పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించి ఈ కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ మత్స్యశాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మత్స్యశాఖ అధికారులకు సమన్వయం, రికార్డు నిర్వహణ, చెరువుల ఎంపిక, నీటి స్థాయిల పరిశీలన, విత్తనాల నాణ్యత వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అధికారులు సమగ్ర ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు . చేప పిల్లల విడుదల కార్యక్రమం, పారదర్శకంగా ఉండేలా మత్స్యకారుల సంఘాల సమక్షంలోనే చేప పిల్లలు నీటి వనరులలో విడుదల చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు,సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ మెడిసన్ దందాపై సమాచారం ఇవ్వండి

- అనిల్ కుమార్ అడిషనల్ డైరెక్టర్ శేర్లింగంపల్లి
- జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్



**వికారాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న మత్తుమందుల అక్రమ దందాను అరికట్టేందుకు ప్రజలే ముందుకు రావాలని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీసిఏ పిలుపునిచ్చింది, ఈ సందర్భంగా అనిల్ కుమార్ అడిషనల్ డైరెక్టర్ శేర్లింగంపల్లి, వికారాబాద్ జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ... చుట్టుపక్కల ఏం జరిగినా ఫోన్ కాల్ ద్వారా టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇస్తున్నామన్నారు, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే యుద్ధంలో పౌరులే కీలకమని, పరిసరాలలో జనవాసాల్లో, ఇండస్ట్రియల్, ఏరియాలో ఎక్కడైనా మత్తుమందులు తయారు చేస్తున్న డాక్టర్ చీటీ లేకుండా అబార్షన్ కిట్, నిద్ర మాత్రలు వంటివి అమ్ముతున్న ఇతర అనుమానాస్పద యాక్టివిటీస్ కనిపించిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గొప్పంగా ఉంచుతామని ఎవరు భయపడవలసిన అవసరం లేదని హామీ ఇచ్చారు, అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు 18005996969 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



• మంత్రి దామోదర రాజనర్సింహ

**మక్తల్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రమాణాలతో కూడిన విద్య,మెరుగైన వైద్యం, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సాంకేతిక శాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మక్తల్ మండల పరిధిలోని సంగంబండ రిజర్వాయర్ తో పాటు మక్తల్ పట్టణంలోని పెద్ద చెరువు మిని ట్యాంక్ బండ్ లో చేప పిల్లలను మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తో కలిసి విడుదల చేశారు. అనంతరం రూ.377 లక్షల వ్యయంతో మక్తల్ మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేసి వన మహోత్సవంలో భాగంగా మినీ ట్యాంక్ బండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో 100 శాతం రాయితీతో 26 వేల చెరువుల్లో 88 కోట్ల చేపపిల్లలు,10 కోట్ల రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాళ్ళతో తనకు అవినాభావ సంబంధం ఉందని, తమ ప్రాంతాలు సంగారెడ్డి, జోగిపేట, సదాశివ పేట లలో ఆ సామాజిక వర్గానికి చెందిన వాళ్లు చాలా ఉన్నారన్నారు. బీసీ సమాజంలో నాయకత్వం ఎదగాలని, తద్వారా వెనకబడ్డ కులాలకు బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందుతుందన్నారు. ఎస్సీ సామాజిక వర్గాల 30 ఏళ్ల పోరాటానికి చరమగీతం పడి వారి వర్గీకరణ కల నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ అని, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. బీసీ సమాజంలో నూటికి నూరు శాతం కమిట్మెంట్ ఉన్న నాయకుడు వాకిటి శ్రీహరి అని ముదిరాజ్ కులంలో పుట్టిన శ్రీహరి ఆ జాతికే గర్వకారణం అని కొనియాడారు. నారాయణపేటలో 50 సీట్లతో ఇప్పటికే మెడికల్ కాలేజీ అందుబాటులోకి తీసుకొని వచ్చామని, మరో 9 నెలల్లో చికిత్స కోసం హైదరాబాద్ వరకు వెళ్లకుండా గ్రామాల్లోనే చికిత్సా అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బీద బడుగు బలహీనర్గాలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. పక్కన కృష్ణమ్మ పారుతున్నా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మక్తల్ ప్రాంతానికి నీళ్ల రాలేదనీ, కాంట్రాక్టర్లను బతికించడానికే గత పాలకులు ప్రాజెక్టులు తెచ్చారని ఎద్దేవా చేశారు. గత పాలకుల మాటలే తప్ప చేతలు లేవు అన్నారు. గత పాలకులు మైక్ పట్టుకున్న ప్రతిసారి జీవో 69,14 అని కాగితాలు చూపించి మాత్రమే కాలం గడిపారు తప్ప ప్రాజెక్టు పూర్తి చేయలేదనీ ధ్వజమెత్తారు. ఈ ప్రాంతం వెనుబాటు తనానికి గురి అయిందని గుర్తించి , జీవో నెం 69, 14 ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని నారాయణపేట- మక్తల్-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని కృషి చేస్తున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలిపారు. గత ప్రభుత్వ హయంలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చివరి అవకాశం కింద నీళ్లు ఇస్తాం జీవో ఇచ్చి కాన్సల్ చేసిందన్నారు. 30 కిలోమీటర్ల దూరంలో కృష్ణమ్మ నీళ్లు ఇస్తుంటే 330 కిలోమీటర్ల దూరం టెలర్స్ పెట్టడం జరిగిందని, కాంట్రాక్టర్లను బతికించడానికే గత పాలకులు ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. పాలమూరు – రంగారెడ్డి కాలువల నీళ్లు ఇస్తాం అని కథలు చెప్పారు తప్ప ప్రాజెక్టు పూర్తి చేయకపోగా, నారాయణపేట – మక్తల్ – కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తుంటే అడుగడుగునా అడ్డుకోవాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు కోసం భూమి ఇచ్చిన వారిని బి.ఆర్.ఎస్. నాయకులు రెచ్చగొడుతున్నారు. మక్తల్ నియోజకవర్గంలో 255 నీటి వనరులు ఉన్నాయని వాటిలో 94 లక్షల చేప పిల్లలను వదలడం జరుగుతుందని, దీనివల్ల 46 మత్స్య సహకార సంఘాలలోని 4500 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. మక్తల్ పట్టణంలో మినీ ట్యాంక్ బండ్ బ్యూటీఫికేషన్ పనులు దాదాపుగా 4 కోట్లతో ప్రారంభించామని, ఈ పనులు కూడ అడ్డుకోవడానికి బి.ఆర్.ఎస్ నాయకులు ప్రయత్నం చేశారనీ ఎన్ని అడ్డంకులు ఎదురైనా సుందరీ కరణ పనులను పూర్తి చేసి తీరుతాం అన్నారు. మన ప్రాంతానికి నిధులు కేటాయించడంలో చొరవ చూపిస్తున్న దామోదర రాజనర్సింహ మన జిల్లాకు ఇన్చార్జి రావడం చాలా సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్, ఎమ్మెల్యేలు డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఈర్లపల్లి శంకర్, రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయి, మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కాంత్ కుమార్, మత్స్యశాఖ జిల్లా అధికారి రహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

• మంత్రి వాకిటి



**కృష్ణ, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ప్రతి పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పాడి పరిశ్రమ,మత్స్య సంక్షేమ, క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం కృష్ణ మండల హిందూపూర్ శివారులోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో మంత్రి వాకిటి శ్రీహరి కల్యాణ లక్ష్మీ, షాదిముబారాక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని అన్నారు. అందులో భాగంగానే ఆడ బిడ్డ పెళ్ళికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడరాదని కల్యాణలక్ష్మీ, షాదిముబారాక్ పేరున లక్ష 116 రూపాయల చెక్కులు అందించి వారి ఇబ్బందులు తీర్చడం జరుగుతుందని అన్నారు.మండలంలోని 77 మంది లబ్ధిదారులకు చెక్కులు, మంత్రి, జిపివో అధికారులు, పంపిణీ చేశారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

• మంత్రి వాకిటి శ్రీహరి

**కృష్ణ, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** మండలం హిందూపూర్‌లో మంత్రి వాకిటి శ్రీ హరి ఐకేపి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు గిట్టు బాటు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వారికి గిట్టు బాటు ధర తో పాటు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు నష్ట పోరాదనే ఉద్దేశంతో ఐకేపి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మద్దతు రకం (ఎ) ధర 2389/-, క్వింటాలుకు సాధారణ మద్దతు రకం ధర 2369/- క్వింటాలకు, సన్నవడ్లకు 500 బోనస్‌గా చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రతి గింజ కొని రైతుకు లాభం చేకూరుస్తామని అన్నారు. రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. దళారుల నమ్మి రైతులు మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు,ఆర్డీఓ రామచందర్ నాయక్, మండల అధికారులు తదితరులు, పోలిస్ సిబ్బందిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు



**చేర్యాల, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నాల్ల నాగుల శ్వేత వెంకటాచారి అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం వడ్ల కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ నాల్లనాగుల శ్వేత-వెంకట్ చారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని, రైతులు కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి చెందిన వడ్లకు రూ.2,369 చెల్లిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారం సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నామన్నారు. ధాన్యంను దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి కనకయ్య, సిఏ మలిపెద్ది సుజాత, దొడ్డి వెంకటేష్, శెట్టే యాదగిరి, బండారి నర్సయ్య,శెట్టే యాదయ్య, శెట్టె అనిల్, బండారి కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల నిధులను వెంటనే విడుదల చేయాలి



**నంగునూరు, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి కిష్టయ్య, ఉపాధ్యక్షుడు బాకీ చంద్రబాను, జిల్లా కార్యదర్శులు ఎనగందుల మనీష్ కుమార్, దేవర మల్లయ్య డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరులో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నంగునూరు మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించినప్పుడు ప్రతి పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికుల నిధులను గత కొన్ని నెలలుగా విడుదల చేయకపోవడంతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారని తెలియజేశారు. తెలంగాణలో అతిపెద్ద పండుగ అయినటువంటి బతుకమ్మ, దసరా పండుగకు నిధులు రాకపోవడంతో పండుగలను జరుపుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. కనీసం దీపావళి సందర్భంగానైనా వెంటనే ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బిల్లులను సరైన సమయంలో మంజూరు చేయకపోవడంతో వంట కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలకు పరిష్కారం చూపవలసి బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియచేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో రావలసిన నిధులను ఇంతవరకు విడుదల చేయకపోవడం బాధాకరమని వెంటనే నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పర్యవేక్షణ తనిఖీల పేరుతో 168 బృందాలుగా 1474 మంది ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలో విద్యార్థులకు విద్యను దూరం చేసే చేసే చర్యలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయడంతో పాటు ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



**రాయికోడ్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి పై అక్రమ కేసులు పెట్టి పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవలనుకోవడం సరికాదని జర్నలిస్ట్ సంఘాల నాయకులు రమేష్, విట్టల్, సాయిరాం శెట్కార్ లు అన్నారు. ఎడిటర్‌పై కేసుల నమోదును నిరసిస్తూ నల్లబ్యాడ్జిలు ధరించి శుక్రవారం తహసీల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. తహసీల్దార్ ఆశజ్యోతికి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఒగ్గు విట్టల్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఏపి ప్రభుత్వ పెద్దల వత్తిడి తోనే ఎడిటర్ పై వరుసగా కేసులు పెట్టి, నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఎడిటర్‌పై కక్ష పూరిత చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పత్రికా విలేకరులు పండరి, ప్రశాంత్, హనుమంతు ఆనంద్, శ్రీనివాస్,మ్యాతరి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి

• జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం చౌటకూర్ మండలం తాడ్దాన్ పల్లి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులకు ఇసుక కొరత రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం స్థాయిని బట్టి వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, నిర్మాణంలో ఉన్న ఇండ్లు ఏఏదశలో ఉన్నాయనిఅధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్లాబ్ దశ వరకు పూర్తి అయినా ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు.మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని, ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు, ఎంపీడీవో శంకర్, అధికారులు ,ఉపాధ్యాయులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే బాధ్యత బి డబ్ల్యువో సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరంలో బిడబ్ల్యుఓ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఆరోగ్యంపై తల్లి, బిడ్డలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఇళ్లలో సహజసిద్ధంగా లభించే మునగ, కరివేపాకు వంటి ఆకు కూరలను ఆహారంలో చేర్చుకోవాలని, ఇవి శరీరానికి పుష్టి, శక్తిని అందిస్తాయని చెప్పారు. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అత్యంత శ్రేయస్కరమని, ఆహార అలవాట్లపై మహిళల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. గర్భిణీలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తగిన ఆహారం, పోషకాహారం గురించి విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి, వారిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువును ఎప్పటికప్పుడు పరిశీలించి ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి డబ్ల్యు అధికారి హేమా భార్గవి, సిడిపిఓలు, అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలి



**మల్దకల్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి వెంటనే పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరుతూ మల్దకల్ మండలం ఎంపీడీవో ఆంజనేయ రెడ్డికి ఐఎఫ్ టి యు శుక్రవారంఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి వెంటనే పర్మినెంట్ చేయాలని, గ్రామపంచాయతీ విభాగంలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, 2024 జనాభా ప్రకారం గ్రామపంచాయతీలో ఉద్యోగ సిబ్బంది కార్మికులను పెంచి పని ఒత్తిడి తగ్గించాలని, కనీస వేతనం 26,000 ఇచ్చి పిఎఫ్ ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని,వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2016 అక్టోబర్ 26 తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం దేశ వ్యాపితంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం వారు డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించి ప్రభుత్వ రంగ సంస్థలను బహిరంగంగా వేలం చేస్తూ,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికులకు మరణ శాసనం విధిస్తోందని వారు తెలిపారు. హిందూ సెంటిమెంట్తో దేశంలోని మెజార్టీ హిందువుల ఉపాధిని నరేంద్ర మోడీ ప్రభుత్వం దెబ్బతీస్తుందని వారు తెలిపారు.ముఖ్యమంత్రి కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజ్వారంగోవిందు,బీరెల్లి నాగరాజు,మల్లెందొడ్డి రాములు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలి

• విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
• తాడ్దాన్ పల్లి, సుల్తాన్పూర్ పాఠశాలలను ఆకస్మి తనిఖీ
• జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం చౌటకూర్ మండలం తాడ్దాన్ పల్లి, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేద్రం ను సుల్తాన్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి చదువు, ప్రతిభా స్థాయిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. రోజూ విద్యార్థులకి స్పెషల్ క్లాసులు చెప్తున్నారా అని, సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పోషకాహార సమస్యల పరిష్కారం కోసం నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సుల్తాన్పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోజు సాయంత్రం విద్యార్థులకి స్పెషల్ క్లాసులు చెప్తున్నారా అని, సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు అందరూ ఇప్పటి నుండే వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు, ఎంపీడీవో శంకర్, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించాలి

- కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ప్రాథమిక సహకార సంఘాల కార్యదర్శులతో వరి ధాన్యం కొనుగోలు పై సన్నాహక, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2025 -26 సంబంధించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 57 వేల 642 ఎకరాలలో వరి సాగు జరుగుతుందని, 3 లక్షల 58 వేల 970 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేయడం జరిగిందని, 2 లక్షల 32 వేల 743 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను లోతట్టు ప్రాంతాలలో ఏర్పాటు చేయకూడదని, కొనుగోలు ప్రక్రియకు అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు, తేమ శాతం యంత్రాలు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేరువేరుగా కొనుగోలు చేసి నిల్వ చేయాలని, కొనుగోలు సమయంలో ఎప్పటికప్పుడు ధాన్యం, రైతుల వివరాలను ట్యాబ్ లలో నమోదు చేయాలని, రిజిస్టర్ సక్రమంగా నిర్వహిస్తూ రైతుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ, మౌలిక వసతులు కల్పించాలని, తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తమ సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి కొనుగోలుకు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే గన్ని సంచులు రైతులకు అందించాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరించిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లాలో టాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు మాత్రమే కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, డి సి ఎం ఎస్, ఐ కె పి ల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారులతో హార్వెస్టర్ వాహనాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేయబడిన రైతుల పంట సాగు డాటా ప్రకారం మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, హార్వెస్టర్ వినియోగం సమయంలో ఆర్ పి ఎం 18-20 ఉండేలా పర్యవేక్షించాలని, ఇలా నిర్దేశిత వేగంతో వినియోగించినట్లయితే తాలు పోయి నాణ్యమైన ధాన్యం వస్తుందని తెలిపారు. హార్వెస్టర్ వాహన వినియోగ సమయంలో నిబంధనలను పాటించాలని, కోతకు వచ్చిన తర్వాత మాత్రమే పంట కోయాలని, బ్లోయర్ యాక్టివ్ మోడ్ లో ఉండాలని తెలిపారు. అనంతరం వానాకాలం కొనుగోలుపై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, డి.పి.ఎం.లు సారయ్య, స్వర్ణలత, ఎ.పి.డి. అంజయ్య, జిల్లా సమాఖ్య ప్రతినిధులతో కలిసి ఎ. పి. ఎం.లు, సి. సి.లు, వి. ఓ.లు, వి. ఓ. ఎ. లతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన వరి ధాన్యాన్ని సేకరించాలని, మద్దతు ధరతో సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు, డి. సి. ఎం. ఎస్. -ఆదిలాబాద్ మేనేజర్ ప్రమోద్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి డివిజనల్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యధిక వరి ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ

- రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం
- చిల్పూర్ ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** ప్రస్తుతం దేశంలో అత్యధిక వారి ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని,వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. చిల్పూర్ మండలంలోని మల్కాపూర్, చిల్పూర్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈసందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా క్లినింగ్ మిష న్, మయిస్చర్ మిషన్, త్రాగు నీరు, విద్యుత్ లైట్లతో పాటు తదితర ఏర్పాట్లు చేయాలని నిర్వహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కల్లానికి వచ్చిన ధన్యంలో ఒక్క గింజ కూడా తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాల ని నిర్వహకులకు సూచించారు. మహిళలకు ఉపాధి కల్పించాలి మహిళా సంఘాలను బలోపేతం చేయాల నే ఉద్దేశ్యంతోనే మహిళా సంఘాలకు ధాన్యం కొనుగో లు కేంద్రాలను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎవరికీ ఒక్క రూపా యి కూడా ఇవ్వకూడదని ఎవరైనా డబ్బులు అడిగితె తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. రైతులు ప్రభు త్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే ధాన్యంఅమ్ముకోవా లని,దళారుల వద్దకు వెళ్లి నష్ట పోవద్దని సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనడం లేదని వెల్లడించారు. డబ్బులుకూడా రైతుల ఖాతాలలో వారం రోజుల లోప లనే జమ కానున్నాయని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్మాలని కోరారు. రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. దేశంలో నే ఎక్కడా లేని రైతు సంక్షేమపథకాలను కాంగ్రెస్ ప్రభు త్వం అమలుచేస్తుందని తెలిపారు. ప్రతీ నిత్యం నియో జకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తు న్నాని వివరించారు. చిల్పూర్ దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. దింతో ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. కొత్తగాఏర్పడిన చిల్పూర్ మండలంలో మండల కార్యా లయల కంప్లెక్స్ నిర్మాణం,చిల్పూర్ ఆలయ అభివృద్ధి చేయడం తన బాధ్యత అని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో చిల్పూర్ దేవలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లావణ్య , ఆర్డీవో, తహసీల్దార్, ఎంపిడివో, ఏఈవో, డిపిఎం, ఎపిఎం, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధు లు, నాయకులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ ఆహారంపై కొరడా



**బెల్లంపల్లి, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలో కల్తీ ఆహారంపై మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ కొరడా జులూపించారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి పట్టణం లోని హెూటల్లను ఆకస్మికం గా తనిఖీ చేశారు. అతిథి రెస్టారెంట్, శ్రావణ్ గ్రాండ్ రెస్టారెంట్, రాయల్ బార్ అండ్ రెస్టారెంట్ లలో కల్తీ ఆహార పదార్థాలను గుర్తించారు. కల్తీ ఆహారం విక్రయించిన ఆయా రెస్టారెంట్ల యాజమాన్యానికి పది వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుత ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ప్రతి హెూటల్, బార్ యజమానులు నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించాల న్నారు. పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, మళ్లీ ఇలాంటి కల్తీ ఆహారం విక్రయించినట్లు గుర్తిస్తే, సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వ్యాపార ట్రేడ్ లైసెన్సులు రద్దు చేసి షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్



**ములుగు బ్యూరో, అక్టోబర్17 (జనం సాక్షి):** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ నేర సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలుగా ములుగు జిల్లా పోలీస్ విభాగం ప్రత్యేక నిఘా చర్యలను చేపట్టింది.తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు ములుగు జిల్లా పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ షీటర్లకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని,వారి కదలికలపై నిఘా ఉంచాలని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు.ఎస్పీ ఆదేశాల ప్రకారం, ముందస్తు చర్యలలో భాగంగా ములుగు జిల్లా పోలీస్ అధికారులు మొత్తం 69 రౌడీ షీటర్లు మరియు 128 సస్పెక్ట్ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, వారి కదలికలపై మరింత నిఘా పెంచారు.ఈ సందర్భంగా,ఏవైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ షీటర్లను హెచ్చరించారు.గత సంవత్సర కాలంగా సత్ప్రవర్తన కలిగి ఉన్న 20 మంది పై రౌడీషీట్ మరియు 53 మంది పై సస్పెక్ట్ షీట్ లు మొత్తంగా 73 మంది పై షీట్ లు ఎత్తివేసినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.ములుగు ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ములుగు పోలీస్ ఎల్లప్పుడూ కట్టుబడి కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

# పశువుల సంత భూమి దేవస్థానానిదే..



**పరకాల, అక్టోబర్ 17 (జనం సాక్షి):** పరకాల పట్టణంలో పశువుల సంత నిర్వహించే స్థలం శ్రీ భవాని కుంకుమేశ్వర ఆలయానికి చెందినదేనని హైకోర్టు తీర్పునిచ్చింది. 2006 నుండి పరకాల మున్సిపాలిటీ అధికారులు దేవస్థానం నుండి స్థలాన్ని లీజుకు తీసుకొని పశు వుల సంత నిర్వహిస్తున్నారు. గతం లో దేవస్థానం చైర్మన్ గా వ్యవహరించిన గందె వెంకటేశ్వర్లు కుంకుమేశ్వర స్వామికి సంబంధించిన నాలుగు ఎకరాల భూమి వ్యవహారంపై పలుమార్లు ప్రస్తావిస్తూ దేవాదాయ శాఖకి ఫిర్యాదులు అందించగా, దేవస్థానం భూమిలో పరకాల మున్సిపాలిటీ అధికారులు టెండర్ల ద్వారా పశువుల సంత నిర్వహిస్తున్నందుకు నోటీసులు జారీ చేశారు. అర్చకులు, ప్రజలు, నాయకులు హైకోర్టును ఆశ్రయించగా, రికార్డులను పరిశీలించి ,వాదోపవాదాలు జరగగా, హైకోర్టు ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ పలు దఫాలుగా విచారణ చేసి రికార్డులను పరిశీలించి ఆ స్థలం కుంకుమేశ్వర స్వామి దేవస్థానం దని తీర్పుని ఇచ్చారు. దీంతో పరకాల పట్టణ ప్రజలు, నాయకులు, భక్తులు సంతోషంతో సంబరాలు జరుపుకున్నారు.

# సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాలరావు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 17(జనంసాక్షి) :** జాతీయ అసంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరుగుతున్న కార్డియో పల్మనరి పునర్జీవన ప్రక్రియలో భాగంగా ములుగు మండలం లో ఇంచర్ల గ్రామ పరిధిలోని 39వ సిఆర్పీ ఎఫ్ బెటాలియన్ మరియు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ బాలికల స్కూల్ మరియు కళాశాల విద్యార్థినిలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు కార్డియో పల్మనరీ పునర్జీవన ప్రక్రియ (సిపిఆర్) గురించి వివరిస్తూ గుండె జబ్బులతో మానసిక ఒత్తిడితో రక్త ప్రవాహము ఆగి గుండె కొట్టుకోవడం ఆగిపోతుంది వెంటనే ఈ సిపిఆర్ ప్రక్రియ కొనసాగిస్తే తిరిగి మనిషి బ్రతికి అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరికి సిపిఆర్ పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల 10 మందిలో కనీసము ఐదు నుండి ఆరుగురికి ప్రాణాపాయం నుండి రక్షించవచ్చునని వివరించారు. మారుతున్న జీవనశైలిలో మనిషి బాహ్య శరీరాన్నీ శ్రమింప చేయకపోవడం వలన గుండె జబ్బులు వస్తున్నాయని దానితోపాటు మనిషి ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వెంటనే ఒత్తిడికి గురై అపస్మారక స్థితికి పడిపోవడం జరుగుతుందని వివరించారు. సిపిఆర్ ప్రక్రియతో పాటు 108 వాహనానికి కూడా కాల్ చేయాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రకాంత్, 39 బెటాలియన్ సిఆర్పీఎఫ్ ఎస్ఎంఒ తారకేశ్వరి, డెమో సంపత్, సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్ ప్రిన్సిపాల్ నర్మదాబాయి, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఎన్సిడి కోఆర్డినేటర్ వెంకట్ రెడ్డి, ఫార్మసీ ఆఫీసర్ వినోద్, తిరుపతి, మమత టీచర్, హెల్త్ సూపర్వైజర్ జోయ్ సి ఫార్మసీ ఆఫీసర్ తిరుపతి, 39వ సిఆర్పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడారం ప్రాంగణ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 17(జనంసాక్షి) :** మేడారం ప్రాంగణ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మేడారం దేవాలయం ప్రాంగణ అభివృద్ధి పనుల మ్యాప్ ప్రకారం తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలను చేశారు. ప్రతి రోజు వచ్చే భక్తులకు ఆటంకం కలుగకుండా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భారీగా టేకు కలప పట్టివేత

**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 17(జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లో ఎదిర పారె-స్ట్ లో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను పారెస్ట్ పట్టుకున్నారు. వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు పారెస్ట్ రేంజ్ ఆఫీషర్ వంశీ కృష్ణ ఎదిర పారెస్ట్ అధికారులను, సిబ్బందిని తెల్లవారు జామున అప్రమత్తం చేశారు. టేకు కలప స్మగ్లర్లు కొత్తపల్లి క్రాస్ రోడ్డు వరకు కొత్తపల్లి అడవిలో నుండి వస్తున్నా టేకు కలప ట్రాక్టర్ ని గుర్తించి ఆకస్మికంగా దాడి చేశారు. స్మగ్లర్లు పారెస్ట్ అధికారులను గమనించి అడవిలోకి పరరయ్యారు. అధికారులు టేకు కలపతో ఉన్న ట్రాక్టర్ని వెంకటాపురం పారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించి సిజ్ చేశారు. పారెస్ట్ రేంజ్ అధికారి మాట్లాడుతూ కలపను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి ఉన్నతధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ఈ దాడి కార్యక్రమం లో ఏదిర సెక్షన్ ఆఫీషర్ జయసింగ్, పారెస్ట్ బిట్ ఆపిషర్లు వసంత్, చంద్రమోహన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన దండారి సంబరాలు





**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** ఆదివాసుల ఆరాధ్య దైవం అమ్మలకు అమ్మగా కొలువైన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గుడిరేవు గ్రామంలో పద్మల్ పూరి కాకోబాయి ఆలయంలో గత వారం రోజుల నుండి దండారి సంబరాలు మొదలైనాయి. శుక్రవారం ఆదివాసీ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని చిన్నారులు యువకులు వృద్ధులు సైతం కాకొబాయి అమ్మను దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు ఆదివాసులు నెమలి ఫించములు ధరించి చూడముచ్చటగా అలంకరణలతో పాటలు పాడుతూ ఆటలు ఆడినారు గోండు భాషా సాహిత్యం ప్రదర్శన లు నిర్వహించారు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి కాకుండా ఇతర రాష్ట్రాల్లోనుండి సైతం భక్తులు వచ్చి దర్శించుకున్నారు తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మెన్ కొట్నాక తిరుపతిముఖ్య అతిథి గా హాజరైనారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయకమిటి నిర్వాహకులు వసతులు కల్పించారు



# నేటి బీసీ బంద్‌ను విజయవంతం చేయండి

- బీసీల నోటికాడి ముద్దను లాక్కునే కుట్రలను తిప్పి కొట్టాలి
- బీసీ సమాజానికి పిలుపు నిచ్చిన ప్రజాసంఘాల జేఏసీ నాయకులు మాదాసి సురేష్
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి దామర కొండ కొమురయ్య



**ఆత్మకూరు, అక్టోబర్ 17 (జనం సాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించిన జీవో నెంబర్ 9 ని హైకోర్టు కొట్టి వేసినందుకు నిరసనగా నేడు తలపెట్టిన బీసీ రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి దామెరకొండ కొమురయ్య ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ పిలుపునిచ్చారు.ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో బంద్ కు సంబంధించిన వాల్ ఫోస్టర్లను వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలు చెప్పి బీసీలను మోసం చేయాలని ప్రయత్నం చేస్తున్నాయని కామారెడ్డిలో ప్రకటించినట్లుగా విద్య,ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈ అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో పొందుపరచాలని వారు డిమాండ్ చేశారు.బీసీల నోటికాడి ముద్దను లాక్కునేందుకు కొందరు అగ్రకులాలకు చెందిన వారు ప్రయత్నాలు చేస్తున్నారని వారి ప్రయత్నాలను తిప్పి కొట్టాలని వారు కోరారు.బిసిలు చేస్తున్న న్యాయబద్ధమైన ఉద్యమానికి ప్రజా సంఘాలు,కుల సంఘాలు,దళిత సంఘాలు మద్దతుగా నిలవాలని నేటి బంద్ లో వ్యాపార వాణిజ్య సముదాయాలతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని దవిజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్షుడు మిర్యాల కుమార్,ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గుండెబోయిన బిక్షపతి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నద్దునూరి రఘు మాదిగ,మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల గణేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు అర్షం సుధాకర్ మాదిగ,వివిధ సంఘాల నాయకులు మోరే ఐలయ్య,మాదాసి ఎర్ర సూరయ్య,మాదాసి ప్రభాకర్, నాగారపు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
18 అక్టోబర్ 2025

# ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలి

- మాజీ శాసనమండలి సభ్యులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్



**భువనగిరి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏకపక్షంగా రూపొందించిన ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మేము అధికారంలోకి వస్తే మారుస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ఒప్పించ లేని పరిస్థితులలో తమ పదవులకు రాజనామా చేసి ట్రిబుల్ ఆర్ నిర్వాసితుల పక్షాన పోరాడాలని మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు సూచించినారు. సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ట్రిబుల్ ఆర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, అలైన్మెంట్ ను మార్చాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వందలాదిమంది బాధిత నిర్వాసిత రైతులతో సామూహిక నిరాహార దీక్ష - వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతారాములు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్మించ తలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ అశాస్త్రీయంగా ఉన్నదని వెంటనే మార్చాలని కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ నుండి రీజనల్ రింగ్ రోడ్డు మధ్యన 40 కిలోమీటర్ల దూరం ఉండాలని మొదటి అలైన్మెంట్లో ప్రకటించిన ప్రకారం ఎందుకు అమలు చేయడం లేదని ఎవరి ప్రయోజనాల కోసం అలైన్మెంట్ మార్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రింగ్ రోడ్ అంటే వంకలు, డొంకలు, మలుపులు ఎట్లా ఉంటాయని ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ట్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డును రద్దు చేయాలని సీతారాములు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలో 8 మండలాలు 43 గ్రామాల్లోని వందలాది ఎకరాల విలువైన సాగుకు యోగ్యమైన, భూమే ఆధారంగా బతుకుతున్న రైతులు తమ భూములను కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, ట్రిబుల్ ఆర్ నిర్వాసితుల నాయకులు అవిశెట్టి పాండు అధ్యక్షత వహించగా ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గభ్యులు మాటూరు బాలరాజు దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిర్పంగి స్వామి దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బోలగాని జయరాములు, గంగదేవి సైదులు, గడ్డం వెంకటేష్, సీనియర్ నాయకులు దొంతగాని పెద్దులు, శ్రీనివాస రెడ్డి, నాయకులు పల్లెర్ల అంజయ్య, వనం రాజు ఈర్లపల్లి ముత్యాలు లావుడియ రాజు వడ్డేబోయిన వెంకటేష్ గంటేపాక శివ, లలిత తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి మెగా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



పినపాక, అక్టోబర్ 17 (జనం సాక్షి) : భద్రాద్రికొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, గోపాలరావుపేట గ్రామంలో దీపావళి సందర్భంగా మెగా వాలీ బాల్ టోర్నమెంట్ ను శుక్రవారం నాడు నిర్వాహకులు ఆరంభించారు. భద్రాద్రికొత్తగూడెం, ములుగు రెండు జిల్లాల స్థాయిలో నిర్వహించే ఈ మెగా టోర్నమెంటుకు ముఖ్య అతిథిగా పినపాక మండల తహసీల్దార్ గొంది గోపాలకృష్ణ పాల్గొని రిబ్బన్ కట్ చేసి వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఆరోగ్యానికి చాలా ఉపయోగకరం అన్నారు. క్రీడలు ఒత్తిడిని తగ్గించి, ఆత్మవిశ్వాసాన్ని, ఏకాగ్రతను పెంచి, సామాజిక నైపుణ్యాలను మెరుగు పరుస్తాయని తెలిపారు. వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్న గోపాలరావుపేట యూత్ ను తహసీల్దార్ ఈ సందర్భంగా అభినందించారు. ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల స్థాయిలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌కి 50కి పైగా టీమ్ లు హాజరయ్యాయి. విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,000, ద్వితీయ బహుమతి రూ. 20,000, తృతీయ బహుమతి రూ.10,000 లతో పాటుగా షీల్డ్ లు అందిస్తామని టోర్నీ నిర్వాహకులు గోపాలరావుపేట యూత్ తెలిపారు. టోర్నీ ప్రారంభానికి మండల తహసీల్దార్ తో పాటుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాధం. రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, వివిధ పార్టీల నాయకులు, పాత్రికేయులు, స్థానిక ప్రజలు, క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలును వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** మూడు రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లింపు చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి కట్టుబడి ఉందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా నిరంతర రివ్యూలు నిర్వహిస్తూ వడ్ల కొనుగోలు సాఫీగా సాగేందుకు చర్యలు చేపడుతున్నామని, రైతులకు మూడు రోజుల్లో డబ్బులు చెల్లిస్తాం అని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, తాడిపత్రితో వడ్లను సురక్షితంగా కప్పి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఏఎంసీ చైర్మన్ రేఖ బాబురావు, డిస్టిక్ మేనేజర్ హరికృష్ణ డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై ఆఫీసర్ రాజారాణి, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ శ్రీధర్, ఏడిఏ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి , వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి,వ్యవసాయ అధికారి శైలజ, సివిల్ సప్లై డిటి బాలమణి, ఏపీఎం తౌరియా నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, జిల్లా నాయకులు తడక వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య...!


- భర్త, కుటుంబసభ్యులే చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారంటూ మృతురాలి తండ్రి ఫిర్యాదు
- నిందితులను కఠినంగా శిక్షించాలంటూ బంధువుల ఆందోళన

మిర్యాలగూడ, అక్టోబర్ 17 (జనం సాక్షి) : అడవిదేవులపల్లి మండల కేంద్రంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో రమావత్ రజిత (32) మృతి చెందింది. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుందంటూ...ఆమె భర్త ఆంజనేయులు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి.. బంధువులకు సమాచారం అందించి మాయమైపోయాడు.. మార్చురీలో ఉన్న కూతురు శవాన్ని చూసి తల్లడిల్లిన ఆమె తండ్రి, తన కూతురు ఆత్మహత్య చేసుకోలేదని, ఆమె భర్త, వారి కుటుంబ సభ్యులు హత్య చేసి,ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు అంటూ ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఏరియా ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకున్న మృతురాలి బంధువులు నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఆందోళనకు దిగారు. ఇది హత్యా... ఆత్మహత్యా అనే విషయాన్ని తేల్చే పనిలో ఉన్నారు పోలీసులు. మృతురాలి తండ్రి కథనం మేరకు సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి మండలం, బాపన్ భాయి తండాకు చెందిన సపావత్ పరుశురాములు తన కూతురు రజితను నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలంపల్లి గ్రామానికి చెందిన రమావత్ఆంజనేయులు కిచ్చి 2015 లో వివాహం జరిపించారు. వారికి ఇరువురు బాలికలు, బాలురు కవలలు సంతానం.



ఆంజనేయులు అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తు కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. కాగా గత కొంతకాలంగా మరో మహిళతో అక్రమ సంబంధంకొనసాగిస్తున్నాడని ఈ విషయంపై తన కూతురు తాము నిలదీయగా, నా ఇష్టం వచ్చినట్టు చేస్తానని, అవసరమైతే ఆమే కోసం మీ అమ్మాయిని చంపుతానని లేదా తాను చస్తానని అంటూఉండేవా డని ఆరోపించారు. ఇటీవల దసరా పండగ కు తమ ఇంటికి వచ్చిన అల్లుడైన ఆంజనేయులు ను తన కూతుర్ని ఎందుకువేధిస్తున్నా వంటూ అడగగా మాతో గొడవపడి భార్యను,పిల్లల్ని తీసుకుని వెళ్లిపోయాడని ఈ క్రమంలో బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆంజనేయులు తన కూతురు రజిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని తమకు వరుసకు బంధువైన ఓ వ్యక్తికి ఫోన్ చెప్పాడని, తాము ఆస్పత్రికి చేరుకునేసరికి అక్కడినుండి అల్లుడు పారిపోయాడనితెలిపారు. తన కూతురు రజితను భర్త ఆంజనేయులు, మామ సూర్య, అత్త బాజు, మరిది జోగ్యా లు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పరుశురాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు అడవిదేవులపల్లి ఎస్సై వి. శేఖర్ తెలిపారు. గురువారం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకున్న మృతురాలి బంధువులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్న నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆసుపత్రి ముందు, సాగర్ రోడ్డు పై బైటాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు.

## ఆయిల్‌ఫెడ్ నుండి మీడియాపై అంక్షలు



**అశ్వారావుపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** అశ్వారావుపేట దమ్మపేట మండలం లోని అప్పారావుపేట రెండు ఆయిల్ పరిశ్రమల్లోకి అనుమతులు లేకుండా ప్రవేశం లేదని ఆయిల్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శంకరయ్య పేరిట 2.HRD/2/126/2024-25, నెంబర్‌తో 04/10/2025న ఒక సర్క్యూలర్ విడుదల చేసారు. ఆయిల్ ఫెడ్ నర్సరీల లోకి గాని పరిశ్రమల లోకి గాని ప్రవైట్ వ్యక్తులకు, అలాగే ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అనుమతి లేనిదే ప్రవేశం లేదని అనుమతి లేకుండా ఆయిల్ ఫెడ్ కు సంబంధించిన ప్రదేశాల్లో ప్రవేశిస్తే చర్యలు తీసుకొనబడతాయని మీడియాకు ఒక సెర్క్యూలర్ పంపడం జరిగినది. ఇదే విషయమై స్థానిక అశ్వారావుపేట దమ్మపేట మీడియాలో చాలా మంది రైతులు మీడియా సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ రైతులకు పరిశ్రమకు మధ్య వారధిలా ఉన్న మీడియపై ఈ ఆంక్షలు ఎందుకు విధిస్తూన్నారని ఫామ్ ఆయిల్ రైతులు కూడా అధికారుల చర్యను తప్పు బడుతున్నారు. మీడియా ద్వారా ఆయిల్ ఫెడ్ ప్రగతిని నాలుదిశల వ్యాపింప జేసినప్పుడు లేని ఆంక్షలు నేడు ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. గత రెండురోజుల క్రితం అయిల్ ఫెడ్ లో రికవరీ శాతం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం చేత మంచి గుర్తింపు పొందిందని సత్కారాలు అందుకున్న అధికారుల మెహర్బాటాలను బయట ప్రపంచానికి తెలిసేలా చేసింది కూడా ఈ మీడియా అనేది గుర్తుంచుకోవాలని కొందరు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎవ్వరి మెప్పు కోసం ఆయిల్ ఫెడ్ ఇలాంటి నిర్ణయం తీసుకొందో అర్థం కావడం లేదని అనుకుంటున్నారు. వ్యవసాయా శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆయిల్ ఫెడ్ చైర్మెన్ గంగా రాఘవరెడ్డి తదితరులు వచ్చినప్పుడు మీడియాకు అనుమతులు లేకుండా ఎలా వెళ్లాలి అని మీడియా మిత్రులు పలు గ్రూప్ లలో చర్చించుకోవడం జరిగింది. తుమ్మల పర్యటనకు మీడియా హాజరు కావడం లేదని తెలుసుకున్న టీజీ ఆయిల్ ఫెడ్ అధికారులు హుటాహుటిన 04 వ తారిఖున విడుదల చేసిన సర్క్యూలర్ ని సవరిస్తూ 17 వ తేదీన కొత్త సర్క్యూలర్ మీడియాకు విడుదల చేశారు. ఇందులో కూడా అనుమతులు తప్పనిసరి అనే ఉండటం సమేరుపు.

## రిజర్వేషన్ అమలు చేయకపోతే బీసీల సత్తా చూపుతాం




ఖమ్మం, అక్టోబర్ 17 (జనం సాక్షి) : బీసీలకు 42శాతం రిజ్వేషన్లను అమలు చేయకపోతే బీసీ ల సత్తా చూపుతామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఖమ్మం లో బీసీ నాయకులు ఆర్జేసి కృష్ణ ఆద్వర్యంలో 18న జరిగే బీసీ ల బంద్ సన్నాహక సమావేశం , నగరంలో బంద్ విజయవంతానికిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న అఖిల పక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ బిల్లుకోసం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి సాధించాలన్నారు.మేమెంతో మాకంత వాటా,రాజకీయ , విద్యా , ఉద్యోగ , ఉపాధిలలో 42% శాతం రిజర్వేషన్లు కల్పించాలని నినాదం తో పోరాడాలన్నారు. బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చి చట్టసభలో స్థానిక సంస్థల రిజర్వేషన్ లో అమలు చేసి పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల తెలంగాణా ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం తరహా లోనే మరో ఉద్యం తప్పదని హెచ్చరించారు.18న జరిగే బంద్ లో భాగంగా ఆర్టీసీ డిఎం కార్యాలయం ముందు ఆందోళలో పాల్గొనాలని కోరారు, పాత బస్టాండ్ నుండి వన్, టు,త్రీ టౌన్ ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించి అంబేత్కర్ విగ్రహం వద్ద ముగించాలని తీర్మానించారు.ఈ కార్యక్రమాల్లో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమం లో సిపిఐ,సీపీయం, టీడీపీ,ఎం.ఎల్ మాస్ లైన్,ఎన్ డి,కాంగ్రెస్ నాయకులు యర్రా శ్రీనివాసరావు, వై.విక్రమ్, మేకల శ్రీను, కూరపాటి వెంకటేశ్వర్లు, రాఘవులు, అశోక్,శ్రీనివాస్,వీరభద్రమ్, బీసి సంఘాల నాయకులు మేకల సుగుణా రావు, బోమ్మా రాజేశ్వర రావు, కురాకుల నాగభూషణం, కత్తి నెహ్రూ,పెరుగు వెంకట రమణ,షేకీనా,తదితరులు పాల్గొన్నారు.

# అధిక వడ్డీ మోసం కేసులో నలుగురు ఏజెంట్లు అరెస్ట్

- రూ. 6.77 కోట్ల ఆస్తులు స్వాధీనం

**దేవరకొండ, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లాలో అధిక వడ్డీ ఆశచూపి అమాయక ప్రజలను మోసం చేసి కొన్ని కోట్ల రూపాయలు వసూలు చేసిన ప్రధాన నిందితుడు రామవత్ బాలాజీ నాయక్ యొక్క నలుగురు ఏజెంట్లను పోలీసులు అరెస్ట్ చేశారు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక పర్యవేక్షణలో జరిగిన ఈ అరెస్ట్‌లో నిందితుల నుండి మొత్తం రూ. 6 కోట్ల 77 లక్షల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. గుడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ మోసం కేసు వివరాలను ఏఎస్పీ మౌనిక శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరెస్ట్ అయిన నిందితులు రామావత్ చిరంజీవి, రామావత్ రమేష్ నాయక్, రామవత్ సురేష్, రామావత్ వినోద్ లు పీఏపల్లి మండలం, వద్దిపట్ల




పరిధిలోని పలుగుతండ వాసులుగా గుర్తించారు.

## ఎల్‌వోసీ అందజేసిన మునుగోడు ఎమ్మెల్యే రాజన్న



**మునుగోడు, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** మునుగోడు మండల పరిధి పులిపలుపుల గ్రామానికి చెందిన దోటి రమేష్ కుటుంబ సభ్యులకు మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఐదు లక్షల ఎల్ఓసిని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు గొప్ప వరమనీ అన్నారు.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్



**హాలియా, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ఈనెల 18న (శనివారం)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నాగార్జునసాగర్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సాగర్ లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ కళాశాల ఆవరణలో హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అంతేకాకుండా బోటింగ్, నందికొండ మ్యూజియం తదితర ప్రాంతాలను గవర్నర్ సందర్శించనుండగా లాంచ్ స్టేషన్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రోటోకాల్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని పరిస్థితులను సమీక్షించాలన్నారు. గవర్నర్ పర్యటన ను పురస్కరించుకొని పట్టణాల్లో భారీ బందో బస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆయన అమిత్ అదనపు ఎస్పీ రమేష్ పర్యాటక, రెవిన్యూ, పోలీస్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్, బోగారం, ఇంద్రపాలనగరం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరు అధైర్య పడవద్దని తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఇంకా వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం గిట్టుబాటు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాలలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బీమా నాయక్, వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, తహసిల్దార్ లాల్ బహుదూర్ శాస్త్రి, ఏపీవో జానీమియా, కాంగ్రెస్ జిల్లా నాయకులు జినుకుల ప్రభాకర్, బత్తుల కృష్ణ గౌడ్. గుత్త నర్సిరెడ్డి, పున్న రమేష్, వనం చంద్రశేఖర్, రామిని రమేష్, కూనూరు సాయికుమార్ గౌడ్, గోగు సత్తయ్య, కోట సుధాకర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జరుగుతున్న సంఘటనలను ధైర్యంగా ఎదుర్కోవాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** ఆకాశమే హద్దుగా కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని చెప్పిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని ఆచరణలోకి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా,శిశు,వికలాంగులు, వయోవృద్దుల శాఖలోని మహిళా సాధికారత ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలిక దినోత్సవం-2025 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.జిల్లా కలెక్టర్‌గా తాను సూర్యాపేటకు కొత్తగా వచ్చినప్పుడు అబార్షన్ చేయడం ద్వారా ఒక మహిళ మృతి చెందడం తెలిసి బాధ కలిగిందని తెలిపారు.చైతన్యవంతమైన సూర్యాపేట జిల్లాలో కూడా ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని,ఆ రోజే సమాజంలో ఉన్న మహిళా సమస్యలను పరిష్కరించుటకు ఒక వ్యవస్థ రూపంలో దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.బాలిక చైతన్యం పేరిట ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పోలీస్,వైద్య ఆరోగ్యశాఖ,మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ ద్వారా నెలలో ఏదో ఒక రోజు విద్యార్థులకు సమాజంలో ఉన్న సమస్యలపై,పోషణ,భద్రత, సైబర్ నేరాలు, మహిళా సాధికారత, కెరియర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.మహిళలు, బాలికలు ధైర్యంగా ఉండాలని అన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలు ఎదుర్కోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరో తెలియని ఆకతాయిల మాయ మాటలకు, ప్రలోభాలకు గురి చేసి ఫోటోలు తెప్పించుకొని వాటి మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తూ మోసం చేస్తూ భయపెడుతున్నారని అన్నారు.అలాంటి సమయంలో మహిళలు భయపడకుండా ధైర్యంగా షీ టీమ్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే మీ పేర్లు బయటికి రాకుండా గోప్యంగా ఉంచి అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.విద్య ద్వారానే ఏది తప్పు, ఏది ఒప్పు అని తెలుసుకోవచ్చుని, విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు పొందవచ్చు అని అన్నారు. విద్యతో జీవితంలో సామాజికంగా, ఆర్థికంగా స్థిరపడవచ్చని అన్నారు జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరూ బాలికలు, మహిళలు రక్షణ కొరకు కృషి చేయాలని వారి సామర్థ్యాలు పెంచేందుకు సహకరించాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామరావు, డిడబ్ల్యుఓ నరసింహారావు,సిడబ్ల్యుసి చైర్మన్ రమణ రావు, డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, షి టీమ్స్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ నీలిమ, జీసిడిఓ పూలన్, మహిళా సాధికారత కో ఆర్డినేటర్ చైతన్య,మహిళా సాధికారత సిబ్బంది, ఐసిపిఎస్, సఖి, భరోసా, షి టీమ్ సిబ్బంది, బాల సదన్, బాల భవన్, అన్ని రెసిడెన్సీయల్, కేజీబివి,మోడల్ స్కూల్ విద్యార్థినీలు, టీచర్లు,రిసోర్స్ పర్సన్స్,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ధన త్రయోదశి రోజున బంగారంపై పెట్టుబడా?



**న్యూఢిల్లీ:**ప్రతి సంవత్సరం దీపావళి పండుగ సందర్భంగా వచ్చే ధన త్రయోదశి (ధన్‌తేరాస్) రోజున బంగారం కొనడం భారతదేశంలో ఒక శుభప్రదమైన సంప్రదాయం. ఈ రోజున పసిడిని కొనుగోలు చేయడం ద్వారా సంవత్సరం పొడవునా సంపద సమకూరుతుందని ప్రజలు బలంగా నమ్ముతారు.అయితే ఈ ఏడాది కాలంలో బంగారం, వెండి ధరలు సామాన్యులు కొనలేనంత భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి, రూపాయి విలువ పతనం, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేరుగా బంగారు ఆభరణాలు కొనడం కంటే మెరుగైన, ఆర్థిక పరంగా లాభదాయకమైన పెట్టుబడి మార్గాలను ఎంచుకోవడం ఉత్తమం.

**నేరుగా ఆభరణాలు కొంటే..**

ధరలు భారీగా పెరగడంతో ఆభరణాల రూపంలో బంగారం కొనుగోలు చేయాలనుకోవడం చాలా మందికి ఆర్థిక భారంగా ఉంటుంది. రికార్డు స్థాయిలో ఉన్న ధరల కారణంగా చిన్న వస్తువు కొనుగోలుకు కూడా ఎక్కువ మొత్తంలో చెల్లించాలి. బంగారు ఆభరణాల తయారీలో తరుగు రూపంలో కొంత మొత్తాన్ని అదనంగా చెల్లించాలి. వీటికి తయారీ ఛార్జీలు అదనం. బంగారం ధర, తయారీ ఛార్జీలపై జీఎస్టీ వర్తిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆభరణాలు అమ్మినప్పుడు తయారీ ఛార్జీలు, తరుగు కారణంగా కొనుగోలు ధర కంటే తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తుంది.ఈ ఛార్జీలు, నష్టాల నేపథ్యంలో బంగారంలో పెట్టుబడి పెట్టడానికి నిపుణులు మెరుగైన ప్రత్యామ్నాయ మార్గాలు సూచిస్తున్నారు. బంగారంపై ఇన్వెస్ట్ చేయడానికి భౌతిక బంగారాన్ని నిల్వ చేయాల్సిన అవసరం లేకుండా సురక్షితమైన, పారదర్శకమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న కొన్ని మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

**గోల్డ్ ఈటీఎఫ్‌లు:** గోల్డ్ ఈటీఎఫ్‌లు అనేవి స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో షేర్ల మాదిరిగా ట్రేడ్ చేయబడే ఫండ్‌లు. ఇవి దేశీయ భౌతిక బంగారం ధరను ట్రాక్ చేస్తాయి. వీటిని లైవ్ మార్కెట్ నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చు. దీనివల్ల తయారీ ఛార్జీలు, జీఎస్టీ వంటి అదనపు ఛార్జీలు ఉండవు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ వేళల్లో ఎప్పుడైనా సులభంగా కొనుగోలు చేయవచ్చు, అమ్మవచ్చు. భౌతిక బంగారంలాగా దొంగిలించబడుతుందనే భయం ఉండదు. రియల్ టైమ్ మార్కెట్ ధరలకు అనుగుణంగా వీటి ధరలు ఉంటాయి. వీటిని కొనుగోలు చేయడానికి డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతా అవసరం.

**డిజిటల్ గోల్డ్:**వంటి యాప్‌ల ద్వారా 99.9% స్వచ్ఛమైన బంగారాన్ని కొద్ది మొత్తంలో డిజిటల్ రూపంలో కొనుగోలు చేయవచ్చు. ఈ బంగారం మీ తరపున భౌతిక రూపంలో లాకర్‌లో నిల్వ చేస్తారు. అయితే అమ్మాలనుకుంటే మాత్రం జీఎస్టీ వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. ఈ విధానంలో చాలా తక్కువ డబ్బుతో కూడా కొంత మొత్తంలో కొనుగోలు చేయవచ్చు. భౌతికంగా నిల్వ చేయాలనే ఆందోళన అవసరం లేదు.

# హ్యాట్రిక్ లాభాల్లో సెన్సెక్స్

## నిఫ్టీ కూడా అంతేస్థాయిలో..



**న్యూఢిల్లీ:**భారత ఈక్విటీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. ఈ సెషన్ లో 52 వారాల గరిష్టాన్ని తాకాయి. దీపావళికి ముందు సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడు రోజులు లాభాలను అందుకున్నాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 484.53 పాయింట్లు లేదా 0.58 శాతం పెరిగి 83,952.19 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 124.55 పాయింట్లు లేదా 0.49 శాతం పెరిగి 25,709.85 వద్ద స్థిరపడ్డాయి.బీఎస్ఈలో ఏషియన్ పెయింట్స్, ఎం అండ్ ఎం, భారతి ఎయిర్టెల్, హెచ్‌యూఎల్ టాప్ గెయినర్లలో ఉండగా, ఇన్ఫోసిస్, హెచ్‌ఎల్‌టెక్, ఎటర్నల్, టాటా స్టీల్ టాప్ లూజర్లలో ఉన్నాయి. రంగాలవారీగా నిఫ్టీ ఎఫ్ఎంసిజి 1.37 శాతం లాభపడింది. నిఫ్టీ ఐటీ 1.63 శాతం, మీడియా 1.56 శాతం నష్టపోయాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 వరుసగా 0.57 శాతం, 0.05 శాతం నష్టపోయాయి.

# గ్లోబల్ గ్రోత్ కోసం కొత్త అవకాశాలు

## మాస్కోలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్లో డిసెంబర్ 17, 18న గ్లోబల్ కాంగ్రెస్



**హైదరాబాద్(జనంసాక్షి):**మాస్కోలో ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్ లో డిసెంబర్ 17, 18వ తేదీలలో మీట్ గ్లోబల్ ఎంఐసీఈ కాంగ్రెస్ 2025 జరగనుంది. వరసగా మూడోసారి జరుగుతున్న ఈ ఈవెంట్‌కు రష్యా, బ్రిక్స్, గ్లోబల్ సౌత్ దేశాల నుంచి నిపుణులు, స్పీకర్స్ హాజరవుతున్నారు. ఈ కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం నెట్‌వర్క్, సహకారం పెంచుకోవడం, కొత్త ఆలోచనలు పంచుకోవడం, తాజా ట్రెండ్స్‌పై చర్చించడం. ఈ ఈవెంట్‌లో 15 పైగా ప్రత్యేక వ్యాపార సెషన్లు ఉంటాయి. 'ఓపెన్ డైవర్సిటీ ద్వారా ఐక్యత : గ్లోబల్ గ్రోత్ కోసం కొత్త అవకాశాలు' ఈ కాంగ్రెస్ ప్రధాన అంశం. ఈ ఈవెంట్‌లో మొదటి రోజు వ్యాపార సహకారాన్ని పెంపొందించడం, ఎంఐసీఈ ఇండస్ట్రీని ముందుకు తీసుకువెళ్ళే ఇంటర్ గవర్నమెంటల్ ప్రాజెక్టులపై దృష్టి, రెండో రోజు గ్లోబల్ ట్రెండ్స్, విశ్లేషణలు, డెస్టినేషన్ మార్కెటింగ్, ఇన్సెంటివ్ ట్రావెల్, వ్యాపార వ్యూహాలు, ఆధునిక సాంకేతికతలపై విస్తృత సెషన్లు కలవు. ఇండస్ట్రీ ట్రెండ్స్‌ను తెలుసుకోవాలనుకునే వారికి, ప్రొఫెషనల్ పరిధిని విస్తరించుకోవాలనుకునే వారికి ఈ కాంగ్రెస్ ఉపయోగకరంగా ఉంటుంది. భారతదేశం, చైనా, ఆగ్నేయాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, సీఐఎస్, రష్యాతో సహా విభిన్న ప్రాంతాల ప్రొఫెషనల్ ప్రేక్షకులతో నిమగ్నమవ్వడానికి ఒక వేదికగా ఇది పని చేస్తుంది. ఎక్స్‌పో జోన్‌లో 3200 పైగా ప్రీ-షెడ్యూల్డ్ అపాయింట్‌మెంట్‌లు జరుగుతుండటంతో హాజరైనవారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ ఎంఐసీఈ గమ్యస్థానాలకు ప్రాతినిధ్యం వహించే ఎగ్జిబిటర్లను కలిసే అవకాశం ఉంటుంది.

# ఎల్ఐసీ నుంచి రెండు కొత్త పాలసీలు

- జీఎస్టీ తగ్గింపు తర్వాత ప్రకటన



**న్యూఢిల్లీ:**దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రెండు కొత్త బీమా ఉత్పత్తులను ప్రవేశపెట్టింది.విభిన్న వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి, ఆర్థిక రక్షణ , పొదుపు ప్రయోజనాలను అందించడానికి ' ఎల్ఐసీ జన్ సురక్ష ', ' ఎల్ఐసీ బీమా లక్ష్మి ' అనే పేర్లతో వీటిని రూపొందించింది ఎల్ఐసీ జన్ సురక్ష ఎల్ఐసీ బీమా లక్ష్మి అక్టోబర్ 15 నుంచి ఈరెండుకొత్తపాలసీలు అందుబాటులో ఉంటాయని, కొత్త నెక్స్ట్ జెన్ జీఎస్టీ విధానంలో ఎల్ఐసీ విడుదల చేసిన మొదటి ఉత్పత్తులు ఇవేనని బీమా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.ఎల్ఐసీ జన్ సురక్ష ప్లాన్ ముఖ్యంగా తక్కువఆదాయ వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకోసంరూపొంది ంచినతక్కువ ఖర్చుతో కూడిన బీమా పథకం. ఇది నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్, అంటే ఇది మార్కెట్ లేదా బోనస్‌లతో లింక్ చేయబడదు.

**ముఖ్య లక్షణాలు:**

రకం: నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్ మైక్రో ఇన్సూరెన్స్ ప్లాన్

ప్రత్యేకత: తక్కువ ఆదాయ వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి అనుకూలం

బీమా మొత్తం: కనీసంరూ.1,00,000, గరిష్టంగారూ.2,00,000

పాలసీ కాలం: 12 నుంచి 20 సంవత్సరాలు

ప్రీమియం చెల్లింపు కాలం: మొత్తంపాలసీ కాలంలో5 సంవత్సరాలుతీసివేయగావచ్చేకాలం

**అర్హత:**వయస్సు: 18 నుండి 55 ఏళ్లు

ఆరోగ్యం: పాలసీదారుకుమంచి ఆరోగ్యస్థితి ఉండాలి. వైద్య చికిత్సలుతీసుకుంటూఉండరాదు.

అదనపు ప్రయోజనాలు:

3 సంవత్సరాల ప్రీమియం చెల్లింపుల తర్వాత ఆటో కవర్: 1 సంవత్సరం తర్వాత పాలసీ రుణం

గ్యారెంటీడ్ ఎడిషన్లు

ఎల్ఐసీ బీమా లక్ష్మి:ఎల్ఐసీ బీమా లక్ష్మి అనేది మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన జీవిత బీమా, పొదుపు పథకం. ఇది నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్ స్కీం, ఇది జీవిత బీమా, కాలానుగుణ మనీబ్యాక్ ఎంపికలు రెండింటినీ అందిస్తుంది.

ముఖ్య లక్షణాలు

రకం: నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్ మనీబ్యాక్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్

ప్రత్యేకత: మహిళల కోసం ప్రత్యేకం

బీమా మొత్తం: కనీసం రూ. 2,00,000, గరిష్ట పరిమితి లేదు (అండర్‌రైటింగ్ ఆధారంగా)

పాలసీ కాలం: 25 సంవత్సరాలు

ప్రీమియం చెల్లింపు కాలం: 7 నుంచి 15 సంవత్సరాల మధ్య ఉంటుంది.

అర్హత:వయస్సు: 18-50 సంవత్సరాల మధ్య

అదనపు ప్రయోజనాలు

గ్యారెంటీడ్ వార్షిక జోడింపులు

సర్వైవల్బెనిఫిట్లు నచ్చినట్లు ఎంచుకునేఅవకాశం

సర్వైవల్ బెనిఫిట్లు కావాల్సినప్పుడుతీసుకోవచ్చు.

మెచ్యూరిటీ / డెత్ బెనిఫిట్ వాయిదాలలో తీసుకునే అవకాశం


ఆటో కవర్ సౌలభ్యం (3 సంవత్సరాల తర్వాత)

అధిక బీమా మొత్తానికి ప్రోత్సాహకాలు

# టీవీఎస్ కొత్త అడ్వెంచర్ బైక్


**న్యూఢిల్లీ:**టీవీఎస్ మోటార్ ఇండియన్ మార్కెట్లో.. 'అపాచీ ఆర్‌టీఎక్స్ 300' పేరుతో సరికొత్త అడ్వెంచర్ బైక్ లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ. 1.99 లక్షలుఇప్పుడున్న టీవీఎస్ బైకుల కంటే ఇది కొంత భిన్నంగా ఉండటం గమనించవచ్చు. అపాచీ ఆర్‌టీఎక్స్ 300.. స్టీల్ ట్రేల్లిస్ ఫ్రేమ్ అల్యూమినియం డైకాస్ట్ స్వింగార్మ్ పొందుతుంది. ఇందులో ఎల్‌ఈడీ, ఎల్‌ఈడీ టర్న్ ఇండికేటర్స్, పెద్ద ఫ్యూయెల్ ట్యాంక్, స్ప్లిట్ రియర్ సీటు, అదనపు లగేజ్ కోసం లగేజ్ ర్యాక్ వంటివి ఉన్నాయి. ఈ బైక్ వైపర్ గ్రీన్, టార్న్ బ్రాంజ్, మెటాలిక్ బ్లూ, లైట్నింగ్ బ్లాక్, పెర్ల్ వైట్ అనే రంగులలో అందుబాటులో ఉంది. ఆర్‌టీఎక్స్ 300 బైక్.. టీఎఫ్టీ డిస్ప్లే పొందుతుంది. ఇది బైక్ గురించి రైడర్లకు కావలసిన సమాచారం అందిస్తుంది. అంతే కాకుండా ఇందులో టూర్, ర్యాలీ, అర్బన్, రెయిన్ అనే నాలుగు రైడింగ్ మోడ్స్ ఉన్నాయి. ట్రాక్షన్ కంట్రోల్, క్రూయిజ్ కంట్రోల్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టం ఉన్నాయి.






# పాక్‌ను వణికిస్తున్న నూర్..

## దాయాదికి కొరకరాని కొయ్యగా మారిన నూర్ వాలి మోహ్సూద్



**న్యూఢిల్లీ:**అది కాబూల్‌లోని ఓ మారుమూల కొండ ప్రాంతం. ఓ టయోటా ల్యాండ్ క్రూజర్ వాహనం నిదానంగా వెళ్తోంది. ఓ క్షిపణి రయ్‌మంటూ దూసుకొచ్చి ఆ వాహనాన్ని ఢీ కొట్టింది.'హమ్మయ్యా..' అంటూ పాక్ సైన్యం సంబురాలు చేసుకుంది. కట్ చేస్తే.. ఆ మరుసటిరోజే 'నేను అమరుడ్ని..' అనే రేంజ్‌లో ఓ వ్యక్తి వాయిస్‌తో ఆడియో క్లిప్ బయటకు వచ్చింది. అంతే పాక్ సైనికాధికారుల ముఖంలో సంతోషం పోయి.. మళ్లీ తలపట్టుకున్నారు.పాకిస్తాన్-అఫ్గనిస్తాన్ మధ్య గత 10 రోజులుగా పరస్పర దాడులతో యుద్ధ పరిస్థితులు నెలకొన్నది చూస్తున్నదే!. ఈ దరిమిలా 48 గంటల కాల్పుల విరమణతో పరిస్థితి కాస్త చల్లారినట్లే కనిపిస్తోంది. అయితే.. ఒకప్పుడు జగ్రి దోస్తులుగా ఉన్న ఈ రెండు దేశాలు దుష్మన్‌లుగా మారడానికి కారణం.. ఒకే ఒక్కడు. వాడి పేరు నూర్ వాలి మోహ్సూద్ పాక్‌కు కొరకరాని కొయ్యగా(వ్యక్తిగా) మారిన ఇతని గురించి ఇంటర్నెట్‌లో ఇప్పుడు తెగ వెతికేస్తున్నారు. నూర్ వాలి మెహ్సూద్(47).. ఒకప్పుడు తాలిబాన్ ఉద్యమంలో భాగమైన వ్యక్తి. అయితే ఆ తర్వాతి కాలంలో తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ (%టీటీపీ%) అనే ఉగ్రవాద సంస్థకు నాయకత్వం వహిస్తూ.. పాక్‌ను వణికిస్తున్నాడు. ఇతని నేతృత్వంలో టీటీపీ సంస్థ పాక్ గడ్డపై పలు దాడులు జరిపింది. మరీ ముఖ్యంగా సైనిక స్థావరాలు, పోలీసు ఔట్‌పోస్టులను లెక్కలేనన్నంటిని నాశనం చేసింది. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతంలో ఇతని నేతృత్వంలో జరిగిన దాడులతో పాక్‌కు తీరని నష్టమే వాటిల్లింది. అలా..తమ దేశ భద్రతా వ్యవస్థకు నూర్ వాలి మెహ్సూద్ పెనుముప్పుగా మారడంతో పాక్ ప్రభుత్వం శాంతి చర్చలకు ఆహ్వానించింది. అయితే.. నూర్ మొండి పట్టు వల్లే ఆ చర్చలు విఫలం కావడం గమనార్హం. తాజాగా ఇతగాడి చర్యల వల్ల పాకిస్తాన్-ఆఫ్ఘనిస్థాన్ సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారాయి.ఈ క్రమంలో పక్కా సమాచారం అందుకున్న పాక్ సైన్యం.. అతను ప్రయాణిస్తు?న్న కాన్వాయ్‌పై క్షిపణి దాడులు చేసింది. అయితే అనూహ్యంగా నూర్ వాలి దాడి నుంచి తప్పించుకున్నాడు. అతని అనుచరులు గాయాలతోనే బయటపడినట్లు తెలుస్తోంది. తన క్షేమసమాచారాన్ని తెలియజేస్తూ ఆ మరుసటిరోజే ఆడియో క్లిప్ ఒకటి నూర్ బయటకు వదిలాడు.

ఈ టీటీపీ ఏంటసలు..: తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ పలు నిషేధిత సంస్థలు కలిసి ఏర్పాటు చేసిన గ్రూప్. అయితే.. ఇది ఏర్పడడానికి ఒక బలమైన కారణం ఉంది. లాల్ మసీదు ఏరియా.. ఇస్లామాబాద్‌లో ఒకప్పుడు మతపరమైన కేంద్రంగా విరజిల్లేది. మౌలానాలు అబ్దుల్ అజీజ్, అబ్దుల్ రషీద్ ఘాజీ సారథ్యంలో షరియా చట్టం అమలు కోసం ఉద్యమించారు. అయితే.. ఉద్యమం మాటున ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అప్పటి సైనికాధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ ప్రభుత్వం ఆపరేషన్ సైలెన్స్ పేరిట చర్యకు ఉపక్రమించింది.జులై 3-11 తేదీ మధ్య ఈ దాడిలో 100 మంది మరణించగా.. 11 మంది సైనికులు, 200 మంది పౌరులు గాయపడ్డారు.మరణించిన వాళ్లంతా మిలిటెంట్లేనని ముషారఫ్ నాడు ప్రకటించారు. లాల్ మసీద్ ఘటన భావోద్వేగంగా, మతపరంగా ప్రజలను ప్రభావితం చేసింది. అయితే.. ఈ ఘటనను ఇస్లాం మీద దాడిగా భావించిన పలు గ్రూపులు.. పాకిస్తాన్ ప్రభుత్వానికి ప్రతీకారంగా కలసి %టీటీపీ%ను డిసెంబర్ 2007లో ప్రకటించాయి. దీని లక్ష్యం.. అప్పటి ముషారఫ్ ప్రభుత్వాన్ని కూల్చేయడం, పాకిస్తాన్‌లో షరియా చట్టం అమలయ్యేలా చూడడం. కాలక్రమంలో.. ఇది పాక్ సరిహద్దు ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేసుకుని పాక్ భూభాగంపై తరచూ దాడులు చేస్తూ వస్తోంది.

నూర్ సారథ్యం.. మరో మలుపు!

2018లో అఫ్గన్ సరిహద్దులో అమెరికా జరిపిన డ్రోన్ దాడుల్లో టీటీపీ కీలక నేతలు ముగ్గురూ మరణించారు. దీంతో నూర్ వాలి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. నూర్ వాలి మెహ్సూద్ సారథ్యంలో తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ (%టీటీపీ%) కొత్త పంథా ఎంచుకుంది. టీటీపీ అంటే అప్పటిదాకా పాక్ అమాయక పౌరులను బలిగొన్న కరుడుగట్టిన ఉగ్రసంస్థగా ముద్రపడిపోయింది. 2014లో ఓ పాఠశాలలో జరిపిన దాడిలో 130 మంది చిన్నారులు మరణించడం.. ఇందుకు ఓ ఉదాహరణ కూడా.అయితే మత పండితుడైన నూర్.. తన సారథ్యంలో అలాంటివి జరగకూడదని బలంగా తీర్మానించాడు. పాక్ సైన్యం అనేది ఇస్లాంకు వ్యతిరేకంగా.. 78 ఏళ్లుగా పాక్ ప్రజలను బందీఖానాలో ఉంచిందని, రాజకీయ జోక్యంతో భ్రష్టు పట్టిపోయిందని ఘాటు విమర్శలు చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో పౌరుల జోలికి పోకూడదని.. కేవలం పాక్ ఆర్మీ, అవసరమైతేనే పోలీసులను లక్ష్యంగా చేసుకోవాలని టీటీపీ కేడర్‌కు సూచించాడు. అలా టీటీపీపై పడ్డ మచ్చను చెరిపేసే ప్రయత్నం చేశాడు నూర్.2021లో అఫ్గానిస్థాన్‌లో తాలిబాన్ అధికారంలోకి రావడంతో.. ఆఫ్ఘన్ సరిహద్దుల్లో స్వేచ్ఛగా సంచరించే అవకాశం కలిగింది. ప్రత్యేకించి.. పాక్ ఉత్తర పశ్చిమ సరిహద్దు ప్రాంతాల్లో దాడులు పెరిగాయి. పాక్ చేసే ప్రధాన ఆరోపణ ఏంటంటే.. నూర్ వాలి ఆఫ్ఘనిస్తాన్‌లో ఆశ్రయం పొందుతున్నాడని, తాలిబాన్ తాత్కాలిక ప్రభుత్వ సహకారంతోనే మరింత రెచ్చిపోతున్నాడని.

అంతేకాదు..తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ ఇస్లాం మతాన్ని వక్రీకరిస్తోందని, అలాంటి సంస్థకు భారతదేశమూ మద్దతు ఇస్తోందని ఆరోపిస్తూ వచ్చింది. అయితే, ఈ ఆరోపణలను న్యూఢిల్లీ ఖండించింది, తాము ఎలాంటి మద్దతు ఇవ్వలేదని స్పష్టం చేసింది.

## ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో అవార్డుల్లో

# తెలంగాణ ఉత్తమ ప్రతిభ

### రాష్ట్రపతి ముర్మునుంచి అవార్డు అందుకున్న సెక్రటరీ గౌరవ్ ఉప్పల్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరపున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు – ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు.

# ఇంజనీరింగ్ కాలేజీ ఘటనలో విస్తుపోయే విషయాలు


**న్యూఢిల్లీ:**ఆ ఇద్దరూ క్లాస్‌మేట్స్. అయితే బ్యాక్‌లాగ్స్‌తో అతగాడు ఆమెకు ఓ సెమిస్టర్ జూనియర్ అయిపోయాడు. అయినా వాళ్ల మధ్య స్నేహం కొనసాగింది. ఇదే అదనుగా..అదీ కాలేజీ క్యాంపస్‌లో.. అందులోనూ మెన్స్ టాయ్‌లెట్‌లో ఆమెపై ఆ యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ షాకింగ్ ఘటన వివరాల్లోకి వెళ్తే..సౌత్ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అత్యాచార ఘటనలో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. నిందితుడిని జీవన్ గౌడ(21)గా నిర్ధారించిన పోలీసులు.. అతన్ని అరెస్ట్ చేశారు. గురువారం అతనితో క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసి కీలక విషయాలు వెల్లడించారు. బాధితురాలు(20), జీవన్ ఒకేసారి కాలేజీలో చేరారు. ఈ క్రమంలో జీవన్ ఓ సెమిస్టర్ తప్పడంతో వెనకబడిపోయాడు. అక్టోబర్ 10వ తేదీ ఉదయం కాలేజీకి బాధితురాలికి ఓ పార్సిల్ వచ్చింది. దానిని జీవన్ రిసీవ్ చేసుకుని ఆ వంకతో యువతిని కలిసి అందిం చాడు. దానిని అందుకుని ఆమె అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోయింది. అయితే..మధ్యాహ్నం లంచ్ సమయంలో ఆమెకు పదే పదే ఫోన్ చేసి మాట్లాడాలంటూ ఏడో ఫ్లోర్‌లో ఉన్న ఆర్కిటెక్ట్ బ్లాక్ దగ్గరకు రావాలంటూ పిలిచాడు. అక్కడికి వెళ్లిన ఆమెకు ఎవరూ లేనిది చూసి బలవంతంగా ముద్దు పెట్టాడు. ఈ పరిణామంతో భయానికి గురైన యువతి అక్కడి నుంచి ఏడ్చుకుంటూ పరిగెత్తింది. అయితే..లిఫ్ట్‌లో ఆమెతో పాటే కిందకు వెళ్లి.. ఆమె నోరు మూసేసి ఆరో ఫ్లోర్‌లో ఉన్న మెన్స్ టాయ్‌లెట్‌లోకి లాక్కెళ్లాడు. అక్కడ వాష్‌రూంలో తలుపు బిగించి 20 నిమిషాలపాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటన తరవాత ఆమె హాస్టల్‌కు పరిగెత్తుకుంటూ వెళ్లి స్నేహితులకు విషయం చెప్పింది. ఆ సమయంలో మరోసారి కాల్ చేసిన నిందితుడు పిల్ కావాలా సీనియర్ అంటూ వెటకారంగా నవ్వుతూ ఫోన్ పెట్టేశాడు. అయితే.. ఇదంతా మాములు విషయమని, పెద్దది చేయొద్దంటూ తోటి రూమ్స్‌మేట్స్‌కు ఆమెకు సలహా పడేశారు.అయితే.. జరిగిన విషయాన్ని రెండు రోజుల తర్వాత పేరెంట్స్ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో వాళలు బెంగళూరు వచ్చి.. అక్టోబర్ 15వ తేదీన హనుమంత నగర పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

# బీహార్ మహాఘట్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్

మాట్లాడుతూ, సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, బీజేపీ-జేడీయూ కూటమికి వ్యతిరేకంగా విపక్ష ఐక్య కూటమి పోటీకి కట్టుబడి ఉందని చెప్పారు. 'తేజస్వి యాదవ్ మహాఘట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి. సీట్ల షేరింగ్ పక్రియ త్వరలోనే ఖరారవుతుంది' అని సింగ్ తెలిపారు. సింగ్‌తోపాటు ఇంతకుముందు కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ సైతం సీఎం అభ్యర్థిత్వంపై తేజస్వి యాదవ్‌కు మద్దతుగా మాట్లాడారు. తేజస్విని సీఎం అభ్యర్థిగా ప్రకటించడంలో తప్పేమిలేదన్నారు. ఎన్డీయే కూడా తమ ముఖ్యమంత్రి అభ్యర్థిపై స్పష్టత ఇవ్వాలన్నారు. తేజస్వి సీఎం అభ్యర్థిత్వంపై మహాకూటమిలో ఎలాంటి ఇబ్బందులు కనిపించనప్పటికీ సీట్ల పంకాల విషయంలో టెన్షన్ కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ 48 మంది అభ్యర్థుల జాబితాను గురువారం నాడు ప్రకటించింది. అయితే భాగస్వామ్య పక్షాలతో విభేదాలు ఇంకా సమసిపోలేదు.

## శబరిమల బంగారం కేసు..

# ప్రధాన నిందితుడు అరెస్ట్



తిరువనంతపురం: శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారం తాపడం విషయంలో ఇప్పటికే పలు ట్విస్టులు చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో తాజాగా ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు.ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం కోర్టు ముందు ఉన్నికృష్ణన్‌ను హాజరుపరచనున్నారు.కాగా, బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త ఉన్నికృష్ణం పొట్టిని ఆయన ఇంట్లో (పులిమత్‌లో) అదుపులోకి తీసుకున్నట్లు (సిట్) అధికారులు తెలిపారు. అనంతరం, తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్? కార్యాలయంలో విచారించారని సిట్? వర్గాలు తెలిపాయి. శుక్రవారం మధ్యాహ్నం కోర్టు ముందు ఆయన్ను హాజరుపరచనున్నారు. తదుపరి విచారణ కోసం సిట్ ఆయన్ను కస్టడీకి కోరే అవకాశం ఉంది. మరోవైపు.. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్? ఇంజనీర్? కె.సునీల్? కుమార్‌ను ట్రావెన్‌కోర్? దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ గతంలో సస్పెండ్ చేశారు. కాగా, ఈ వివాదంలో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న రిటైర్డ్? అధికారులకు షోకాజ్? నోటీసులు పంపనున్నట్లు తెలిపారు. పది రోజుల్లోగా నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

**జరిగింది ఇదీ..:**శబరిమలలో గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించడం జరిగింది. వాటిని సరిచేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ పేర్కొంది. అంతేగాక, ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు సమాచారం. ఈ పరిణామాలపై ఇప్పటికే హైకోర్టు పలు అనుమానాలు వ్యక్తంచేసింది. ఉన్నట్లుండి తాపడాల బరువు 4.524 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. అలాగే ముందుస్తు అనుమతి తీసుకోకుండా ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించడం పైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై క్రిమినల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. అలాగే ఈ వివాదంపై ఇప్పటికే న్యాయస్థానం సిట్? ఏర్పాటు చేసి, నెలలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.



"అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో క్రియేటివ్ గెలాక్సీని"

## ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి సృజనాత్మకంగా పోటీ తత్వాన్నిపెంపొందించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి తో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో నర్సరీ నుండి రెండో తరగతి విద్యార్థులచే అద్భుతంగా ఏర్పాటు చేసినటువంటి "క్రియేటివ్ గెలాక్సీ" పేరుతో ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను చాలా విశ్లేషణాత్మకంగా, సమగ్రంగా తెలిపినట్లైతే వారిలో సృజనాత్మకత పెరుగుతుందని గుర్తు చేశారు. తల్లిదండ్రులు సైతం ప్రాథమిక దశ నుండే విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడం ద్వారా చదువు పట్ల ఆసక్తితో పాటు విషయాలు నేర్చుకోవడానికి ఉత్సాహాన్ని చూపుతారన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నరేందర్ రెడ్డి సారధ్యంలో విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించడం కరీంనగర్ జిల్లాకే గర్వకారణమని వారిని కొనియాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే అన్ని విషయాలను పట్ల ప్రత్యక్ష, పరోక్ష విధానాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రదర్శనలో భాగంగా వివిధ తరగతి గదులను వివిధ రకాల వస్తువులతో చాలా చక్కగా అలంకరించారు. విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు విషయాలు ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన బోధన్ సబ్ కలెక్టర్



**బోధన్, అక్టోబర్ 17 ( జనంసాక్షి ) :** బోధన్ మండలం సంగం, భవానీ పేట్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తనిఖీ చేశారు. ఈ ంగా బోధన్ సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటితో పాటు గన్ని బ్యాగులు, లారీలు, తేమశాతం సూచించే మీటర్లు, వేయింగ్ మిషన్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ రైతు సీరియల్ నంబర్‌ను రిజిస్టర్‌లో సరిగ్గా నమోదు చేయాలని, మాయిశ్చర్ కంటెంట్‌ను తనిఖీ చేసి వెంటనే లారీలలో లోడ్ చేయాలని, కొనుగోలు కేంద్రాలలో తగినంత హమాలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి లారీ పంపినప్పుడు ట్రక్ షీట్‌ను తయారు చేయాలని, పంపిన వరికి సంబంధించిన అభ్యర్థనలను పొందడానికి రైస్ మిల్లులతో క్రమం తప్పకుండా ఫాలో-అప్ చేయాలని, రసీదులు అందిన వెంటనే ఓపిఎమ్మెస్ యాప్‌లో బిల్లులను వెంటనే తయారు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సహకార సంగం సహకార సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్ వ్యతిరేకి బీజేపీని గద్దె దింపాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (జనం సాక్షి) :**
ఈరోజు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యాచరణ కమిటీ'బిసి జెఎసి బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్ కు భారత రాష్ట్ర సమితి మరియు కామారెడ్డి మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుంనామాని, బంద్ లో ప్రత్యక్షంగా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పాల్గొంటామని బిఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు చెలిమెల భాను ప్రసాద్ తెలిపారు.



ఈ సందర్భంగా బిఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు చెలిమెల భాను ప్రసాద్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను మరియు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. బీజేపీ కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. బీసీల పట్ల బీజేపీ కి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదివ షెడ్యూలులో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి, ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ళ తరబడి బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏ మాత్రం తగదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికే దాటి పోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితి లోగా ఆమోదం లభించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉండడం వల్లనే ఈ రోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీని భూస్థాపితం చేయాలని అన్నారు. బిసి జెఏసి బిఆర్ఎస్ తో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను మరియు సంఘాలతో పాటు బందులో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షులు గడికింది చంద్రకాంత్ యూత్ ప్రచార కార్యదర్శి తోట సంగమేశ్వర్, యూత్ కోశాధికారి నీరడీ సాయి బిఆర్ఎస్ యూత్ నాయకులు పరశురాంగౌడ్, షేక్ సమీర్, రాజకుమార్, ఆనంద్, శ్రవణ్, నిశ్వంత్, సాయి పాల్గొన్నారు.

# 40 ఎకరాల్లో ఆధునాతన గోశాల నిర్మాణం





- రాజన్న ప్రసాదంగా రైతులకు కోడెల పంపిణీ
- కోడెలను వ్యవసాయానికి ఉపయోగించి ఉపాధి పొందాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన కోడెల సంరక్షణ కోసం 40 ఎకరాల్లో అధునాతన గోశాల నిర్మాణం చేయనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో రైతులకు కోడెలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చు తండ్రి కోడె మొక్కలు చెల్లిస్తా అని భక్తులు వేడుకుంటారన్నారు. కోరికలు తీరిన భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లిస్తారని తెలిపారు. గోశాలలో పరిమితికి మించిన కోడెలను ఇతర గోశాలలకు ఇచ్చే క్రమంలో తలెత్తిన కొన్ని సమస్యలు దృష్టిలో పెట్టుకొని రైతులకు ఉచితంగా అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. కోడెలు రైతులకు వ్యవసాయానికి ఉపయోగప డటంతో పాటు రాజన్న ప్రసాదంగా అందిస్తున్నట్లు చెప్పారు. కోడెలను తీసు కెళ్లిన రైతులు వాటి పోషణ సరిగా చూసుకోవాలన్నారు. రైతుల ముసుగులో ఒకరిద్దరు కోడెలను తీసుకెళ్లి పక్కదారి పట్టించడం గుర్తించి కేసులు నమోదు చేయించినట్లు చెప్పారు. ప్రతి మూడు నెలల కోసారి రైతులకు అందించిన కోడెలను అధికారులు వెళ్లి ఆకస్మికంగా తనికి చేస్తున్నారన్నారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకైన కోడెలు ఎవరు పక్కదారి పట్టించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడె మొక్కులు చెల్లించుకునే భక్తులు పాలు మరువని, జెర్సీ, చిన్న కోడెలను తేవద్దని కోరారు. గోశాలలో ని కోడెల సంరక్షణను పశుసంవర్ధక, వ్యవసాయ ఆలయ అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తున్నారన్నారు.

**కోడెల పంపిణీని పరిశీలించిన కలెక్టర్ ఎం హరిత.**

కలెక్టర్ మాట్లాడుతూ ఆన్లైన్‌లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు మాత్రమే కోడెలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు వాటిని వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను పరిశీలించి కోడెలను పంపిణీ చేశారు. మొత్తం 75 జతల కోడెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, వ్యవసాయ శాఖ అధికారులు, గోశాల బాధ్యులు పాల్గొన్నారు.

## ధర్మ విజయ యాత్రకు ప్రజలంతా తరలిరండి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**
వేములవాడలో ఈనెల 19,20 తేదీల్లో జగద్గురు శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి ధర్మ విజయ యాత్రలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరా రు. శుక్రవారం ఆయన ఆలయ ఓపెన్ స్లాబ్ పట్టణ ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, అన్ని కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వ హించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖ ఆలయ పక్షాన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 19న సాయంత్రం విధుశేఖర భారతి మహాస్వామి వేములవాడకు చేరుకుంటారని, స్వామివారికి అపూర్వ స్వాగతం పలకాలని పట్టణ ప్రజలను పిలుపునిచ్చారు. 19న విధిశేఖర భారతీ తీర్థ స్వామి వారి స్వామి వారి ఊరేగింపు అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శించుకుంటా రని, 20న శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శించు కోని ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన అనంతరం పలు సూచనలు చేయనున్నట్లు వివరించారు. ఆలయ అభివృద్ధి కోసం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ150 కోట్లు కేటాయి ంచి, ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై స్వామివారి సలహాలు సూచనలు తీసుకుంటామనీ స్వామి వారు రాక కోసం ఎదురు చూస్తున్నట్లు ఆయన తెలిపారు.



# రైతు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (జనం సాక్షి) :**
రైతాంగ వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు వాగ్మారే సురేష్ గౌండ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ. వానాకాలం సీజన్ లో రైతులకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు పూర్తిగా వెనకబడ్డారని అన్నారు. రైతులు ప్రవేటులో అధిక వడ్డీకి అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సి వస్తుందని అన్నారు. వానాకాలం సీజన్లో బ్యాంకుల ద్వారా రూ. 54,480 కోట్ల పంట రుణాలు పంపిణీ చేస్తామని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రకటించిందని, కానీ రూ. 44,438 కోట్లు రుణాలను మాత్రమే రైతులకు అందజేశారని అన్నారు. రుణమాఫీ పథకం వర్తించని రైతులకు మాత్రమే పంట రుణాలు అందజేసి, రుణమాఫీ పొందని రైతులకు మంజూరు చేయలేదని అన్నారు. రిజర్వుబ్యాంకు ఆదేశాల ప్రకారం 18 శాతం ఇవ్వాల్సిన పంట రుణాలు 10 శాతం మాత్రమే ఇస్తున్నారు. రుణ ప్రణాళికను ప్రకటించి బ్యాంకులు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేయకపోవడం వలన రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో 2.50 లక్షల ఎకరాల్లో పంట నష్టాలను ప్రభుత్వం అంచనా వేసి పరిహారం చెల్లించకపోవడం విడ్డూరమని అన్నారు, బెల్లంపల్లి నియోజకవర్గంలోని రైతులపై ఫారెస్ట్ శాఖ దౌర్జన్యాలు ఆపాలని కోరారు. ధరణిలోని లోపాలను ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నప్పటికీ పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, కాలయాపనను నివారించి భూభారతి చట్టంలో సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం రైతాంగానికి ఉపయోగపడే విధంగా పంటల బీమా పథకాన్ని రూపొందించాలని అన్నారు. క్వింటాల్ పత్తికి రూ.475, వరికి రూ.500, కందులుకు రూ.400, సోయాకు రూ.450, జొన్నలుకు రూ.400, మొక్కజొన్న రూ.330 బోనస్ ఇస్తానని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటనను అమలు చేయాలని అన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని కోరారు. కేంద్రం ఆయిల్ పామ్ పై దిగుమతి సుంకాలను 27.5 నుంచి 16.5 శాతానికి తగ్గించిందని అన్నారు. సహకార రంగాన్ని




కాపాడుకొని రైతుల ప్రయోజనాలు కాపాడుకునే విధంగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు కేంద్ర ప్రభుత్వ విధానాల వలన భవిష్యత్తులో ఉండవని, వ్యాపారులకే రైతులు పత్తిని అమ్మాలని, కనీస మద్దతు ధర కంటే వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తే ఆ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చడానికి ఎంఎస్పీలో గరిష్టంగా 15 శాతాన్ని కేంద్రం చెల్లిస్తుందని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు నుండి తప్పుకుంటుందని అన్నారు. పత్తి ధరల వ్యత్యాస చెల్లింపుల పథకం పీడీపీఎస్ రైతులకు నష్టదాయకమని అన్నారు. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాలను రద్దు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశీయ మార్కెట్లో పత్తి ధర పతనం అవుతుందని అన్నారు. రైతులు మరిన్ని కష్టాలు, అప్పుల పాలవుతారని తెలిపారు. సి2o50 శాతం కన్నా రూ.2,365 తక్కువగా కనీస మద్దతు ధర రూ.7,710 ఉందని అన్నారు. రైతుల ఆత్మహత్యల్లో పత్తి రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. రైతులు పండించిన పత్తి గిట్టుబాటు ధర లేక అప్పుల పాలు అవుతున్నారని అన్నారు. ఆత్మహత్యలు చేసుకోవడం నిత్యం చూస్తున్నామని అన్నారు. దిగుమతి సుంకం ఎత్తివేస్తూ కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రమాదకరమని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల సుధాకర్, గైని సాయిలు, నాయకులు సాలావత్ నారాయణ నాయక్, భానవత్ దేవ్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి




- చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి మీద దాడి చేయడం అంటే న్యాయ వ్యవస్థ మీద రాజ్యాంగ స్ఫూర్తి
- మీద దాడి చేయడమే సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ కే రక్షణ లేకపోతే సాధారణ దళితుల పరిస్థితి ఏమిటి..
- దాడి ఘటనను సుమోటో గా స్వీకరించి నిందితులపై క్రిమినల్ కేసులు బుక్ చేయాలి

**రాయికల్ అక్టోబర్ 17(జనం సాక్షి ):**
భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై బూటు విసిరి దాడికి పాల్పడ్డ అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా రాయికల్ మండల్ తహసిల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దొబ్బల వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిరసన ధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్ఎస్పి జిల్లా అధ్యక్షుడు దుమల గంగారం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయి దళితుడు కావడం వల్లనే ఈ దాడి జరిగిందని అన్నారు. గవాయ్ స్థానంలో అగ్రకులాలకు చెందిన జడ్జి ఉంటే ఈ దాడి జరిగి ఉండేది కాదని అన్నారు. గవాయిపై జరిగిన దాడితో దళితుల ఆత్మగౌరవం ప్రమాదంలో పడింది అని అన్నారు. దళితులు ఉన్నత స్థానంలో ఉండడాన్ని ఉన్నత వర్గాలకు చెందిన శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయని, ఈ సంఘటన జరిగి పది రోజులు గడుస్తున్న ఇప్పటికీ నేరస్తుడి మీద కేసులు పెట్టకపోవడం, అరెస్ట్ చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నో సంఘటనల మీద కేసులు సుమోటో గా తీసుకుంటున్నటువంటి పోలీసు వ్యవస్థ అలాగే న్యాయవ్యవస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మీద దాడి జరిగితే ఎందుకు సుమోటోగా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిపై కేసు నమోదు చేయకపోతే ఈదేశంలో సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందని ప్రశ్నించారు . ఇకనైనా తక్షణమే దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని , వెంటనే కేసు నమోదు చేయాలని అలాగే ఈ సంఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిజే పై దాడి చేయడం అంటే యావత్తు న్యాయ వ్యవస్థ మీద, భారత రాజ్యాంగం మీద ప్రజాస్వామ్య స్ఫూర్తి మీద దాడి చేయడమేనని, ఇలాంటివి ఈ వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమైనదని మండిపడ్డారు. రాజ్యాంగ విలువల పట్ల లోతైన అవగాహన, సామాజిక న్యాయం పట్ల స్పష్టత, ఎన్నో చారిత్రాత్మకమైన తీర్పులు వెల్లడించిన జ్ఞాన సంపన్నుడిగా పేరుగాంచిన, రాజ్యాంగమే ప్రామాణికంగా భావించే న్యాయ కోవిదుడిపై దాడికి దిగడం అనాగరికమైన చర్య అని, ఈదాడికి పాల్పడ్డ నిందితుని అరెస్ట్ చేసేంతవరకు, దళితులకు రక్షణ కల్పించేంతవరకు ఈ పోరాటం ఆగదని అన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అక్టోబర్ 27న లక్షలాది మందితో హైదరాబాదులో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను నిర్వహించి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయికల్ మండల ప్రధాన కార్యదర్శి బెక్కెం వెంకటేష్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పాలేపు బాలరాజ్ లింగంపెల్లి రాజేష్ నిఘా రాజేష్ బిరుదుల హరీష్ రేవా వెంకటేష్ బిరుదుల శేఖర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వడమే

# కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- "ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశానికి" ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 17 (జనంసాక్షి):** కరీంనగర్ రూరల్ మండలం బహద్దూర్ ఖాన్ పేట్ లో పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, నగరంలోని అన్ని డివిజన్లలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇళ్లు ఇస్తామని ప్రజా పాలన లో దరఖాస్తు చేసుకుని భూమిఉండి అర్హత కలిగిన వారికి ఏదైనా కారణం చేత ఇల్లు మంజూరు కాకపోతే వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజక వర్గానికి 3500 ఇళ్లు నిర్మించి ఇస్తామని కరీంనగర్ నియోజక వర్గంలో ఇంకా పూర్తి కాలేదని అర్హులకు అవకాశం ఉందని నరేందర్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. లబ్ధి దారులు ఆకుల రమ్య రవీందర్ కుటుంబసభ్యులకు నరేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల్ అధ్యక్షులు కంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిని తిరుపతి, గుర్రం బాపురెడ్డి, బూర్గు తిరుపతి గౌడ్, బుర్ర స్వామి గౌడ్, బుర్ర నారాయణ గౌడ్, కూర నరేష్ రెడ్డి, పల్ల ఆంజనేయులు, తప్పట్ల ఆంజనేయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




## డిసిసి అధ్యక్ష పదవికి అభిప్రాయాల సేకరణ

**నిజంసాగర్ అక్టోబర్ 17 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్ష పదవికి నామినేషన్ల పర్వం కొనసాగడంతో ఆయా నియోజక వర్గాల కార్యకర్తల అభిప్రాయాల సేకరణలో భాగంగా శుక్రవారం నాడు నిజాంసాగర్ మండల కేంద్రంలో గుల్లస్థ ప్రాంగణంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐసిసి అబ్జర్వర్ రాజుపాల్ కరోల హాజరయ్యారు. ఆయనకు జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ముఖ్య నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంఘటన సృజన్ కార్యక్రమానికి విచ్చేసినట్లు ఆమె తెలిపారు ఆయన మాట్లాడుతూ ఓట్ చోర్ గద్దె చోడ్ సిగ్నేచర్ కంపెనీ నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓటు చోర్ ద్వారా గద్దెనెక్కి కూర్చున్నారని మండిపడ్డాడు. ఏమాత్రం దేశంపై అభిమానం ఉన్న ప్రధానమంత్రి గద్దె దిగాలని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సిగ్నేచర్ క్యాంపైను ఏర్పాటు చేసి కార్యకర్తల సంతకాలను సేకరించి అధిష్టానానికి పంపుతున్నట్లు తెలిపారు. జూకల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సభను ఉద్దేశించి మాట్లాడుతూ అధిష్టానం చూపించిన విధంగా డిసిసి అధ్యక్ష పదవి కొనసాగుతుందని అన్నారు. గ్రామస్థాయి మండల స్థాయిలా కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయం మేరకు డిసిసి ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలా శ్రీనివాస్ గుప్తా, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, పిట్లం ఏఎంసీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, మండల ఎన్ఎస్ఐయు నాయకులు ఇమ్రోజ్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# లీడర్ అంటే ఖద్దర్ కాదు..
# ప్రజాసేవ



- నిత్యం ప్రజాసేవలో వెన్నమనేని
- ఎమ్మెల్యే సహకారంతో గ్రామ అభివృద్ధి

**మర్రిగూడ, అక్టోబర్17 (జనం సాక్షి)**
లీడర్ అంటే ఖాద్దార్ బట్టలు వేసుకునే నాయకుడు కాదు... ప్రజాసేవే కర్తవ్యం గా భావించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తీర్చాలని నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్నమనేని రవీందర్రావు అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలం లోని రాంరెడ్డి పల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షానికి గ్రామంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డు మధ్యలో నీళ్లు నిలిచి పెద్ద మడుగు లాగా ఏర్పడి రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారాయి. రైతులు పండించిన పంటను గ్రామానికి తీసుకురావడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్న నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్నమనేని రవీందర్రావు వెంటనే స్పందించి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో శుక్రవారం రాంరెడ్డి పల్లి నుండి తాందారుపల్లి డొంకదారి సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డును మొరం పోయించి చదును చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఆ దారి గుండా వెళ్లే రైతులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి రవీందర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతిమలో ఉచిత పిల్లల గుండె శస్త్ర చికిత్స శిబిరం

**పిడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్**
**అమిత్‌కుమార్**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :**
ప్రతిమ వైద్య కళాశాలలో ఈనెల 19 నుంచి 25 వరకు ఉచిత చిన్న పిల్లల గుండె శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు పిడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ అమిత్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం రోజు నగరంలోని ప్రతిమ కాన్ఫరెన్స్ హాల్‌లో గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుమన్‌దత్త, డాక్టర్ విద్యాసాగర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతిమ ఫౌండేషన్, హీలింగ్ లిటిల్ హార్ట్స్ లండన్ వారి సహకారంతో 8వ విడత ఈ శిభిరం నిర్వహిస్తు న్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో 18 సంవత్సరాల లోపు 16-18 మంది పిల్లలకు ఎమర్జెన్సీని బట్టి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. 2017 ప్రారంభమైన ఈ ఉచిత వైద్య శిభిరంలో ఇప్పటి వరకు 120 మందికి శస్త్ర చికిత్సలు పూర్తి చేశామని అందులో 7 రోజుల శిశువులు ఉన్నారని తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ శిభిరం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ శస్త్ర చికిత్సలను డాక్టర్ దన్నపనేని రమణ పిడియాట్ర ిక్ కార్డియాక్ సర్జన్ బందం సహకారంతో ప్రతిమ కార్డియాలజి బందం నిర్వహిస్తుందని తెలిపారు. చిన్న పిల్లల శస్త్ర చకిత్సలు అవసరమున్న వారు రిజిష్టరు చేసుకుంటే వారి ఎమర్జెన్సీని బట్టి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశం లో ప్రతిమ మెడికల్ కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్, వెటర్నరీ నర్సింగ్ కళాశాలలు అప్పయిపల్లిలోనే నిర్మించాలని డిమాండ్

- మేముసైతం అప్పాయిపల్లి అభివృద్ధి కోసం శాంతియుత నిరసన దీక్ష



**కొడంగల్ అక్టోబర్ 17 (జనం సాక్షి):** కొడంగల్ మండలం అప్పాయిపల్లికి కేటాయించిన మెడికల్, వెటర్నరీ నర్సింగ్ కళాశాలలు అప్పయిపల్లిలోనే నిర్మించాలని ప్రధా న డిమాండ్తో అప్పాయిపల్లి మెడికల్ కళాశాల అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచ రణ కమిటీ ఆధ్వర్యంలో మేము సైతం అప్పాయిపల్లి అభివృద్ధి కోసం శాంతియుత నిరసన దీక్ష అప్పాయిపల్లి (ఎరన్ పల్లి) గ్రామ స్తులు గ్రామంలో విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు, విద్యావంతులు ర్యాలీ నిర్వహించి మా గ్రామానికి కేటాయించిన మెడికల్,వెటర్నరీ,నర్సింగ్ కళాశాల లు ఇక్కడే నిర్మించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ నిరసన దీక్షకు కేడిపి సిజేఏసీ మరియు ఉరుమేశ్వరం గ్రామ ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరిగింది. కేడిపి జేఏసీ కో కన్వీనర్ ఎరన్ పల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేడిపి జెఎసి సలహాదారులు,కో కన్వీనర్స్ ఎరన్ పల్లి శ్రీనివాస్,గంటి సురేష్ కుమార్, రమేష్ బాబు,మధు యాదవ్, వెంకట్రామిరెడ్డి,మాసాని వెంకటయ్య,భీమ్ రాజ్, శివకుమార్ సింగ్, బొడ్రాయి వెంకటయ్య, ఉడిమే శ్వరం మధు మాట్లాడుతూ అప్పయ్యపల్లి 19 సర్వే నెంబర్ రైతుల దగ్గర నుండి మెడికల్, వెటర్నరీ,నర్సింగ్ కళాశాలలు నిర్మిస్తామని భూమి తీసుకుని పనులు మొదలుపెట్టి ఇక్కడి ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే వేరే ప్రాంతా నికి కళాశాలలను తరలించడం ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం జరుగు తుంది కాబట్టి మెడికల్, వెటర్నరీ,నర్సింగ్ కళాశాలలను ఇక్కడే నిర్మించాలని తద్వారా వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి మీరిచ్చిన వరంగా భావిస్తారని విన్నవించడం జరిగింది. అవసరమైతే రేపు జరగబోయే స్థానిక సంస్థల (ఎంపీటీసీ, జెడ్పిటిసి, సర్పంచ్) ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇచ్చి ఇనానమస్ ఎన్నిక చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రైతులు మాజీ సర్పంచ్ దత్తు సింగ్, మ్యాతరి సంగప్ప, ఉపసర్పంచ్ మల్లప్ప,దొబ్బలి పకీరప్ప,గోకుల్ సింగ్,గుడిసె వెంకటప్ప,దొడ్ల వెంకటయ్య, అమృతప్ప, మాజీ ఎంపీటీసీ శీను నాయక్, రాములు గౌడ్, బాల్రాజ్ గౌడ్, గిర్మీ కిష్టప్ప, శేఖర్, భగవంతు, అగ్గనూరు మల్లప్ప,అశోక్ గౌడ్, శివప్రసాద్, మల్లప్ప, మహిళా సంఘాలు, కమలమ్మ, సుశీల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఇద్దరు అధికారులు

- 50 వేల లంచం కోసం డిమాండ్ చేసిన అధికారులు
- 40 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- డ్రైవర్‌తో సహా ముగ్గురిపై కేసు
- రంగారెడ్డి జిల్లా రేంజ్ ఎసిబి డిఎస్పి ఆనంద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 17 (జనం సాక్షి) :** చిన్న జిల్లా అయిన అవినీతి తిమింగలాలు జిల్లాలో భారీగా తిష్ట వేశాయి. జిల్లాలో తరచుగా ఏసీబీ దాడులు జరుగుతున్నాయి. అయినా అధికారులు లంచం పుచ్చుకోవడంలో ఒక అడుగు ముందులో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏసీబీ దాడులు జరుగుతున్న అధికారుల్లో భయం భక్తి లేదు. అవినీతి సొమ్ముకు అలవాటు పడిన అధికారులు తమ కార్యాలయానికి వచ్చే వ్యక్తులను పీడించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పనితీరుపై విసుగు చెందిన సామాన్యుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడం జిల్లాలో ఆనవాయితీగా మారింది. అందులో భాగంగానే శుక్రవారం నాడువికారాబాద్ జిల్లా పరిగి అటవీశాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. అటవీ శాఖలో సెక్షన్ అధికారులుగా పనిచేస్తున్న సాయికుమార్ మహమ్మద్ మోహినుద్దీన్ పర్మిట్ ఇచ్చే విషయంలో 40 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసే రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. డ్రైవర్ బాలకృష్ణ ద్వారా కాంట్రాక్టర్ నుంచి 40 వేల లంచం తీసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా రేంజ్ ఎసిబి డి.ఎస్.పి ఆనంద్ కుమార్ తెలియజేశారు. మూడు మండలాలలోని సీతాఫలాల పండ్ల సేకరణ కోసం టెండర్లలో 18 లక్షల టెండర్లు వేయగా ప్రతిరోజు వాహనాల పర్మిట్ ఇవ్వడం కోసం సెక్షన్ అధికారులు ఇద్దరు 50 వేల రూపాయలు డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది సీతఫల్ సేకరణ కోసం అటవీశాఖ టెండర్లను ఆహ్వానిస్తుంది. అందులో భాగంగా ఒక కాంట్రాక్టర్ కు జిఎస్టి తో కలిపి 18 లక్షలకు టెండర్ ఖరారు అయింది. అటవీ శాఖ నిబంధనల ప్రకారం సదర్ కాంట్రాక్టర్ కు రోజు 50 వేల రూపాయలు విలువచేసే ఫలాలను తరలించడానికి వాహనాలకు అటవీ శాఖ అధికారులు పర్మిట్ ఇవ్వవలసి ఉంది. అయితే ఈ పర్మిట్ ఇవ్వడానికి సెక్షన్ అధికారులు సాయికుమార్, మహమ్మద్ మోహినుద్దీన్, వారితోపాటు డ్రైవర్ బాలకృష్ణ డిమాండ్ డిమాండ్ చేశాడు . అధికారులకు డబ్బులు చెల్లించనందున పర్మిట్లు రాత్రివేళ ఆలస్యంగా ఇవ్వడంతో వాహనాలు సేకరించిన ఫలాలను మార్కెట్ కు తరలించడంలో ఆలస్యం జరుగుతున్న కారణంగా సీత ఫలాలు చెడిపోయి సదరు కాంట్రాక్టర్ కు రోజు నష్టం జరుగుతూ వస్తుంది. ఇలా రోజు అధికారులు ఇబ్బంది పెట్టడంతో విదిలేని పరిస్థితిలో అటవీ శాఖ అధికారులకు 50 వేల లంచం ఇవ్వడానికి అంగీకరించారు. అందులో భాగంగానే40 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ తెలిపారు దీంతో ఇద్దరు అటవీ శాఖ తో పాటు డ్రైవర్ బాలకృష్ణ పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలియ చేశారు. పరిగి అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ పాత్ర పై దర్యాప్తు జరుపుతున్నట్లు తెలియజేశారు.



### రాజన్న జిల్లాలో ఇదీ పరిస్థితి

**జిల్లాలోని పాఠశాలలు- 525 ఉపాధ్యాయులు- 2577 విద్యార్థులు - 48239** పర్యవేక్షణ బృందాల విధానం ఉన్నత పాఠశాల పర్యవేక్షణకు మూడు బృందాలు 27 మంది ఉపాధ్యాయ సభ్యులు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు ఒక బృందం 3 ఉపాధ్యాయులు. ప్రాథమిక పాఠశాలకు 3 బృందాలు 9 మంది ఉపాధ్యాయులను నియమించనున్నారు. ఇప్పుడు కమిటీల పేరుతో ప్రాథమిక పాఠశాలల నుండి 9, ప్రాథమికోన్నత పాఠశాలల నుండి 3, ఉన్నత పాఠశాలల నుండి 27, మొత్తం 40 మంది ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 230 ఎస్జీటీ పోస్టులు,సుమారు 100 వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 317 తాత్కాలిక డిప్యుటేషన్ లో ఎంత మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు వెళ్తారో తెలియని పరిస్థితుల్లో 40 మంది ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం అవసరమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఉపాధ్యాయులు నిరంతరం నివేదికలు,ఫారాలు, ఫోటోలు పంపండి, నివేదికలు అప్‌లోడ్ చేయండి టెక్నాలజీ (సాంకేతికత) కోసం అతిగా ఒత్తిడి జరుగుతుంది. ప్రతి సబ్జెక్టుకు ఇప్పుడు డిజిటల్ టూల్స్, యాప్‌లు, స్మార్ట్ బోర్డులు అవసరం. గ్రామీణ ఉపాధ్యాయులలో ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులు వందలాది మంది విద్యార్థులకు విద్యా బోధన నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛ, గౌరవం, నమ్మకం ఇవ్వకపోతే, రేపటి విద్య నిర్జీవంగా మారుతుంది.

# మానిటరింగ్‌లో మాస్టర్లు
# పాఠాలు చెప్పేదెవరు?

*ప్రభుత్వ పాఠశాలల బోధన నాణ్యతను పెంచేందుకు ఏర్పాటైన మానిటరిం గ్ టీమ్‌లు, ఇప్పుడు బోధనకు అడ్డుపడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నా యి. పర్యవేక్షణ కోసం ప్రతి రోజూ కొంతమంది ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు పంపిస్తుండటంతో, ఆయా పాఠశాలల్లో తరగతులు బోధించే వాళ్లు లేక పిల్లలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు.*

## పెరుగనున్న ఉపాధ్యాయుల గైర్హాజరు

- బోధన, విద్యార్థులపై ప్రభావం
- తల్లిదండ్రులలో ఆందోళన
- పర్యవేక్షణకు సమర్థమైన పద్ధతి అవసరం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (జనంసాక్షి) :**
ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలో తనిఖీలు చేపట్టాలని సర్కార్ నిర్ణయి స్తూ సీనియర్ టీచర్లతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 300 టీమ్స్ ఏర్పాటు చేస్తుండగా 1473 మంది టీచర్లు బోధనకు దూరం కానున్నారు. రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో విద్యా ప్రమాణాలు,బోధనలో క్వాలిటీ మెరుగుపర్చేందుకు గవర్నెంటు ప్రైమరీ, అప్పర్ ప్రైమరీతో పాటు హైస్కూళ్లలో అకడమిక్ పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో సీనియర్ టీచర్లతో ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్ లను ఏర్పాటు చేయాలని,తనిఖీలు ప్రారంభించేలా చర్యలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,474 ప్రైమరీ, 3,100 అప్పర్ ప్రైమరీ, 4,672 హైస్కూళ్లు ఉన్నాయి. ప్రతి జిల్లాలో స్కూళ్ల సంఖ్యను బట్టి ప్రైమరీ, యూపీఎస్,హైస్కూళ్లకు తనిఖీ టీమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రైమరీ,అప్పర్ ప్రైమరీ స్కూల్ టీమ్ లు ప్రతి మూడు నెలల్లో వంద స్కూళ్లను తనిఖీ చేయాల్సి ఉంది. హైస్కూళ్ల కోసం వేసిన కమిటీలు 50 స్కూళ్లను తనిఖీ చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రైమరీ స్కూళ్ల కోసం 168 టీమ్ లు, యూపీఎస్ ల కోసం 35, హైస్కూళ్ల కోసం 96 టీమ్ లను ఏర్పాటు చేయనున్నారు.

**కమిటీలు ఇలా...**
జిల్లాల్లోని స్కూళ్ల సంఖ్య ఆధారంగా టీమ్ లను ఏర్పాటు చేయనున్నారు. ప్రైమరీ స్కూల్ ఇన్స్పెక్షన్ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. నోడల్ ఆఫీసర్ ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ తో పాటు ఇద్దరు ఎస్జీటీలు ఉంటారు. యూపీఎస్‌ఈ తనిఖీ టీమ్స్ లో స్కూల్ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ గా, పీఎస్ హెచ్‌ఎం, ఎస్ జీ టీ లు సభ్యులుగా ఉంటారు. హైస్కూల్ ఇన్ స్పెక్షన్ టీమ్ లో మొత్తం 9 మంది ఉండనున్నారు. జీహెచ్‌ఎం నోడల్ ఆఫీసర్ గా, ఏడుగురు సబ్జెక్టు టీచర్లు, ఒక ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీడీ) సభ్యులుగా ఉంటారు. తనిఖీ అధికారులకు కనీసం పదేండ్ల అనుభవం, సబ్జెక్టులో నైపుణ్యంతో పాటు ఇన్ సర్వీస్ ట్రైనింగ్ లో పాల్గొన్న అనుభవం ఉండాలనే నిబంధన పెట్టారు. ఈ కమిటీలను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడే కమిటీ ద్వారా నియమించనున్నారు. దీంట్లో ఎంపికైన టీచర్లంతా పూర్తిస్థాయిలో తనిఖీలకే అంకితమవుతారు.



ప్రస్తుతం వాళ్లు పనిచేస్తున్న బడుల్లో ఇతరులను నియమించి, అక్కడి పిల్లలకు క్లాసులు చెప్పించనున్నారు. ఈ కమిటీలన్నీ ఈ అకడమిక్ ఇయర్ పరిమితం కానున్నాయి.

**తరగతుల్లో విద్యార్థులు, బయట టీచర్లు..!**
మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో రోజువారీ హాజరు ఉన్నప్పటికీ, తరగతులు మాత్రం అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఒకరు పర్యవేక్షణలో,మరొకరు శిక్షణలో,ఇంకొకరు సర్వేల్లో పాల్గొన డం వల్ల పాఠశాలలు ఖాళీగా మారుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చదువు చెప్పేది ఎవరు తల్లిదండ్రులు..?**
ప్రతి పాఠశాలలో బోధనపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం చెబుతుండగా,ఫీల్డ్ ఇన్స్పెక్షన్లు, ర్యాలీలు, రిపోర్టులు పేరుతో ఉపాధ్యాయులు తరగతులను వదిలి తిరుగుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రాజన్న జిల్లా ఇడీ పరిస్థితి - సమాచారం**

| వర్గం | సంఖ్య |
|---|---|
| పాఠశాలలు | 525 |
| ఉపాధ్యాయులు | 2577 |
| విద్యార్థులు | 48239 |

**తెలంగాణలో స్కూళ్ల సంఖ్య:**

| రకం | సంఖ్య |
|---|---|
| ప్రైమరీ | 16,474 |
| అప్పర్ ప్రైమరీ | 3,100 |
| హైస్కూళ్లు | 4,672 |
| మొత్తం | 4,246 |

**టీమ్‌ల వివరాలు:**

| రకం | టీమ్‌లు | తనిఖీలు(3 నెలలకు) |
|---|---|---|
| ప్రైమరీ | 168 | 100 |
| అప్పర్ ప్రైమరీ | 35 | 100 |
| హైస్కూళ్లు | 96 | 50 |
| మొత్తం | 300 | 1,473 టీచర్లు |

**తెలంగాణ సర్కారు స్కూళ్లలో టీచర్ల సంఖ్య**
**(2025-26 ఏడాది)**

| వివరాలు | సంఖ్య |
|---|---|
| మొత్తం టీచర్లు | 1,04,605 |
| అవసరమైన టీచర్లు | 99,076 |
| సర్ప్లస్ టీచర్లు | 21,140 |
| కావాల్సిన టీచర్లు | -15,611 |

**ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయవద్దు.**
**ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మణ్.**



పాఠశాలల తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం సమంజసం కాదు. ఇప్పటికే జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్నందున, వర్క్ అడ్జస్ట్మెంట్‌లో ఇతర పాఠశాలలకు పంపుతున్నారని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి. తనిఖీ కమిటీల ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి.

**సుశిక్షితులైన వారితో పర్యవేక్షణ మేలు.**
**శ్రీనివాస్ రావు, జిల్లా అధ్యక్షుడు, పీఆర్టీయు సిరిసిల్ల.**



విద్యాలయాల్లో బోధన విధానాన్ని బోధన అభ్యసన తీరును, టీచింగ్ మెటీరియల్ తదితర విషయాలను పర్యవేక్షణ చేయడం శుభ పరిణామం. కానీ పాఠశాలలో పనిచేసే సహ ఉపాధ్యాయులే పర్యవేక్షణలో ఉండడం ఉపాధ్యాయుల మధ్య అంతర్గత విభేదాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయి. అందుకే పాఠశాల స్థాయిలో కాకుండా డైట్, బీఈడీ కళాశాలలో ఉన్న సుశిక్షితులైన వారితో పర్యవేక్షణ మంచి ఫలితాలు ఇస్తుంది.

**పర్యవేక్షణ కమిటీలతో లాభాలు.**
**చిప్ప యాదగిరి. పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు.**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పర్యవేక్షణ కమిటీలకు మంచి లాభాలే ఉంటాయని పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చిప్ప యాదగిరి అన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల్లో రెగ్యులర్ ఎంఈఓలు, డిప్యూటీ డిఇఓ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఉన్నాయన్నారు. పర్యవేక్షణ కమిటీలు వాళ్లు పరిశీలించిన పాఠశాలలో ఉన్న పరిస్థితులను ఉన్నత అధికారులకు నివేదికలు అందజేస్తారన్నారు.

## ఆరు గ్యారంటీల అమలు కోసం కవిత పోరాటం

**జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి**

**మహేశ్వరం,అక్టోబర్17(జనం సాక్షి):**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేసే వరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పోరాటం చేస్తుందాన్ని రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా జాగృతి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ... సామాజిక తెలంగాణ కోసం, సమాన న్యాయం కోసం కవిత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జనం బాట పట్టిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్,నరేష్, ముస్తఫా, రామకోటి, రాము యాదవ్, నవీన్ గౌడ్, సందీప్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి అందుగుల సత్యనారాయణ, బాబురావు, రమేష్, వేద భవాని, అభిషేక్ రెడ్డి, సాల్వా చారి, బాలాజీ ఉదయ్, రవి నాయక్, స్వప్న, భార్గవ యాదవ్, రాజ్ కుమార్ ,శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ కాలని సిహెచ్‌బిఎస్ సంఘం రద్దుకు అభ్యంతరాలు తెలుపండి

**వనపర్తి బ్యూరో అక్టోబర్ 17 జనంసాక్షి :**
వనపర్తి జిల్లా నందు ఉన్న శాంతినగర్ కాలని సి.హెచ్.బి.ఎస్. వనపర్తి సంఘం, దీర్ఘకాలికంగా ఎటువంటి కార్యకలాపాలను నిర్వహించట్లేదు, సుప్త చేతనావస్థలో ఉన్నది. తెలంగాణ రాష్ట్ర సహాకార సంఘముల చట్టం 1964, సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారము జిల్లా సహాకార అధికారి కార్యాలయం వనపర్తి వారు శాంతినగర్ కాలని సి.హెచ్.బి.ఎస్. వనపర్తి సంఘంను పరిసమాప్తము చేయటకు, మహబూబ్ అలి, సీనియర్ ఇన్స్పెక్టర్, శాంతినగర్ కాలని సి.హెచ్.బి.ఎస్. వనపర్తి సంఘానికి లిక్విడేటర్ గా నియమించడం జరిగినది. కావున శాంతినగర్ కాలని సి.హెచ్.బి.ఎస్. వనపర్తి సంఘ సభ్యులకు తెలియజేయునది ఏమనగా సంఘము పరిసమాప్తము చేయుటపై ఏమైన అభ్యంతరాలు ఉన్నచో తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా పత్రికా ప్రకటన వెలుబడిన తేది నుండి 15 రోజుల లోపు జిల్లా సహకార అధికారి వనపర్తి కార్యాలయం నందు ప్రభుత్వ కార్యాలయ పని వేళల్లో అనగా ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రము 5.00 గంటల లోపు తమ అభ్యంతరాలు సమర్పించగలరని ప్రకటన లో కోరారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

## ఆర్ఆర్ ఇమేజ్ అండ్ ఫీటల్ మెడిసిన్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా మెరుగైన వైద్య సేవలు అందించి మన్ననలు పొందాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ ఇమేజ్ అండ్ ఫీటల్ మెడిసిన్ సెంటర్ ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.జిల్లా కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం ఆర్ఆర్ ఇమేజ్ అండ్ ఫీటల్ మెడిసిన్ సెంటర్ ను ఏర్పాటు చేసిన డాక్టర్ రాకేష్, డాక్టర్ రేవతిని అభినందించారు.ఈ నెల 25న హుజూర్ నగర్ లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సహకారంతో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.దాదాపుగా 150 ప్రైవేటు కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు.2వేల నుంచి 5వేల వరకు ఉద్యోగ అవకాశాలు యువతకు లభించే అవకాశం ఉందన్నారు.అనంతరం డాక్టర్ మట్టా రాకేష్ మాట్లాడుతూ ఆర్ఆర్ ఇమేజ్ అండ్ ఫీటల్ మెడిసిన్ సెంటర్ లో అల్ట్రా సౌండ్ స్కాన్, డాప్లర్ స్టడీస్, ఫెటల్ స్కాన్స్, ఫెటల్ ఇంటర్వెన్షన్స్,రేడియోలాజికల్ ఇంటర్వెన్షన్స్, జెనెటిక్ అండ్ బ్లడ్ టెస్ట్ లు, సిటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అందరికీ అందుబాటులో ఉండే విధంగా నూతనంగా ఏర్పాటు చేసిన తమ మెడిసిన్ సెంటర్ ను ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, పీసీసీ నాయకులు చకిలం రాజేశ్వర రావు,సీహెచ్.లక్ష్మీనారాయణ రెడ్డి,డాక్టర్ జాస్తి సుబ్బారావు, మట్టా పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్,డాక్టర్ మట్టా రాకేష్, డాక్టర్ చందు రేవతి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి.అంజద్ అలీ,నాయకులు చింతమల్ల రమేష్, తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, రావుల రాంబాబు,మేకల శ్రీనివాస్, బైరు శైలేందర్, నాగుల వాసు,రంగు దిలీప్ కుమార్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు

- రూ.5 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 33 సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు
- ఫైల్‌పై సంతకం చేసిన మంత్రి సీతక్క
- ఆర్థిక శాఖ ఆమోదం పొందగానే కేంద్రాల ఏర్పాటు




హైదరాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి) : దంపతులు వివాహ బంధంలో అడుగుపెట్టే ముందు ఆ బంధం యొక్క బాధ్యతలను, భావోద్వేగ గాఢతను, పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకునేలా ప్రత్యేక కౌన్సెలింగ్ అవసరమని తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. దీనికి సమర్థమైన పరిష్కారంగా వివాహ పూర్వ కౌన్సెలింగ్ సెంటర్లు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఈ నేపథ్యంలో వివాహ పూర్వ కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ సిద్ధం చేసిన ఫైల్ పై మంత్రి సీతక్క శుక్రవారం సంతకం చేశారు. ఈ కేంద్రాలు వివాహ బంధానికి సిద్ధమవుతున్న యువజంటలకు పరస్పర అవగాహన, వివాద పరిష్కారం, భావోద్వేగ అనుకూలత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడమే కాకుండా, చట్టపరమైన హక్కులు, కుటుంబ బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయి. ఈ కౌన్సెలింగ్ వల్ల వివాహం ప్రారంభ దశలోనే తలెత్తే విభేదాలు తగ్గి, గృహహింస, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోందని, ప్రతి జిల్లాలో ఒక వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుతో కుటుంబ విభేదాలు, గృహహింస, విడాకులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, యువ దంపతుల భావోద్వేగ, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఇది సమాజంలో స్థిరమైన, సంతోషకరమైన కుటుంబ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా తీసుకున్న ఒక ముందడుగు అవుతుందని తెలిపారు.

### గన్ కల్చర్ తెచ్చిందే బిఆర్ఎస్

మాజీ మంత్రి హరీష్ రావు చేసిన ఆరోపణలపై పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె,క్యాబినెట్ సమావేశంపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని ఖండించారు. "నా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి చెబుతున్నా.. నన్ను కన్న సమ్మయ్య, సమ్మక్క సాక్షిగా చెబుతున్నా.. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఎలాంటి రాద్ధాంతం జరగలేదు. ప్రజల సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపైనే చర్చ జరిగింది. హరీష్ రావు చెప్పిన ఒక్క మాటలో కూడా నిజం లేదు" అని సీతక్క స్పష్టం చేశారు.

### డీపీఓ, డీఎల్పీఓల అద్దె వాహనాల వసతి మరో సంవత్సరం పాటు పొడిగింపు

హైదరాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి) : పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు, డివిజన్ లెవల్ పంచాయతీ అధికారులు వినియోగిస్తున్న అద్దె వాహనాల వసతిని మరో సంవత్సరం పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అద్దె వాహనాల ఫైల్‌కు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 31 మంది జిల్లా పంచాయతీ అధికారులు, 68 మంది డివిజన్ లెవల్ పంచాయతీ అధికారులకు వాహనాల సదుపాయం కొనసాగుతుంది. వారి వాహన అద్దె చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ. 3.96 కోట్లు మంజూరు చేసింది. మంత్రి సీతక్క సంతకంతో సంబంధిత ఫైల్ ఆమోదం పొందింది.

# డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. తెలంగాణలో మత్తు పదార్థాల వ్యసనాన్ని పూర్తిగా అరికట్టాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం ఉంటేనే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనపై పోరులో పోలీసు, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ మేరకు ఇరు డిపార్ట్‌మెంట్ల ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో టీఏఎన్‌బీ(తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో) డైరెక్టర్ సందీప్ శాండిల్య, హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, టీఏఎన్‌బీ ఎస్పీ రూపేశ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్, డాక్టర్ అనిత, న్యాయ శాఖ అడిషనల్ సెక్రటరీ సునీత తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల గురించి సందీప్ శాండిల్య మంత్రికి వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని గుర్తించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తున్నామని, ఆ తర్వాత వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలు అయినవారిని గుర్తించేందుకు ఆరోగ్యశాఖ సహకారం తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడం కేవలం ప్రభుత్వంతో సాధ్యం కాదు అని, సమాజంలోని అన్ని వర్గాలనూ ఈ పోరాటంలో భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, టీచర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటున్న వారిలో వచ్చే బిహేవియరల్ చేంజెస్ గురించిన అవగాహన ప్రతి పేరెంట్‌కు, టీచర్‌కు ఉండాలన్నారు. ఈ విషయంలో విస్తృత ప్రచారం జరగాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తల ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అన్ని విద్యా సంస్థల్లో యాంటి నార్కొటిక్స్ వింగ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ వినియోగం నుంచి బయటపడేసేందుకు అవసరమైన డీ అడిక్షన్ సెంటర్లను బలోపేతం చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని టీచింగ్ హాస్పిటళ్లలో డీఅడిక్షన్ వార్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎర్రగడ్డలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో డీఅడిక్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని, అలాగే అవసరాన్నిబట్టి మరిన్ని సెంటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మత్తు పదార్థాలకు అలవాటైన పిల్లలను తల్లిదండ్రులే డీఅడిక్షన్ సెంటర్లకు తీసుకురావాలని మంత్రి కోరారు. పూర్తి ఉచితంగా వారికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తామని తెలిపారు. పిల్లలకు మత్తు పదార్థాలకు అలవాటైనట్టు గుర్తించాక ఆలస్యం చేయొద్దని, ఆలస్యమయ్యేకొద్దీ వారి ఆరోగ్యం మరింత పాడయ్యే ప్రమాదం ఉంటుందన్నారు.

# తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు



తిరుపతి, అక్టోబరు17 (జనంసాక్షి) : తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించింది. కలెక్టర్ ఛాంబర్‌తో పాటు కార్యాలయంలోని వివిధ శాఖలకు చెందిన గదులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధరించారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయ అధికారిక మెయిల్‌కు తమిళనాడు నుంచి బెదిరింపు మెయిల్ వచ్చినట్టు గుర్తించారు. గడిచిన 15 రోజులుగా బాంబు బెదిరింపుల మెయిల్స్ వరుసగా రావడం కలకలం రేపుతోంది.

# సైబర్ నేరగాళ్ల కొత్త అవతారం

- వృద్ధురాలిని మోసం చేసి 35లక్షలు మాయం



హైదరాబాద్, అక్టోబరు17 (జనంసాక్షి) : డిజిటల్ యుగం కావడంతో దొంగలు.. సైబర్ కేటుగాళ్ల అవతారం ఎత్తారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మన అకౌంట్లను ఖాళీ చేస్తున్నారు. చదువుకున్న వాళ్లు, వృద్ధులు, మహిళలు, యువకులు ఇలా అన్ని వర్గాల వారిని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. 'మీ కొడుక్కి ప్రమాదం జరిగిందంటూ' తాజాగా ఓ మహిళ నుంచి లక్షల్లో డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేశారు. హైదరాబాద్ నగరంలో 61 ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమె కొడుకు లండన్ నగరంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తాజాగా స్టీవ్ అనే వ్యక్తి ఆ పెద్దావిడకు వాట్సాప్ కాల్ చేశాడు. తాను లండన్ లో వైద్యుడిగా పని చేస్తున్నాను అంటూ పరిచయం చేసుకున్నాడు. లండన్ విమానాశ్రయంలో ఆమె కుమారుడికి ప్రమాదం జరిగిందని, తలకు బలమైన గాయమైందని సైబర్ నేరగాళ్లు చెప్పారు. అంతేకాక లగేజ్ మిస్ అవ్వడంతో ఎలాంటి ఐడెంటిటీ లేదని, ఆసుపత్రిలో వైద్యులు చేర్చుకోవట్లేదని చెప్పిన నేరగాళ్లు ఆమెను భయపెట్టారు. దీంతో ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని విడతల వారీగా రూ. 35.23లక్షలు వృద్ధురాలు ఆ కేటుగాళ్లకు పంపింది. తన కొడుకు ఎలా ఉన్నాడో చూసేందుకు ఫొటో, వీడియో పంపించాలని కోరగా.. కాల్ చేసిన వ్యక్తి అందుకు ఒప్పుకోలేదు. అనుమానం వచ్చిన బాధితురాలు కుమారుడి నెంబర్ కు కాల్ చేసింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# తిరుమల లడ్డూ ధరల పెంపు అబద్ధం

- దుష్ప్రచారాలను భక్తులు నమ్మవద్దు
- కొందరు కావాలనే అసత్యప్రచారాలు
- మండిపడ్డ టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు



తిరుమల, అక్టోబరు 17 (జనంసాక్షి) : శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరలను పెంచుతున్నట్లు కొందరు అబద్దాలు ప్రచారం చేయడంపై టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే కుట్రతో ఇలాంటి అవాస్తవాలను ప్రచారం చేయడం తగదన్నారు. లడ్డూ ప్రసాదం ధరల పెంపు వార్తలు పూర్తి అసత్యాలని, ఆధారాలు లేనివని ఆయన ఖండించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. లడ్డూ ప్రసాదాల ధరలను పెంచే ఆలోచనేలేదని ఆయన స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా తిరుమల లడ్డూ ప్రసాదం ధరలను పెంచుతారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. తిరుమల లడ్డూను పెంచేందుకు టీటీడీ ప్రయత్నాలు చేస్తోందంటూ వార్తలు వచ్చాయి. తాజాగా ఈ ప్రచారంపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ... ధరల పెంపుపై క్లారిటీ ఇచ్చారు. శ్రీవారి లడ్డూ ధరలను పెంచే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. లడ్డూ ధరల పెంపు వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. కావాలనే కొన్ని ఛానళ్లు పని గట్టుకొని టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూ ధరల పెంపు అంటూ నిరాధార వార్తలను ప్రసారం చేస్తున్నారని అన్నారు. టీటీడీపై కొన్ని ఛానళ్లు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. లడ్డూ ధరలను పెంచే ఉద్దేశం టీటీడీకి లేదని స్పష్టం చేశారు. టీటీడీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తప్పుడు వార్తలు ప్రసారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని నాయుడు పేర్కొన్నారు.

### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో 11న సెలవు

హైదరాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి నవంబర్ 11న ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. పోలింగ్ రోజున జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

## మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ



నిర్మల్ రూరల్,అక్టోబర్ 17 (జనం సాక్షి) : జిల్లాలోని 47 మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువలు కొనసాగుతున్నాయి.శుక్రవారం ఒక్క రోజునే 160 దరఖాస్తులు వచ్చాయని,ఇప్పటివరకు 360 వరకు దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు.శనివారం రోజున చివరి తేదీ కావడంతో ఇంకా ఎక్కువగా దరఖాస్తుల వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్యాలయంలో ప్రత్యేకంగా 5 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అక్టోబర్ 23వ తేదీన మద్యం దుకాణాల దరఖాస్తులను లాటరీ పద్ధతి ద్వారా,జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి,నిర్మల్ పేరు మీద డిడి తీయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జైపూర్, అక్టోబర్ 17 (జనంసాక్షి) : నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి, షెట్ పల్లి గ్రామాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఏ. ఈ. కాంసాని లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రభుత్వం నిరుపేదలకు అందించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, బేస్ మెంట్, లెంటల్, స్లాబ్ స్థాయిల వారీగా పూర్తి అయిన పనులకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని వేలాల గ్రామంలో గల ఇసుక రీచ్ ప్రాంతాన్ని పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇసుకను తీయాలని, ఇందిరమ్మ పథకంలో ఇండ్ల నిర్మాణాలకు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ముందుగా ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బిసి రిజర్వేషన్ల కోసం ఆంధ్రాలో జెఎసి

- బిసి బిల్లుపై మోడీతో బాబు మాట్లాడాలి
- 26న మరోమారు సమావేశమై జెఎసి ఏర్పాటుకు నిర్ణయం

విజయవాడ, అక్టోబరు17 (జనంసాక్షి): పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్‌లో జేఏసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఎం చంద్రబాబు బీసీ బిల్లుపై ప్రధాని మోడీతో చర్చించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల కోసం పోరాటం చేయటంపై హర్షం వ్యక్తం చేశారు.బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఎంపీ ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు బీసీ కుల సంఘాలు భేటీ అయ్యాయి. డాక్టర్ ఎన్. మారేష్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల నేతలు, ప్రతినిధులు శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న అన్ని బీసీ కుల సంఘాలు కలసి జేఏసీ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్ మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం బీసీ బిల్లుతోనే సాధ్యమని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ బిల్లుపై ప్రధాని మోడీతో చర్చించాలని కోరారు. టీడీపీ బీసీల పార్టీ స్థాయి నుంచి ఓబీసీల పార్టీగా ఎదగాలన్నారు. కేంద్రంలో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న చంద్రబాబు బీసీ బిల్లుపై దృష్టి సారించాలని వినతి చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో దేశ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరుతామన్నారు. చంద్రబాబు బీసీలపై తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు చంద్రబాబుతోనే సాధ్యమని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370